# నీలి తరంగాలు

## బహుజన భావజాలంపై వ్యాఖ్యానం



డా. మర్లపూడి విజయ్ చంద్ర

# నీలి తరంగాలు

## బహుజన భావజాలంపై వ్యాఖ్యానం

డా. మర్లపూడి విజయ్ చంద్ర

**బాబాసాహెబ్ డా. అంబేద్కర్ 135వ జయంతి ప్రత్యేకం**

**ISBN**

**978-93-7151-449-1**

**తెలుగు మూలం**

**eBook**

**వెల: ఉచితం**

**ప్రకాశకులు : రోషన్ పబ్లికేషన్స్. విశాఖపట్నం**

**ఈమెయిల్: roshanpublications@gmail.com**

**చరవాణి: 9493159482**

## ముందు మాట

కాంగ్రెస్ పార్టీ దళితుల పార్టీ, మన పార్టీ అంటూ పెరిగిన బాల్యం, యవ్వనం నావి. నా ప్రయాణంలో కాంగ్రెస్ పార్టీ పరిశోధన విభాగంలో పనిచేసే అవకాశం నాకు కలిగింది. కాంగ్రెస్ పార్టీ లౌకికవాదం, సామ్యవాద ఆలోచన, సామాజిక న్యాయ దృక్పథం, అంతకన్నా ఎక్కువగా రాహుల్ గాంధీ నాయకత్వం, బహుజన అంశాలకు ఆయన ఇచ్చే ప్రాధాన్యత నన్నెంతో ప్రభావితం చేసాయి. ఆయన ఒక వకీలులా 'జిత్నా ఆబాది ఉత్నా హక్' అని నినందించడం, భారత్ జోడో న్యాయ్ యాత్రలో ప్రజలందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని వాగ్దానం చేయడం నన్ను ఈ సాహసం చేయడానికి పురిగొలిపాయి. జిత్నా అబాది ఉత్నా హక్ అనే నినాదం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మౌళిక సిద్ధాంతం; ఉదారవాద ఏకీకరణ నినాదం కాదు, ఇంటెగ్రేషన్ విధానం కాదు.

మన తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రెండు ముఖ్య సూత్రాలైన 'యూనిటీ ఇన్ డైవర్సిటీ', 'కంటిన్యూటీ అండ్ చేంజ్' కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో స్పష్టంగా మనకు కనబడతాయి. అంతే కాదు రాజ్యాంగబద్ధ పాలనను తెచ్చి, రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయానికి మార్గాలు తెరిచి, పంచవర్ష ప్రణాళికలను, నీటిపారుదల బహుళార్థ సాధక ప్రాజెక్టులను కట్టి, బంజర్లను సస్యశ్యామలం చేసి, పరిశ్రమలు పెట్టి ఉత్పాదకత పెంచి, గ్రీన్ రెవల్యూషన్ తెచ్చి ఆహార స్వయం సమృద్ధిని సాధించి, ఐఐటీలను ఐఐఎంలను స్థాపించి, ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసి, అత్యున్నత విద్యాలయాలను, వైద్యులయాలను కట్టించి, మనిషి సగటు జీవిత కాలం పెంచి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించి, అంతరిక్ష పరిశోధనలు చేసి ఉపగ్రహాలను ప్రయోగించి, అణు పరీక్షలు జరిపి, దేశాన్ని శత్రు దుర్భేద్యం చేసి, సంస్థానాలను విలీనం చేసి, బ్యాంకులను జాతీయం చేసి, రాచరికాన్ని రూపుమాపి, ఎస్టేట్లను రద్దుచేసి, జమీందారీ వ్యవస్థను రద్దు చేసి, పేదలందరికీ కూడు గుడ్డ నీడ కల్పించి, భూమి లేని వర్గాలకు భూమి కల్పించి, ప్రజారోగ్యాన్ని పెంచి, పేదలందరికీ ఇళ్ళు కట్టించి, ఐటీ విప్లవాన్ని తెచ్చి, గ్రామీణ పేదలందరికీ గ్యారెంటీగా పని కల్పించేలా చట్టం చేసి, విద్యాహక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, సమాచార హక్కు చట్టం తెచ్చి

ప్రజలందరి గౌరవాన్ని పెంచి, దేశానికి దశదిశ నిర్దేశించిన కాంగ్రెస్ నాయకులంతా బహుజన సాధికారతా భావజాలంతోనే పనిచేశారు.

అగ్ర కులాల వారు చారిత్రకంగా పూజారులు, పాలకులు, భూస్వాములు మరియు వ్యాపారులుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం చలాయించారు. వారి సరసన పాలక కులాలు చేరాయి. అందరూ కలసి సంఘటితమై బహుజనులను పీడిస్తున్నారు. అగ్ర-కుల ఆధిపత్య అధికార నిర్మాణం ఒకటి దేశంలోని రాజకీయ పార్టీలలో ప్రధాన పాత్ర పోషిస్తుందని, అది హిందుత్వ, భూస్వామ్య, పెట్టుబడిదారీ, అగ్రకుల ఆధిపత్య రాజకీయ విధానాలను దేశంపై రుద్దడానికి సామ దాన భేద దండోపాయాలు, టక్కుటమార గజకర్ణ గోకర్ణ విద్యలు ప్రదర్శిస్తుందని, "సామాన్య ప్రజలు" అని అర్థం వచ్చే ఆప్, బహుజన సమాజ్ పార్టీలతో సైతం అన్ని రాజకీయ పార్టీలనూ రిమోట్ కంట్రోల్ ద్వారా ఆ వర్గం నియంత్రిస్తుందని, అవసరమైనప్పుడు అది ఒక ఏకరూప నిర్మాణంగా మారి అన్ని పార్టీలను, సంస్థలను, వ్యవస్థలను నియంత్రిస్తుందని, నేటి రాజకీయాలు, సమస్యలు స్పష్టం చేస్తున్నాయి. మతతత్వ, పెట్టుబడిదారీ, భూస్వామ్య, హిందుత్వం నేడు మత మౌఢ్యంతో, పెట్టుబడిదారీ విధానంతో, సామ్యవాద వటవృక్షం వేర్లు కొరికేసి, బహుజనులను లూటీ చేస్తోంది, రైతులను చంపుతుంది, నిరుద్యోగ యువతను మత మౌఢ్యానికి ప్రేరేపిస్తుంది, విద్యా వైద్య రంగాలను నిర్వీర్యం చేస్తుంది, చరిత్రను వక్రీకరిస్తుంది, దేశంలోని దళిత బహుజన మైనారిటీలపై దమనకాండకు తెగబడుతుంది, న్యాయ వ్యవస్థను నవ్వులపాలు చేస్తుంది, లోపభూయిష్ట ఎన్నికల వ్యవస్థను తయారు చేసి దాన్ని కాపాడుతూ, కొనసాగిస్తుంది, భారతమాతని వివస్త్రని చేసి ఊరేగిస్తుంది. ద్వేషం ఎక్కడా సరైన ఎంపిక కాదు. అయితే ద్వేషం, హింస అగ్రకుల అధికార నిర్మాణపు ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి. కొన్ని చోట్ల బహుజనులు ఐక్యంగా అగ్రకులాలపై తిరగబడుతున్నారు. హింసకు ప్రతిహింస, ద్వేషానికి ప్రతిద్వేషం బహుజనులు చేసే స్థితికి చేరుకున్నారు. ఈ స్థితిని కొనసాగించే కన్నా అగ్రకుల అధికార నిర్మాణాన్ని, దాన్ని వెన్నెముక అయిన పెట్టుబడిదారి విధాన్నాన్ని కూలదోసి, ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయాన్ని అందరికీ పంచే శాస్త్రీయ సామ్యవాద రాజ్యాన్ని నిర్మించాలి.

బహుజన రచయితలు వ్రాసిన పుస్తకాలు, పూలే, అంబేద్కర్, కాన్షీరామ్ పేరున సంఘాలు, రాజకీయ పార్టీలు పెట్టి బహుజన వాదాన్ని, నిరంతర బహుజన అవగాహనను నిలబెట్టడానికి

ప్రయత్నిస్తున్న నాయకులను, సందేశాలను, విధానాలను సునిశితంగా పరిశీలించాక బహుజనవాద పునాది, అవగాహన, భావోద్వేగం, నమ్మకాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలపై కొంత వ్యాఖ్యానం సంకలనం చేయాలన్న ఆలోచన పుట్టింది. ఆ ఆలోచనలో భాగంగా బహుజన భావజాల ప్రయాణాన్ని, ముఖ్య బహుజన నాయకుల భావాలను పరిశీలించి, వివిధ మేధోమధనాలను పోల్చి, స్వచ్ఛమైన బహుజన భావజాలంపై ఈ చిరు వ్యాఖ్యానం మీ ముందుకు తెస్తున్నాను. ఈ వ్యాఖ్యానం ద్వారా బహుజన నాయకత్వ శ్రేణిని ఆలోచింపచేయడం నా ముఖ్య ఉద్దేశ్యం. ఈ వ్యాఖ్యానంలో నా అభిప్రాయాలతో కొందరు విభేధించవచ్చు అది వారి హక్కు.

ముఖ్య వివరణ: అగ్రకులస్తులు అందరినీ ఒకే గాటిన కట్టి ఈ వ్యాఖ్యానంలో మాట్లాడలేదు. అగ్రకులస్తులు అందరూ రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించేవారు కాదు. వారిలో సంస్కారవంతులు, సంస్కరణాభిలాషులు ఉన్నారు. అలాంటివారినెందరినో నా 20 ఏళ్ళ రాజకీయప్రయాణంలో కలిసాను. రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయానికి అడ్డుతగిలే, రాజ్యాంగ హక్కులకు అడ్డుపడే వారినే ఈ వ్యాఖ్యానంలో అగ్ర కులాలు, ఆధిపత్య కులాలు లేదా కుల ఆధిపత్య అధికార నిర్మాణం అని పేర్కొనడం జరిగింది. ఇది విస్తృత సమాజం అర్థం చేసుకోవాలి కోరుతున్నాను. విప్లవాత్మక రాజకీయాలు అధికారంలోకి ప్రవేశించాలని ఆత్రుతపడవు —కానీ అధికారం పరివర్తన చెందాలని కోరుకుంటాయి. పార్టీలు వేరైనా, మన లక్ష్యం ఒక్కటే. అది అసమానతలులేని, అభివృద్ధి చెందిన, అంతరాలు లేని సమసమాజాన్ని నిర్మించడమే. ఈ చిరు వ్యాఖ్యానం బహుజన నాయకులకు కరదీపికగా వారి కర్తవ్య నిర్దేశానికి ఉపయోగపడాలని కోరుకొంటూ, రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయ విప్లవాన్ని ఆహ్వానిస్తూ...
'జిత్నా ఆబాది ఉత్నా హాక్' అని నినందిస్తూ, సవినయంగా నమస్కరిస్తూ..

మీ

డా. మర్లపూడి విజయ్ చంద్ర

విశాఖపట్నం.

14. ఏప్రిల్.2026

నిరంతర బహుజన అవగాహనను నిలబెడుతున్న

అఖిల భారత బహుజన నాయకులకు అంకితం.

# 1. మూల సమస్య

**"బహుజనులు"** అనే పదం ప్రాచీన సంస్కృత మూలాల నుంచి వెలువడినది; "బహు" అంటే అనేకం, "జన" అంటే ప్రజలు—అంటే సూటిగా ఈ పదం "ఎక్కువ మంది ప్రజలు" లేదా "సామాన్య జనులు" అని అర్థం ఇస్తుంది. ఈ పదం తొలిసారిగా బౌద్ధ సాహిత్యంలో ప్రాముఖ్యంగా కనిపిస్తుంది, ముఖ్యంగా గౌతమ బుద్ధుడు ప్రవచించిన "బహుజన హితాయ, బహుజన సుఖాయ" అనే సూక్తిలో, సమాజంలోని విస్తృత ప్రజానీకాన్ని సూచిస్తుంది. కాలక్రమంలో ఈ పదం భారతదేశంలో సామాజిక-రాజకీయ అర్థాన్ని సంతరించుకుంది; జ్యోతిరావు పూలే ఈ భావనను ముందుకు తెచ్చి, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ దాన్ని విస్తరించి, కాన్షీరాం దానికి రాజకీయ రూపాన్ని ఇచ్చారు. ఈ ఆధునిక అర్థంలో "బహుజనులు" అనగా దళితులు, ఆదివాసీలు, ఇతర వెనుకబడిన వర్గాలు మరియు మైనారిటీలు—అంటే సంఖ్యలో ఎక్కువగా ఉన్నా అధికారంలో వెనుకబడిన ప్రజల సమూహం అని భావం; అలా ఈ పదం ఒక సాధారణ అర్థం నుంచి ప్రారంభమై, సమాజ మార్పు కోసం ప్రతిధ్వనించే శక్తివంతమైన ఆలోచనగా రూపాంతరం చెందింది.

"బహుజన" అనే పదానికి అర్థం "అనేకులు" లేదా "మెజారిటీ". ఈ భావనను శక్తివంతంగా ప్రతిపాదించినవారు జ్యోతిరావు పూలే. భారత సమాజం సమానత్వంతో కూడినది కాదు, అసమానతలతో నిర్మితమైనది. వాస్తవానికి శూద్రులు, అతిశూద్రులు మరియు ఇతర అణగారిన వర్గాలే ఈ దేశానికి నిజమైన ఆధారం. కానీ వారికీ స్వరం, గౌరవం, తమ భవిష్యత్తుపై నియంత్రణ లభించలేదు. నాడు ఆయన ప్రారంభించిన జాగృతి కేవలం సంస్కరణ కాదు—ఆత్మగౌరవ విత్తనం. ఆ విత్తనం మరింత బలమైన మొక్క అయ్యింది. డా బి ఆర్ అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం అసంపూర్ణం. ఆయన ఇచ్చిన పిలుపు—"బోధించు సమీకరించు పోరాడు."—కేవలం నినాదం కాదు; స్వీయ నిర్ణయానికి మార్గదర్శకం. అణగారిన వర్గాలు ఇతరుల కరుణపై ఆధారపడకుండా, తమ విముక్తికి తామే నిర్మాణకర్తలుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. హక్కుల డిమాండ్ నుండి వాటిని స్వాధీనం చేసుకోవడం వరకు మహద్ సత్యాగ్రహం వంటి సంఘటనలు ఈ మార్పుకు చిహ్నం.

తర్వాతి కాలంలో ఈ ఆలోచన కాన్షీరామ్ నాయకత్వంలో జాతీయ స్థాయిలో రాజకీయ రూపాన్ని సంతరించుకుంది. ఆయన బహుజన చైతన్యాన్ని క్రమబద్ధమైన రాజకీయ శక్తిగా మార్చారు. సంఖ్యలో ఉన్న బలం, అధికారంగా మారాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన ఆలోచనలో మెజారిటీగా ఉన్నవారు చరిత్రలో కేవలం పాత్రధారులు కాకుండా, దాని రచయితలుగా మారాలి.

ఎవరి జనాభా ప్రాతిపదికన వారి ప్రాతినిధ్యం ఉండాలి అన్నదే బహుజన భావజాలంలో అంతర్గతంగా ఉన్న ముఖ్య సూత్రం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలక కులాలైన కమ్మ రెడ్ల జనాభా కలిపి 8 శాతం, జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో వారికీ ఉండాల్సిన MLA ల సంఖ్య 14 కానీ వారు ఉన్నది 67; బీసీల జనాభా 52 శాతం, జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో వారికీ ఉండాల్సిన MLA ల సంఖ్య 87 కానీ వారు ఉన్నది 40; ముస్లీముల జనాభా 8 శాతం, జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో వారికీ ఉండాల్సిన MLA ల సంఖ్య 14 కానీ వారు ఉన్నది 3; క్షత్రియుల జనాభా 0.5 శాతం, జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో వారికీ ఉండాల్సిన MLA ల సంఖ్య 1 కానీ వారు ఉన్నది 7. అయితే జనాభా ప్రాతిపదికన రాజకీయ, నిర్ణయాత్మక పరిపాలన, జ్యూడిషరీ, ప్రెస్, మీడియా, పారిశ్రామిక రంగాల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎంత ఉండాలి? కానీ ఎంత ఉంది? ఇందుకు కారణం ఏమిటి? ప్రాతినిధ్యాన్ని ఎలా సాధించుకోవాలి? ఇందుకు అడ్డు పడుతున్న శక్తులు ఏమిటి? రాజకీయ సామాజిక ఆర్థిక న్యాయాన్నీ పొందడానికి బహుజనులు ఏమి చేయాలి? అనే అంశాలను పూలే అంబేద్కర్ కాన్షీరామ్ దృష్టికోణంలో విశ్లేషిద్దాము.. **కులతత్వం** అంటే— సమాజాన్ని కులాల ఆధారంగా విభజించి, ఒక కులాన్ని మరొక కులం కంటే ఉన్నతంగా లేదా తక్కువగా చూడడం, ఆ సూత్రం ఆధారంగా హక్కులు, అవకాశాలు, గౌరవం పంపిణీ చేయడం. ఇది కేవలం సామాజిక నిర్మాణం కాదు; మనుషుల మధ్య సహజమైన సమానత్వాన్ని మరుగునపెట్టి, జన్మనే ప్రమాణంగా తీసుకుని జీవిత మార్గాలను నిర్ణయించే విధానం. ఈ సూత్రానికి మూలాలు సనాతన ధర్మంలో కనిపిస్తాయి, కాలక్రమంలో అది కఠినమైన కుల వ్యవస్థగా మారి, వ్యక్తి ప్రతిభ కంటే అతని ప్రమేయం లేని జన్మను ముందుకు తెచ్చింది. ఆధిపత్య కులాల అహంకారంతో కులవ్యవస్థ కొరకరాని కొయ్యగా మారింది.

భారతదేశంలో కులతత్వం అనేక శతాబ్దాలుగా అసమానతలకు కారణమైంది; దీనిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తూ డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులు సమానత్వం, న్యాయం కోసం పోరాడారు. కులతత్వం ఉన్నచోట, మనిషి విలువలు కంటే కుల గుర్తింపే పెద్దదిగా మారుతుంది; కులతత్వం లేని సమాజంలో, మనిషి తన గుణాలు, కృషి, ఆలోచనలతో నిలుస్తాడు. అందుకే కులతత్వాన్ని అర్థం చేసుకోవడం అనేది కేవలం ఒక విద్య కాదు — సమాజాన్ని సమానత్వ దిశగా నడిపించడంలో తొలి అడుగు.

స్థూలంగా హిందూ గుళ్ళలోకి దళితులను ఎందుకు రానివ్వరు? దళిత బహుజనులు ముఖ్య దేవాలయాల్లో ఎందుకు పూజారులు కాలేకపోతున్నారు? అనేది సామాజిక అంశం. బహుజనులు జనాభా ప్రాతిపదికన రాజకీయ పదవుల్లోకి ఎందుకు రాలేక పోతున్నారు? పాలకకులాలు ఎందుకు తమ కులస్తులనే రాజకీయ పదవులకు ఎంపిక చేస్తున్నాయి? వెనుకబడిన తరగతులవారు ఎందుకు జనరల్ కేటగిరి క్రిందే పోటీ చేయాలి? వారికీ జనాభా ప్రతిపాదికన ఎందుకు సీట్లు కేటాయించరు? అధికారం, న్యాయ వ్యవస్థ ఎందుకు ఆధిపత్య కులాల చేతిలోనే ఉంది? బహుజనులు ఆర్థికంగా అగ్రకులాల వారితో సమానంగా ఎందుకు ఎదగలేక పోతున్నారు? అధికశాతం భూమి, వ్యాపారాలు, వనరులు, సంపద ఎందుకు అగ్రకులాల క్రింద మాత్రమే ఉన్నాయి? మరో దేశవ్యాప్త భూసంస్కరణలు ఎందుకు రావడంలేదు? దేశ వనరులు దోచుకొంటున్న పెట్టుబడిదారీ వ్యవస్థకు కొన్ని రాజకీయ పార్టీలు ఎందుకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాయి? అనేవి రాజకీయ ఆర్థిక అంశాలు. వీటిపట్ల బహుజనులలో ఉన్న ఆక్రోశం, భావోద్వేగాలు బహుజన వాద వర్ణనలో చూడవచ్చు.

మెజారిటీ బహుజనులు హిందూ మత విశ్వాసంలో తమ భౌతిక ఆధ్యాత్మిక ఉన్నతిని వెదుకుకొంటూనే మరోప్రక్క ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయం కోసం పోరాడవలసిన పరిస్థితి. కాబట్టి, కులవ్యవస్థ తెచ్చిపెట్టిన మూల సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో బహుజనవాద భావజాలం సూచిస్తుంది.

కులతత్వం, ఈ పదం శతాబ్దాలుగా కోట్లాది బహుజనుల దైనందిన జీవిత వాస్తవాలను ప్రతిబింబించినప్పటికీ, — ఆ వాస్తవం సాధారణం అయిపోవడం వలన దాని స్పష్టమైన నిర్వచనం అరుదుగా కనబడుతుంటుంది.

కులతత్వం అంటే, కొన్ని కులాలను తక్కువ స్థాయిలో ఉంచి, వాటిమీద నియంత్రణ కొనసాగించడానికి, కులం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం మరియు విధానాలు రూపొందించడం అని మనం అర్థం చేసుకుంటాము. ఇదే వేల సంవత్సరాల నుండి ఈ దేశంలో బహుజనుల పట్ల ఆధిపత్య కుల సమూహం అనుసరించిన విధానం; ఆ సమూహం అణచివేతను ఎలా అమలుచేసింది, ప్రస్తుతం ఎలా అమలుచేస్తుంది అనేది మనం చూద్దాం.

కులవివక్షత స్పష్టంగానూ (ఓవర్ట్) మరియు గోప్యంగానూ (కోవర్ట్) ఉంటుంది. ఇది పరస్పరం సంబంధం ఉన్న రెండు రూపాలలో కనిపిస్తుంది: వ్యక్తులుగా ఆధిపత్య కులస్తులు బహుజన వ్యక్తులపై చేసే దాడులు, మరియు మొత్తం ఆధిపత్య కుల సమాజం మొత్తం బహుజన సమాజంపై చేసే దాడులు. వీటిని మనం వ్యక్తిగత కులవివక్షత మరియు సంస్థాగత కులవివక్షత అని పిలుస్తున్నాము.

మొదటి రకం, వ్యక్తులు లేదా మూకలచే జరిగే స్పష్టమైన దాడుల రూపంలో ఉంటుంది; ఇవి హత్యలు, గాయాలు, మాన భంగాలు, శిరోముండనాలు, బహిష్కరణలు, పరువు హత్యలు, లేదా హింసాత్మక సంఘటనలు, ఉచ్చ పోయడాలు, ఉచ్చ తాగించడాలు, పేడ తినిపించడాలు, వివస్త్రలను చేసి ఊరేగించడాలు మరియు ఇతర మత విశ్వాసాలపై దాడులు, వ్యక్తిగత కులవివక్షత దాడులు ఇలా అనేక రకాలు. ఈ రకమైన దాడులను కెమెరాలు రికార్డు చేయగలవు.రెండవ రకం, అంత స్పష్టంగా కనిపించదు; ఇది చాలా సున్నితంగా ఉంటుంది మరియు ఈ చర్యలు చేసే నిర్దిష్ట వ్యక్తులను గుర్తించడం కష్టంగా ఉంటుంది. అయినప్పటికీ, ఇది బహుజనుల జీవితాలను నాశనం చేయడంలో ఏమాత్రం తక్కువ కాదు. ఈ రకమైన దాడి సమాజంలో స్థిరపడిన మరియు గౌరవించబడే వ్యవస్థల కార్యకలాపాల నుండి ఉద్భవిస్తుంది; రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, లేజీస్లేచర్ నిర్ణయాలు, జ్యూడిషియరీ తీర్పులు, ఎగ్జిక్యూటివ్ నిర్ణయాల అమలు, విధాన మార్పులు, చట్టాన్ని రూపొందించే వ్యక్తుల మనస్తత్వాలు, మరియు కేపిటలిస్ట్ మౌత్ పీస్ మాస్ మీడియాల నుండి ఉద్భవిస్తుంది. ఈ రకమైన దాడులను కెమెరాలు రికార్డు చేయలేవు, అందువల్ల ఈ రకమైన దాడులు మొదటి రకంతో పోలిస్తే చాలా తక్కువ బహుజన విమర్శను ఎదుర్కొంటున్నాయి. వ్యక్తిగత, సంస్థగత దాడుల వెనుక ఉండి నడిపిస్తున్న

శక్తి హిందుత్వం. సర్వోదయం కోసం మన రాజ్యాంగంలో పొందుపరచుకున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం అమలు చేయబడినప్పుడే ఈ రెండు రకాల దాడులను నిర్మూలించగలం.

ఉనాలో గోవు కళేబరానికి తోలుతీశారనే నెపంతో కులోన్మాదులు దాడులు చేస్తే అది వ్యక్తిగత కుల వివక్షత యొక్క చర్య — దీనిని సమాజంలోని చాలా వర్గాలు తీవ్రంగా ఖండించాయి. కానీ అదే రాష్ట్రంలో —సరైన ఆహారం, నివాసం, విద్య మరియు వైద్య సదుపాయాల కొరత వల్ల ప్రతి సంవత్సరం వేలాది బహుజన శిశువులు మరణిస్తే, ఇంకా వేలాది బహుజనులు పేదరికం, అణచివేత మరియు వివక్షత కారణంగా శారీరకంగా, మానసికంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా నాశనం అవుతుంటే, అది సంస్థాగత కుల వివక్షత యొక్క ఫలితం.

ఒక దళిత కుటుంబం అగ్ర వర్ణాల కాలనీలో ఇంటిని అద్దెకు పొందలేక పోయారు, వారు వ్యక్తిగత కులవివక్షత అనే స్పష్టమైన దాడికి బలవుతున్నట్టు — దీనిని చాలామంది కనీసం మాటల్లో అయినా ఖండిస్తారు.

కానీ బహుజనులను పాడైపోయిన మురికివాడల్లో, స్లమ్ నివాసాల్లో బంధించి ఉంచుతూ, సెంటు భూమిలో, ఇరుకు ఇళ్లలో ఉండమని నిర్దేశించే కుటిల సంక్షేమం సంస్థాగత కుల వివక్షత ఫలితమే. సంక్షేమం పేరిట తలా కొన్ని కేజీల బియ్యం ఇచ్చి, అడపా దడపా వారి అక్కౌంట్లలోకి డబ్బులు పంపుతూ ఓట్లు దోపిడీ చేసే రాజకీయ పార్టీల యజమానులు, ఎన్నికల వేళ కొంత డబ్బు మద్యం పంచి ఐదేళ్లలో మరింత సంపాదించుకొనే రాజకీయ వ్యాపారులైన ఎంమ్మెల్యేలు, ఎంపీలు, మరియు వివక్షత చూపే కుల ఆధిపత్య అధికార వ్యవస్థకు బహుజనులు రోజూ బలవుతుండే పరిస్థితిని కొనసాగించేది సంస్థాగత కుల వివక్షతే. ఈ పరిస్థితి చక్కదిద్దేందుకు నాయకత్వం అర్థవంతమైన పరిష్కార మార్గం కనుగొంది. అదే జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో దామాషా ప్రకారం ప్రాతినిధ్యం.

దళిత క్రైస్తవులకు షెడ్యూల్ కులా హోదా నిరాకరించే 1950 ప్రెసిడెన్సిల్ ఆర్డినెన్స్ ఈ కోవకే చెందుతుంది. దీన్ని సంస్థాగత కుల వివక్షత మరియు సంస్థాగత మత వివక్షత క్రింద చూడాల్సిన అవసరం ఉన్నది. సంస్థాగత కులవివక్షత అనేది బహుజన వ్యతిరేక భావాలు మరియు వ్యతిరేక ఆచరణలు విస్తృతంగా మరియు నిరంతరంగా పనిచేయడంపై ఆధారపడి ఉంటుంది. ఇందుకు హిందుత్వ సంస్థలకు, కులోన్మాదులకు, కుల వ్యవస్థను పటిష్టం చేసే శక్తులకు ఆర్థికంగా

సహాయపడుతున్న భూస్వామ్య, పెట్టుబడిదారీ, కుల ఆధిపత్య రాజకీయ వ్యవస్థ బహుజనుల పాలిట శాపంగా పరిణమించింది. ఆధిపత్య కుల సమాజంలో ఉన్నత సమూహ భావన ప్రబలంగా ఉంటుంది: అగ్ర కులస్తులు బహుజనుల కంటే యోగ్యులు, శ్రేష్ఠులు ఇది సనాతన ధర్మ నిర్ణయం; సనాతన అంటే ఎప్పటికీ నిలిచి ఉండేది అని అర్థం; కాబట్టి అందువల్ల బహుజనులు ఆధిపత్య కులస్తులకు ఎప్పటికీ లోబడిఉండాలి అనేది ప్రాథమిక కుల వివక్షత భావన. ఇది వ్యక్తిగత స్థాయి నుండి సంస్థాగత స్థాయి వరకు, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సమాజమంతటా వ్యాపించి ఉంది. తెలివైన కులోన్మాదులు వ్యక్తిగత నింద నుండి తప్పించుకుంటారు: వారు ఎప్పడూ ప్రత్యక్షంగా మసీదులో బాంబులు పెట్టరు; దళిత కుటుంబంపై రాళ్లు వేయరు, క్రైస్తవ మఠంపై లేదా సంస్థపై దాడులు చేయరు, మసీదులపై కాషాయ జెండాలు ఎగురవేయరు. కానీ వారు అలాంటి చర్యలను కొనసాగించే మతతత్వ రాజకీయ నాయకులకు మరియు RSS, బజరంగ్ దళ్ వంటి సంస్థలకు మద్దతు ఇస్తూనే ఉంటారు, ఇలాంటి సంస్థలు సంస్థాగత కుల వివక్షత విధానాలను సమాజంపై రుద్దుతూ, అమాయక బహుజనులను హిందుత్వం పేరిట కుల వ్యవస్థ కబంధ హస్తాల్లో బంధించి వారికి నిజమైన అభివృద్ధి దక్కకుండా అధికారాన్ని తమ కోసం పెట్టుబడిదారి వ్యవస్థ కోసం పని చేయిస్తున్నాయి. అందువల్ల ప్రత్యక్ష, వ్యక్తిగత కుల వివక్షత చర్యలు సమాజాన్ని పూర్తిగా ప్రతిబింబించకపోయినా, సంస్థాగత కుల వివక్షత మాత్రం ప్రతిబింబిస్తుంది. కొందరు బహుజన నాయకులు వ్యక్తిగత దాడులకు అధిక ప్రధాన్యం ఇస్తూ సంస్థాగత దాడిని పట్టించుకోరు. బహుజన నాయకత్వం ఈ రెండు రకాల దాడులను యోజనాబద్దంగా ఎదుర్కోవాలి.

ఉత్తరమైనా, దక్షిణమైనా, పడమరైనా, తూర్పైనా—ఏ రాష్ట్రం చూసినా భారత్ కుల వివక్షత కారణంగా విడిపోయిన సమాజం; మనం అంగీకరించడానికి కూడా ఇష్టపడని స్థాయిలో ప్రస్తుత కుల సంబంధాల పరిస్థితి బహుజనులను కలవరపెడుతోంది. బహుజనుల్ని బాధించేది రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం నిరాకరించబడుతున్నదనే అంశం మాత్రమే కాదు; బహుజనుల మనఃశాంతికి భంగం వాటిల్లడం, బహుజనులకు అభివృద్ధికి అంతరాయం కలగడం.

ఇంకొక విధంగా చెప్పాలంటే, ఈ దేశంలో బహుజనులు చట్టపరమైన పౌరులు, ఇతర పౌరులతో సమాన హక్కులు కలిగి ఉన్నారు. అయినప్పటికీ, వారు ఆధిపత్య కుల సమాజంతో సంబంధంలో ద్వితీయ శ్రేణి ప్రజల స్థితిలోనే నిలుస్తారు అనడానికి సమాజంలోని కుల

సంబంధాలు పరిస్థితులు అడ్డం పడుతున్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కోవాలి అంటే కులవివక్షతకు, కులవ్యవస్థకు శుద్ధ వ్యతిరేకమైన బహుజనవాద భావజాలం, 'జిత్నా అబాది ఉత్నా హక్' అనే సూత్రం బహుజనుల మెదళ్లలో పని చేయడం ప్రారంభించాలి.

సమాన హక్కులను పేర్కొన్న రాజ్యాంగం ఉన్నా, బహుజనులు తమ "మాతృదేశం" లోనే ఉన్నా, బహుజనులూ ఆధిపత్య కులస్తులూ ఒకే భూమిలో నివసిస్తున్నా —బహుజనులు ఆధిపత్య, పాలక కులస్తులకు ఎప్పటికీ లోబడి ఉండాలా, ఇదేమి న్యాయం? పౌరసత్వం, వాస్తవ సంబంధం, సమాన హక్కులను పేర్కొనే రాజ్యాంగం ఉన్నా ఈ అంశాలకు విరుద్ధంగా కుల వివక్షత, అణచివేత ఎప్పటికీ కొనసాగుతుండాలా? దాన్ని బహుజనులు ఇంకా ఎన్నాళ్ళు భరించాలి? అనే ప్రశ్నలకు సమాధానమే బహుజనవాదం.

# 2. భారత సమాజంలో కుల కేంద్రిత విభేదాలు

భారత సమాజం సంక్లిష్టమైన, నిచ్చెనమెట్ల కులవ్యవస్థచే రూపుదిద్దుకుంది. కులవ్యవస్థలో కులపరమైన గౌరవం మరియు హోదా, కులపరమైన వృత్తి సామాజిక సంబంధాలను నిర్వచించాయి. కులవ్యవస్థ గమనంలో యాదవులు మరియు బ్రాహ్మణుల మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు లోతైన సామాజిక-సాంస్కృతిక మరియు రాజకీయ గతిశీలతలకు ప్రతిబింబాలుగా కనబడుతుంటాయి. అయితే, ఈ రకమైన సంఘర్షణ యాదవ బ్రాహ్మణ కులాల మధ్య మాత్రమే కాదు. వివిధ ప్రాంతాలలో వివిధ కుల సమూహాలకు బ్రాహ్మణులకు మధ్య ఇలాంటి కుల కేంద్రిత విభేదాలు నిత్యం కనబడుతుంటాయి.  అన్ని కుల కేంద్రిత విభేదాలలో మూలంగా కనపడే బ్రాహ్మణులకు తమ వేదం పట్ల ఉన్న భక్తి, ఆచరణ కుల కేంద్రిత విభేదాలకు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ఈ ఉద్రిక్తతలు ప్రాంతాల వారీగా సామాజిక గౌరవం, ఆర్థిక అభివృద్ధిలో వ్యత్యాసాల వల్ల రూపుదిద్దుకున్నందువలన చూడడానికి ఇంచుమించు అన్నీ ఒకే రూపంలో కనబడతాయి.

ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, హర్యానా మరియు రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో జాట్‌లు మరియు బ్రాహ్మణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తత ఒక ప్రముఖ ఉదాహరణ. సాంప్రదాయకంగా వ్యవసాయ ఆధారిత వర్గమైన జాట్‌లు భూయాజమాన్యం మరియు యుద్ధ సాంప్రదాయాల నుండి తమ గుర్తింపును పొందారు. కాలక్రమంలో ఈ గుర్తింపు వారిని బ్రాహ్మణుల అధికారంతో విభేదించేలా చేసింది. జాట్లు 18 వ శతాబ్దం నుండి తమ ప్రాధాన్యతను చాటుకొంటూ వచ్చారు. రాజైన సూరజ్ మల్ పాలనలో భరత్పూర్ రాజ్యాన్ని పాలించారు. జాట్లు తమను తాము క్షత్రియులుగా చూసుకోవడం ప్రారంభించారు. బ్రాహ్మణీయ కుల వ్యవస్థ వారిని శూద్రులుగా వర్గీకరించింది. బ్రాహ్మణులు ఆధ్యాత్మిక, కుల మరియు అగ్రవర్ణ సామాజిక ఆధిక్యతకు పెద్దపీట వేసేవారు.  ఇక్కడ ప్రారంభమైన విభేదం ముందుకు కొనసాగింది. ఈ ప్రయాణంలో ఆర్య సమాజ్ వంటి సంస్కరణ ఉద్యమాలు ఆచార పరమైన క్రతువుల నిర్వహణ కోసం బ్రాహ్మణులపై ఆధారపడే అవసరం లేకుండా చేశాయి, తద్వారా జాట్‌ల ఆత్మగౌరవాన్ని బలోపేతం చేశాయి.

పశ్చిమ భారతదేశంలో, ముఖ్యంగా మహారాష్ట్రలో, మరాఠాలు మరియు బ్రాహ్మణుల మధ్య నెలకొన్న ఉద్రిక్తత మరో ముఖ్యమైన ఉదాహరణ. 1964లో వారణాసి నుండి వచ్చిన గగాభట్ అనే బ్రాహ్మణుడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం సందర్భంగా శివాజీని క్షత్రియునిగా ప్రకటించాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ పాలనలో మరాఠాలు క్షత్రియ హోదా గుర్తింపు కోరడంతో ఉద్రిక్తతమొదలైంది. ఎందుకంటే సాంప్రదాయకంగా అటువంటి సామాజిక చట్టబద్ధతకు బ్రాహ్మణులే మధ్యవర్తులు. ఆ తర్వాత, సాహూ మహారాజ్ -1 నేతృత్వంలో స్వయంగా చిత్పావన్ బ్రాహ్మణులైన పీష్వాలకు ప్రాధాన్యత లభించింది. బాలాజీ విశ్వనాధ్ ప్రధాన మంత్రిగా నియమించబడ్డాడు. సాహూ మహారాజ్ మరాఠా రాజా కుటుంబంలో అంతర్గత కలహాలవల్ల బాలాజీ విశ్వనాధ్ మీద పూర్తిగా ఆధార పడ్డాడు. ఆ తరవాత బాజీ రావు -1, బాలాజీ బాజీ రావ్ వంటి పీష్వాలు మంత్రులుగా నియమించబడ్డారు. పీష్వాలు పాలకులుగా మారారు, అధికార సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారాయి. జ్యోతిరావు ఫూలే వంటి సాంఘిక సంస్కర్తల ఆవిర్భావం, కుల శ్రేణి యొక్క సైద్ధాంతిక పునాదులను సవాలు చేస్తూ, నిమ్న, మధ్య కులాల హక్కుల కోసం వాదించడం బ్రాహ్మణ వ్యతిరేక భావనను తీవ్రతరం చేసింది.

దక్షిణ భారతదేశంలో, కర్ణాటకలోని లింగాయత్ ఉద్యమం బ్రాహ్మణవాదానికి ప్రత్యక్ష సైద్ధాంతిక సవాలుగా నిలుస్తుంది. బసవన్న స్థాపించిన ఈ ఉద్యమం వైదిక కర్మకాండలను, కుల భేదాలను మరియు బ్రాహ్మణుల మధ్యవర్తిత్వాన్ని పూర్తిగా తిరస్కరించింది. ఇది వ్యక్తిగత విశ్వాసంపై కేంద్రీకృతమైన, సమానత్వ భక్తి రూపాన్ని ప్రోత్సహించి, తద్వారా బ్రాహ్మణుల సాంప్రదాయ మతాధికారాన్ని బలహీనపరిచింది.

అదేవిధంగా, కేరళలో నంబూదిరి బ్రాహ్మణుల కఠినమైన ఆధిపత్యం కారణంగా కుల ఉద్రిక్తతలు లోతుగా వేళ్లూనుకొన్నాయి. శ్రీ నారాయణ గురు నాయకత్వంలో ఈజవల వంటి వర్గాలు, సమానత్వానికి ప్రాధాన్యతనిస్తూ, కుల ఆధారిత వివక్షను సవాలు చేసే సామాజిక సంస్కరణ ఉద్యమాలకు నాయకత్వం వహించాయి. చారిత్రాత్మక వైకోం సత్యాగ్రహం, కుల ఆంక్షలకు, ముఖ్యంగా దేవాలయాల చుట్టూ ఉన్న ప్రజా రహదారులపై దళితుల ప్రవేశాన్ని నిరాకరించడానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా మరో ఉదాహరణ.

దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తమిళనాడులోని విస్తృత బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంలో మరో ముఖ్యమైన ప్రతిఘటనా ధోరణిని చూడవచ్చు. పెరియార్ ఇ. వి. రామస్వామి నాయకత్వంలోని ఈ ఉద్యమం, విద్య, ఉపాధి మరియు సాంస్కృతిక జీవితంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని బహిరంగంగా వ్యతిరేకించింది. ఇది ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) వంటి ఆధునిక రాజకీయ ఉద్యమాలకు పునాది వేసింది, ఇవి ఇప్పటికీ ప్రాంతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి.

బహుశా భారతదేశం అంతటా దళిత వర్గాలకు మరియు బ్రాహ్మణులకు మధ్య జరిగిన సంఘర్షణ లోతైనది. ఈ పోరాటానికి శతాబ్దాలుగా కొనసాగిన బహిష్కరణ, అంటరానితనం మరియు ప్రాథమిక మానవ హక్కుల నిరాకరణ మూలాలుగా ఉన్నాయి. బి. ఆర్. అంబేద్కర్ వంటి నాయకులు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని సవాలు చేయడమే కాకుండా, సమానత్వం, గౌరవం మరియు సామాజిక న్యాయం కోసం రాజ్యాంగాన్ని నిర్మించి దేశానికి అందించారు.

సామాజిక హోదా, వనరుల లభ్యత, జ్ఞానంపై నియంత్రణ, మరియు తమ గుర్తింపును తామే నిర్ణయించుకునే హక్కు వంటి విషయాలపై జరిగే పోరాటాల వల్ల విభేదాలు తరచుగా తలెత్తాయి. వ్యవసాయం, వాణిజ్యం విద్య మరియు శ్రమ వంటి రంగాలలో వృద్ధి సాధించగలిగిన వర్గాలు ఆర్థిక, రాజకీయ శక్తిని పొందుతున్న కొద్దీ, సామాజిక శ్రేణిలో తమను బ్రాహ్మణుల కంటే, లేదా ఇతరుల కంటే తక్కువ స్థాయిలో ఉంచిన కుల వ్యవస్థ యొక్క చట్టబద్ధతను ప్రశ్నించడం ప్రారంభించారు. విద్య, రాజకీయాలు, మరియు సంస్కరణ ఉద్యమాల పెరుగుదల ఆత్మస్థైర్యం మరియు ప్రతిఘటన ప్రక్రియను మరింత వేగవంతం చేశాయి. ఎప్పుడైతే కులాల మధ్య అసమానతలు స్పష్టమయ్యాయో లేదా ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆకాంక్షలు తీవ్రమయ్యాయో, అప్పుడు ఉద్రిక్తతలు తలెత్తాయి.

యాదవులు మరియు బ్రాహ్మణుల మధ్య ఉన్న విభేదం, భారతదేశంలో కుల కేంద్రిత వివాదాల విస్తృత చారిత్రక నమూనాలో ఒక భాగం. ఉత్తరాన జాట్‌ల నుండి దక్షిణాన లింగాయత్‌ల వరకు, పశ్చిమాన మరాఠాల నుండి దేశవ్యాప్తంగా ఎగసిపడుతున్న దళిత ఉద్యమాల వరకు, ఈ పోరాటాలు భారత సమాజంలో అధికారం, గౌరవం మరియు సామాజిక న్యాయం కోసం నిరంతరం జరుగుతున్న ఉద్రిక్తతలను ప్రతిబింబిస్తాయి.

యాదవులకు, బ్రాహ్మణులకు మధ్య కనిపించే విభేదం కేవలం ఒక చారిత్రక సంఘర్షణ ఫలితం కాదు. అది పురాణాలు, సామాజిక శ్రేణి, సాంస్కృతిక సంప్రదింపులు, మరియు ఆధునిక రాజకీయాలు కలసి రూపుదిద్దుకున్న ఉద్రిక్తత. క్రమంగా పరిణామం చెందుతున్న ఉద్రిక్తత. దీనిని స్పష్టంగా అర్థం చేసుకోవాలంటే, ప్రత్యక్ష ఘర్షణ అనే భావనను దాటి, హోదా, అధికారం, మరియు గుర్తింపు హక్కుల కోసం జరుగుతున్న సుదీర్ఘ పరోక్ష పోరాట ప్రక్రియగా చూడాలి.

ప్రాథమిక స్థాయిలో, వీరి మధ్య ఉద్రిక్తతలకు మూలాలు పౌరాణిక కథనాలలో ఉన్నాయి. మహాభారతం వంటి గ్రంథాలు, బ్రాహ్మణుల కులపరమైన అధికారం, యాదవులతో సహా క్షత్రియ వర్గాల రాజకీయ లేదా సైనిక అధికారం వంటి విభిన్న అధికార రూపాలు సహజీవనం చేసిన ప్రపంచాన్ని చిత్రీకరించాయి. మహాభారతంలో యాదవుడైన కృష్ణుడు రాజకీయ జ్ఞానానికి, వ్యూహాత్మక శక్తికి ప్రతీకగా నిలుస్తాడు. బ్రాహ్మణులు జ్ఞానానికి, ఆచారాలకు సంరక్షకులుగా ఉంటారు. పురాణగ్రంథాలలో ఈ పాత్రలు విరోధపూరితమైనవి కానప్పటికీ, అవి ఒక ద్వంద్వ అధికార నిర్మాణాన్ని స్థాపిస్తాయి. తరువాతి కాలపు వ్యాఖ్యానాలు కొన్నిసార్లు దీనిని ఉద్రిక్తతగా పరిగణించాయి. అదేవిధంగా, క్షత్రియులను సంహరించాడని చెప్పబడే పరశురాముని కథలు, పురోహిత మరియు క్షత్రియ వర్గాల మధ్య ఉన్న లోతైన సంఘర్షణకు ప్రతీకలుగా కనబడతాయి. వీటికి చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, అటువంటి కథనాలు సామాజిక స్పృహను తీర్చిదిద్ది, ఉద్రిక్తతకు కారణమయ్యాయి.

పురాణాల నుండి సామాజిక నిర్మాణానికి వస్తే, కుల వ్యవస్థ ఒక నిర్ణయాత్మక పాత్ర పోషించింది. బ్రాహ్మణులు సాంప్రదాయకంగా అత్యున్నత హోదాను కలిగి ఉండి, మతపరమైన ఆచారాలు, విద్య మరియు సామాజిక నియమాలపై అధికారాన్ని సొంతం చేసుకున్నారు. మరోవైపు, యాదవులు పశుపోషణ మరియు వ్యవసాయంతో సంబంధం కలిగి ఉన్నారు. కులవ్యవస్థలో వారి వర్గీకరణ ప్రాంతాలను బట్టి మారుతూ ఉండేది — కొన్నిసార్లు వారు శూద్రులుగా పరిగణించబడ్డారు, మరికొన్నిసార్లు వారు క్షత్రియ వంశానికి చెందినవారని చెప్పబడ్డారు. ఈ అస్పష్టత ఘర్షణకు మూలమైంది. వర్గాలుగా, యాదవులు ఉన్నత స్థాయికి ఎదగడానికి గుర్తింపు కోసం ప్రయత్నించగా, బ్రాహ్మణులు తరచుగా సామాజిక హోదాకు సూత్రదారుల పాత్రలో పనిచేశారు.

వీరిరువురి మధ్య నెలకొన్న ఘర్షణ సామాజిక గుర్తింపును నిర్వచించే అధికారం ఎవరికి ఉంది అనే అంశంపై ఎక్కువగా కేంద్రీకృతమై కనబడుతుంది.

19వ శతాబ్దం చివరిలో మరియు 20వ శతాబ్దం ప్రారంభంలో, సంస్కృతీకరణ మరియు సామాజిక ఆత్మగౌరవం వంటి నినాదాలతో కులాల గతిశీలత తీవ్రమైంది. భారతదేశం అంతటా ఉన్న యాదవ వర్గాలు సంఘటితం కావడం, విద్యావంతులు కావడం, మరియు కృష్ణునితో సంబంధం ఉన్న ప్రాచీన యాదవ వంశాల నుండి తమ వంశం వచ్చిందనే ప్రచారాన్ని ప్రారంభించాయి. వారు తమను క్షత్రియ హోదాతో అనుసంధానించే చిహ్నాలను, ఆచారాలను మరియు కథనాలను స్వీకరించారు. ఇది ఒక రకమైన సక్రమమైన ప్రతిఘటన. క్రమంగా, బ్రాహ్మణులు మాత్రమే ఆధిపత్యాన్ని నిర్ణయించగలరనే భావనను యాదవ సమూహాలు సవాలు చేశాయి. సాంప్రదాయ నిర్మాణాలను ప్రశ్నించడం, పునఃసమీక్షించడం జరగడంతో, ఇది మేధోపరమైన మరియు సామాజిక ఘర్షణకు దారితీసింది.

బ్రిటిష్ వలస పాలన కాలం ఈ ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసింది. బ్రిటిష్ పరిపాలకులు తమ అవసరాలకోసం కులగణన నిర్వహించి, భారతీయ సమాజాన్ని, ప్రాంతాలను బట్టి కులాల సాంద్రతను అంచనా వేయడానికి ప్రయత్నించారు. ఈ ప్రక్రియ అనుకోకుండానే, జనాభా అధికంగా ఉన్న వివిధ కులాలు, ఉన్నత హోదా కోసం, సమాన అవకాశాల కోసం తమ వాదనలను వినిపించేలా ప్రోత్సహించింది. యాదవ కుల సంఘాలు, యాదవ మహాసభ వంటి సంస్థలు తమను క్షత్రియులుగా గుర్తించాలని పోరాటం చేశాయి. ఈ ప్రయత్నాలు తరచుగా వారికి, కుల వ్యవస్థపై భిన్న అభిప్రాయం కలిగిన బ్రాహ్మణ సహచర అగ్ర కులాల వారికీ మధ్య విభేదాలకు దారితీశాయి. ఈ విధంగా, బ్రిటిషు వలస పాలనలో జరిగిన కుల గణన ప్రాతిపదిక సామాజిక చలనశీలతను గుర్తింపు మరియు అస్తిత్వం కోసం జరిగే పోరాటాలుగా మార్చింది.

స్వాతంత్ర్యానంతర కాలంలో, ఈ విభేదాల స్వభావం ప్రజాస్వామ్య రాజకీయాల పరిధిలోకి వచ్చింది. యాదవులు ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) విస్తృత వర్గంలో ఒక ముఖ్యమైన భాగంగా మారారు, మరియు ఎన్నికల ప్రజాస్వామ్యం విస్తరించడంతో, వారు ఒక శక్తివంతమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించారు. ములాయం సింగ్ యాదవ్ మరియు లాలూ ప్రసాద్ యాదవ్

వంటి నాయకులు సామాజిక న్యాయం, ప్రాతినిధ్యం, మరియు అగ్రవర్ణ ఆధిపత్యానికి ప్రతిఘటన వంటి ఇతివృత్తాల చుట్టూ ఓబీసీ గుర్తింపును సమీకరించారు. రాజకీయ భాషలో, బ్రాహ్మణులను తరచుగా సాంప్రదాయ ఉన్నత వర్గంలో భాగంగా చిత్రీకరించారు. ఈ విధంగా 'విభేదం' మరింత స్థిరపడింది.

కులాల గతిశీలత ప్రాంతాలను బట్టి గణనీయంగా మారుతుంది. ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ మరియు బీహార్ వంటి రాష్ట్రాలలో, యాదవుల రాజకీయ సమీకరణలు ఉద్రిక్తతలను మరింత పెంచి పెద్దవి చేసాయి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణతో సహా దక్షిణ భారతదేశంలో, గొల్లలు మరియు కురుమలు వంటి యాదవ వర్గాలకు, బ్రాహ్మణులకు మధ్య ఉన్న సంబంధం స్థానిక చరిత్రలు, ఆర్థిక వ్యవస్థలు మరియు కుల స్వరూపాలచే ప్రభావితమై ఒక భిన్నమైన మార్గాన్ని సూచిస్తుంది.

యాదవులు మరియు బ్రాహ్మణుల మధ్య కనబడే ఈ విభేదాన్ని చారిత్రక సంఘర్షణగా కాకుండా, హోదా మరియు అధికారం కోసం నిరంతరం జరుగుతున్న ఒక సంప్రదింపుగా చూడవచ్చు. ఈ విభేదం పౌరాణిక ప్రతీకలు, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ, జనాభా సాంద్రత మరియు ఆధునిక ప్రజాస్వామ్య రాజకీయాల సంగమం నుండి ఉద్భవిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల సామాజిక స్వరూపం, చరిత్ర, ఆర్థిక వ్యవస్థ మరియు రాజకీయ మార్పులు, కుల సంబంధాలు వీటి సంక్లిష్ట పరిణామాన్ని చుస్తే కులాల మధ్య ఉద్రిక్తతలు బాగా అర్థం అవుతాయి.

వివిధ కులసమూహాలు నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థలో తమ స్థానాలను చర్చించుకోవడం, సవాలు చేయడం లేదా పునర్నిర్వచించుకోవడం వంటివి చేశాయి. తమిళనాడు లేదా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో కనిపించే తీవ్రమైన సైద్ధాంతిక ఘర్షణలకు భిన్నంగా, తెలుగు మాట్లాడే ప్రాంతంలో పరిణామాలు విలక్షణమైన రీతులలో ఆవిష్కృతమయ్యాయి.

బ్రాహ్మణులు మత మరియు సాంస్కృతిక జీవితంలో పురోహితులుగా, పండితులుగా మరియు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ, కులపరమైన, ఆధ్యాత్మికమైన మరియు మేధోపరమైన అధికారాన్ని

కలిగి ఉండేవారు. వైదిక జ్ఞానం, విద్య మరియు సామాజిక చట్టబద్ధత వారి నియంత్రణలో ఉండేవి. రెడ్లు, కమ్మలు మరియు వెలమలు వంటి వ్యవసాయ వర్గాలు భూయాజమాన్యం మరియు స్థానిక ఆధిపత్యం ద్వారా భౌతిక అధికారాన్ని కలిగి ఉండేవారు. కులపరమైన అధికారం మరియు ఆర్థిక శక్తి మధ్య ఉన్న విభజన. కులాల మధ్య సంఘర్షణ.

కాలక్రమేణా, ముఖ్యంగా స్వాతంత్ర్యం తర్వాత, భూమిపై వారికున్న నియంత్రణతో ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించడం వలన, వారు ఆచరణాత్మక ప్రభావంలో బ్రాహ్మణులను అధిగమించగలిగారు. రాయలసీమ మరియు తెలంగాణ వంటి ప్రాంతాలలో రెడ్లు ఒక ముఖ్యమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించారు. ఈ మార్పు ప్రత్యక్ష సైద్ధాంతిక ఘర్షణకు దారితీయలేదు; కానీ, బ్రాహ్మణ ఆధిపత్యం క్రమంగా తగ్గిపోవడాన్ని సూచిస్తుంది. రాజకీయ, ఆర్థిక మూలధనానికి ఎక్కువ ప్రాధాన్యత ఉన్న ఆధునిక రాజకీయాలలో, ఒకప్పుడు ఆచార వ్యవహారాలు మరియు విద్య నియంత్రణ ద్వారా చెలాయించబడిన అధికారం క్రమంగా ప్రాముఖ్యత కోల్పోయింది.

కోస్తా ఆంధ్రలోని కమ్మల విషయంలో కూడా ఇలాంటి గమనాన్నే చూస్తాం. సారవంతమైన డెల్టా ప్రాంతాలు మరియు నీటిపారుదల వ్యవస్థల నుండి ఆర్థికంగా సాధికారత సాధించిన కమ్మవారు, వ్యవసాయం, వాణిజ్యం, విద్య మరియు సినిమా, మీడియా రంగాల ద్వారా తమ ప్రభావాన్ని విస్తరించుకున్నారు. బ్రాహ్మణుల మధ్యవర్తిత్వం అవసరం లేని వ్యాపారాలు, అవకాశాలలో వారు పెట్టుబడులు పెట్టడంతో, వారి ఎదుగుదల సాంప్రదాయ శ్రేణులకు ఒక ఆధునిక సవాలుగా నిలిచింది. ఎన్. టి. రామారావు వంటి నాయకుల ఆవిర్భావం ఈ పరివర్తనకు ప్రతీకగా నిలిచింది.

దీనికి విరుద్ధంగా, సాంప్రదాయకంగా పశుపోషణ వృత్తులతో ముడిపడి ఉన్న యాదవులు (గొల్లలు మరియు కురుమలు) వంటి వర్గాలు ఒక భిన్నమైన ఉద్రిక్తతకు కారణమయ్యాయి. కృష్ణుడి వంటి పాత్రలతో తమకు ఉన్న సాంస్కృతిక, పౌరాణిక సంబంధాలను ఆధారంగా చేసుకుని, ఉన్నత సామాజిక హోదా కోసం వారు చేసిన వాదన ఉద్రిక్తతకు ప్రాతిపదికగా మారింది. వారిని సామాజిక క్రమంలో తక్కువ స్థాయిలో ఉంచే బ్రాహ్మణీయ వర్గీకరణలతో ఘర్షణ మొదలయ్యింది. ఈ సంఘర్షణ ఆర్థిక సమానత్వం కోసం కాకుండా, సామాజిక శ్రేణిలో గుర్తింపు మరియు గౌరవానికి సంబంధించినది. ఈ ఉద్రిక్తత భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో కనిపించే

ఇలాంటి నమూనాలనే ప్రతిబింబిస్తుంది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో సాంప్రదాయకంగా, స్థానికంగా గొల్లలు మరియు కురుమలు అని పిలువబడే యాదవులు ప్రధానంగా పశుపోషణ మరియు వ్యవసాయ ఆధారిత వర్గాలుగా ఉండేవారు. వారి జీవనోపాధి పశువుల పెంపకం, గొర్రెల పెంపకం మరియు పాలు, ఉన్ని, తోలు, మాంసం ఉత్పత్తిపై కేంద్రీకృతమై ఉండేది. ఇది వారిని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన ఉత్పత్తిదారులుగా చేసింది. దీనికి విరుద్ధంగా, బ్రాహ్మణులు భిన్నమైన ప్రభావ క్షేత్రాన్ని కలిగిఉన్నారు. వారు మతపరమైన ఆచారాలకు, ఆలయ పద్ధతులకు మరియు సనాతన ధర్మానికి సంరక్షకులుగా ఉన్నారు. సాంప్రదాయ వర్ణ వ్యవస్థలో వారు ఉన్నతమైన కుల హోదాను సొంతం చేసుకున్నారు. యాదవులు సమాజానికి భౌతికంగా దోహదపడగా, బ్రాహ్మణులు ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక క్షేత్రాన్ని పాలించారు. అయితే, ఆ పరిస్థితుల్లో ఆర్థిక సహకారం కంటే కులపరమైన అధికారానికే ఎక్కువ విలువ ఉండేది.

ఈ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో దేవాలయాలు ప్రధాన పాత్ర పోషించాయి. తెలుగు మాట్లాడే ప్రాంతాలలో, మత సంస్థలు కేవలం పూజ స్థలాలుగా మాత్రమే కాకుండా, సామాజిక మరియు సాంస్కృతిక అధికారానికి కేంద్రాలుగా కూడా ఉంటున్నాయి. బ్రాహ్మణులు ఎక్కువగా దేవాలయ పరిపాలనను నియంత్రించేవారు, తద్వారా మతపరమైన కథనాలను మరియు ఆచారాలను తీర్చిదిద్దేవారు. సాంప్రదాయకంగా యాదవ వర్గాలతో ముడిపడి ఉన్న దైవ రూపమైన కృష్ణునితో యాదవులకు బలమైన సాంస్కృతిక మరియు పౌరాణిక సంబంధం ఉన్నప్పటికీ, వారు కుల వ్యవస్థలో అధికార స్థానాలను ఆక్రమించలేదు. ఇది ఒక ముఖ్యమైన వైరుధ్యాన్ని సృష్టించింది: యాదవులు కృష్ణుని ద్వారా ఒక ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక వంశాన్ని చెప్పకోగలిగినప్పటికీ, కులపరమైన శ్రేణిలో వారి వాస్తవ స్థానం బ్రాహ్మణుల అధీనంలోనే ఉండిపోయింది.

మధ్యయుగ మరియు తొలి వలస కాలాలలో, భూమి మరియు అధికార పంపిణీ, సామాజిక సంబంధాలను ప్రభావితం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో, రెడ్లు, కమ్మలు మరియు వెలమలు వంటి ఆధిపత్య వ్యవసాయ కులాలు గణనీయమైన ఆర్థిక మరియు రాజకీయ నియంత్రణను కలిగి ఉండేవి. యాదవులు ఆర్థికంగా చురుకుగా ఉన్నప్పటికీ, వారు సాధారణంగా పెద్ద భూస్వాములుగా లేదా రాజకీయ ఉన్నత వర్గాలుగా ఉండేవారు కాదు. మరోవైపు, బ్రాహ్మణులు

తరచుగా అగ్రహారాలు అని పిలువబడే భూదానాల ద్వారా ప్రయోజనం పొందుతూ, విద్య మరియు పరిపాలనలో తమ ప్రభావాన్ని కొనసాగించేవారు. ఫలితంగా, యాదవులు మరియు బ్రాహ్మణుల మధ్య సంబంధాలు ప్రత్యక్ష వైరుధ్యంతో కాకుండా, సమాంతరమైన ప్రభావహీనత్వం, వెనుకబాటుతనం వంటి రూపాలతో కూడి ఉండేవి—యాదవులు ఆర్థిక రంగంలో ఆధిపత్యం లేకుండా, బ్రాహ్మణులు సాంస్కృతిక రంగంలో పరిమితమైన ప్రత్యక్ష ఆర్థిక శక్తితో ఉండేవారు.

భారత స్వాతంత్ర్యం తరువాత దశాబ్దాలలో, ముఖ్యంగా ఇరవయ్యవ శతాబ్దం చివరి నుండి, ఇతర వెనుకబడిన తరగతుల (OBC) రాజకీయాల పెరుగుదలతో ఈ పరిణామాలు మరింతగా అభివృద్ధి చెందాయి. సామాజిక న్యాయం, రిజర్వేషన్లు మరియు రాజకీయ ప్రాతినిధ్యం కోసం వాదించే విస్తృత ఉద్యమాలలో యాదవులు ఒక ముఖ్యమైన భాగంగా మారారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై తరచుగా ఇతర శక్తివంతమైన కులాల ఆధిపత్యం ఉన్నప్పటికీ, యాదవులు ఒక ప్రత్యేక రాజకీయ వర్గంగా తమను తాము నిరూపించుకోవడం క్రమంగా ప్రారంభించారు. ఈ పరివర్తనలో మేధోపరమైన మరియు సైద్ధాంతిక ప్రభావాలు కూడా పాత్ర పోషించాయి. బి. ఆర్. అంబేద్కర్ వంటి సంఘ సంస్కర్తల ఆలోచనలు, యాదవులలోని కొన్ని వర్గాలతో సహా అనేక వర్గాలను సాంప్రదాయ అధికార శ్రేణులను ప్రశ్నించడానికి, తమ గౌరవాన్ని మరియు హక్కులను నిలబెట్టుకోవడానికి, ఆత్మ గౌరవం కోసం పోరాడడానికి ప్రోత్సహించాయి. ఫలితంగా, కొన్ని యాదవ సమూహాలు బ్రాహ్మణుల మధ్యవర్తిత్వంతో జరిగే ఆచారాలపై ఆధారపడటాన్ని విడిచిపెట్టి, దానికి బదులుగా ఆత్మగౌరవం, సామాజిక గుర్తింపు మరియు ప్రత్యామ్నాయ మతపరమైన వ్యక్తీకరణ రూపాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాయి. సమకాలీన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో, యాదవులు మరియు బ్రాహ్మణుల మధ్య సంబంధం రోజువారీ జీవితంలో చాలావరకు శాంతియుతంగా మరియు ఆచరణాత్మకంగా ఉంది. ఈ రెండు వర్గాల మధ్య విస్తృతమైన లేదా వ్యవస్థీకృత సంఘర్షణ లేదు.

అత్యంత ఘర్షణతో కూడిన ఉద్రిక్తతలు బ్రాహ్మణ దళిత వర్గాల మధ్య చోటుచేసుకున్నాయి. దళితులు చారిత్రాత్మకంగా ఎదుర్కొన్న బహిష్కరణ మరియు అంటరానితనం, బి. ఆర్. అంబేద్కర్ వంటి మేధావుల దార్శనికతలో బలంగా ప్రభావితమై, మొత్తం కుల వ్యవస్థపై నిరంతర పోరాటానికి దారితీశాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో దళిత ఉద్యమాలు బ్రాహ్మణీయ కుల

వ్యవస్థను సవాలు చేయడమే కాకుండా, రెడ్డి, కమ్మ, వెలమ, క్షత్రియ వంటి భూస్వామ్య కులాల ఆధిపత్యాన్ని కూడా ప్రశ్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో మాలలు మాల కన్నమదాసు వంటి చారిత్రక పాత్రల ఆధారంగా తమను తాము సైనిక వర్గంగా నిర్వచించుకొంటున్నారు. షెడ్యూల్డ్ కులాల మధ్య అంతర్గత భేదాలు, ముఖ్యంగా రిజర్వేషన్ల వర్గీకరణపై మాదిగ-మాల వివాదం వంటి సమస్యలు, ఈ పోరాటాలు నిరంతరం పరిణామం చెందుతున్నాయని, మరియు బహుముఖమైనవని స్పష్టం చేస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో గౌడులు, యాదవులు, పద్మశాలిలు వంటి వెనుకబడిన తరగతులు (BCలు) కూడా సామాజిక వ్యవస్థను పునర్నిర్మించడంలో కీలక పాత్ర పోషించాయి. పెరియార్ ఇ. వి. రామస్వామి వంటి వారి నాయకత్వంలోని విస్తృత బ్రాహ్మణేతర ఉద్యమాల నుండి స్ఫూర్తి పొందిన ఈ వర్గాలు, విద్య, ఉపాధి, రాజకీయాలలో న్యాయమైన ప్రాతినిధ్యం కోసం పోరాడుతున్నాయి. వారి ఈ పోరాటం, కేవలం బ్రాహ్మణీయ కుల వ్యవస్థకు పరిమితం కాకుండా, వనరులు, అవకాశాలను పొందేందుకు ప్రాధాన్యతనిస్తూ, సామూహిక రాజకీయ రూపాన్ని సంతరించుకుంది.

తీరప్రాంత ఆంధ్రలోని మరో ప్రధాన వ్యవసాయ వర్గమైన కాపులు, ఈ గతిశీలతలోని మరో కోణాన్ని వివరిస్తున్నారు. రాజకీయ అధికారంలో రెడ్డి, కమ్మ వంటి ఆధిపత్య కులాల కంటే దిగువన ఉన్నందున, వారి సమీకరణ రిజర్వేషన్లు మరియు గుర్తింపు డిమాండ్లపై కొంతకాలం కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం వారి పోరాటం ఆధిపత్య కులాలతో అధికారంలో పాలిభాగస్తులు కావడం వైపు మళ్ళించబడినప్పటికీ, చారిత్రాత్మకంగా కుల వ్యవస్థ నిర్మాణాన్ని, వ్యవస్థలను సవాలు చేసే విస్తృత ప్రక్రియలో ఇప్పటికీ ఒక భాగంగా కొనసాగుతోంది.

తీరప్రాంత ఆంధ్రలోని ప్రధాన వ్యవసాయ వర్గమైన కాపులు, రాయలసీమలోని బలిజలు ఈ గతిశీలతలోని మరో కోణాన్ని వివరిస్తున్నా . రాజకీయ అధికారం పరంగా రెడ్డి, కమ్మ వంటి ఆధిపత్య కులాల కంటే దిగువన ఉన్నందున, వారి సమీకరణ సత్వరమార్గంలో రాజకీయ గుర్తింపుపై కేంద్రీకృతమై ఉంది.

ఈ పరిణామాలన్నీ కలిపి చూస్తే, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో కుల సంబంధాలను ఒకే రకమైన "విభేదం" గా కుదించలేమని స్పష్టమవుతోంది. ఒకప్పుడు కేంద్రంగా ఉన్న బ్రాహ్మణ ఆధిపత్యం, భూమి ఆధారిత అధికారం, ఆర్థిక విస్తరణ మరియు విద్యా చలనశీలత నేపథ్యంలో సాపేక్షంగా నిశ్శబ్దంగా క్షీణించింది. దాని స్థానంలో, ముఖ్యంగా ఆధిపత్య కులాలకు, వెనుకబడిన లేదా అణగారిన వర్గాలకు మధ్య కొత్త రకాల పోటీలు ఉద్భవించాయి.

నేడు, అత్యంత స్పష్టంగా కనిపించే సంఘర్షణలు తరచుగా బ్రాహ్మణులకు, ఇతరులకు మధ్య కాకుండా, ఆధిపత్య కులాలకు మరియు మరింత చేరికను, మరింత గౌరవాన్ని, సమానత్వం కోరుకునే వారికి మధ్యనే చోటుచేసుకుంటున్నాయి. ఇవి భారతదేశ సామాజిక స్వరూపంలో జరుగుతున్న నిరంతర పరివర్తనను ప్రతిబింబిస్తున్నాయి.

వివిధ ప్రాంతాల్లో వివిధ కులాలు మరియు బ్రాహ్మణుల మధ్య విభేదం సామాజిక శ్రేణి, ఆర్థిక సాధికారత, మతపరమైన అధికారం, కులపరమైన ఆధిపత్యం, జనాభా ప్రాతిపదికన రాజకీయ ఆర్థిక సామజిక న్యాయ డిమాండు మరియు ఆధునిక రాజకీయ చైతన్యం వంటి అంశాలతో కూడిన ఒక సుదీర్ఘ ప్రక్రియ యొక్క ఫలితం. మనం ఈనాడు చూస్తున్న విభేదం, అంగీకరించబడిన కుల వ్యవస్థ నుండి నిరంతర సంప్రదింపులు మరియు ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే దిశలో జరుగుతున్న ఒక పరివర్తన. బ్రాహ్మణులు వివిధ కులాల మధ్య జరిగిన జరుగుతున్న ఈ పోరాటాల వెలుగులో బహుజన వాదం ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆర్థికంగా సాధికారత సాధించిన పాలక, ఆధిపత్య కులాలు బహుజనులకు చేస్తున్న రాజకీయ ఆర్థిక సామాజిక అన్యాయాన్ని బహుజన వాదం ఎదుర్కొంటుంది. కులాల ఆధిపత్య పోరులో కులాలుగా పోటీ పడకూడ్దా బహుజన సమాజంగా పోటీ పడాలనీ, వెనుక బడిన తరగతులన్నీ ఒకే తాటిపైకి రావాలని బహుజనవాదం సూచిస్తుంది.

# 3. తప్పుడు సిద్ధాంతాల సమస్య

సంప్రదాయ వలస పరిపాలనా వ్యవస్థలో, వలస ప్రాంతం చౌకగా ఉత్పత్తి చేసిన ముడి సరుకుల (సాధారణంగా వ్యవసాయ, శ్రమ లేదా ఖనిజ) మూలంగా ఉంటుంది. బ్రిటీష్ వలస పాలనలో మన దేశంలో అదే జరిగింది. బహుజనులు తమ భుక్తి కోసం, శ్రమజీవులుగా ప్రత్తి పండించారు, తరువాత అదే ప్రత్తితో తయారైన దుస్తులు (అలాగే ఆహారం మరియు ఇతర వస్తువులు) బ్రిటీషు తయారీదారుల నుండి కొనుగోలు చేసారు.  స్వాతంత్ర్యానంతరం కూడా పరిస్థితి అలానే ఉంది. కుల ఆధిపత్య పాలనలో పెట్టుబడిదారీ వ్యవస్థకు బహుజనులు చౌక ముడి సరుకు (సాధారణంగా వ్యవసాయ, శ్రమ) మూలంగా ఉన్నారు.

భారతదేశంలోని బహుజన సమాజాలు మాత్రం మానవ శ్రమను తప్ప ఇంకేమీ ఎగుమతి చేయలేవు. మూలంగా చూస్తే, బహుజనులు తమ శ్రమనే అమ్ముకొంటున్నారు; ఉత్పత్తి అయిన వస్తువు "బహుజనులది" కాదు, ఎందుకంటే భూమి వారి సొంతం కాదు, పరిశ్రమలు వారి సొంతం కాదు. పాలక కులాల చేతిలో, ఆధిపత్య కులాల అధికారం చేతిలో భారత బహుజనులు భారత మరియు ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థకు చవకగా శ్రమను అందించే వనరుగా మారుతున్నారు. అందుకే ప్రస్తుత పాలకవర్గాలు ప్రభుత్వరంగాన్ని కూడా ప్రవేటీకరణ చేసి బహుజనుల భవిష్యత్తును పూర్తిగా పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద వ్యవస్థ చేతికి అప్పగించాలని చూస్తున్నాయి.  ఆర్థిక శాస్త్రవేత్తలు ప్రస్తుత పరిస్థితిపై ఎన్ని వాదనలు చేసినా, ఆధిపత్య కుల, బహుజన వాస్తవ సంబంధం ఇలానే ఉంది. భారతదేశంలో బహుజనులు కుల ఆధిపత్య సమాజంతో వలస సంబంధంలో ఉన్నారు అనడానికి ఈ ఉపమానం చాలు—ఈ సంబంధం సంస్థాగత కులవివక్షతో లక్షణీకరించబడింది. ఈ వలస స్థితి మూడు రంగాలలో పనిచేస్తుంది—రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో పనిచేస్తుంది. రాజకీయ రంగంలో- కుల ఆధిపత్య అధికార నిర్మాణం మరియు పాలక కులాల చేతుల్లో, ఆర్థిక రంగంలో- పెట్టుబడిదారి మరియు సామ్రాజ్యవాద వ్యవస్థల చేతుల్లో, సామాజిక రంగంలో- అగ్రకులాల చేతుల్లో బహుజనులు ఉండడమే సంస్థాగత కులవివక్షత లక్షణాలు.

చరిత్ర పుటలు పరిశీలిస్తే వలస పాలిత ప్రజల రాజకీయ నిర్ణయాలు వలసాధికారులు తీసుకొనేవారు. అవి నేరుగా లేదా "పరోక్ష పాలన" (indirect rule) ద్వారా అమలులోకి వచ్చేవి. అదే మూసలో నేటి రాజకీయ అధికారం ద్వారా, బహుజన ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలను స్వతంత్రం వచ్చిన నాటినుండి అగ్రకులాల వారే చేస్తున్నారు —తమ కులాల అభివృద్ధినీ మాత్రం ప్రత్యేక శ్రద్ధతో సాధ్యం చేసుకొంటున్న పాలకకులాలు కూడా ఇందులో భాగమే.

మొత్తంగా దీనిని కుల ఆధిపత్య అధికార నిర్మాణం "Dominant Caste power structure" అని బహుజన వాదం నిర్వచిస్తుంది. ఈ పదాన్ని కొందరు ఇష్టపడరు, ఎందుకంటే అధికారానికి కేంద్రాలు అనేకం ఉన్నాయనీ, నిర్ణయాలు తీసుకునే శక్తులు విభిన్నంగా ఉన్నాయనీ వారు భావిస్తునా . వారు వ్యవస్థలో ఉన్న బహుళత్వాన్ని (pluralism) ఉదాహరణగా చూపిస్తున్నారు. కానీ వారు గమనించని విషయం ఏమిటంటే—జాతి, కుల సమస్యల విషయంలో తరచుగా ఆ బహుళత్వం కాస్త ఏకరూప నిర్మాణంగా మారిపోతుంది. బహుజనులు తమ హక్కుల కోసం డిమాండ్ చేసినప్పుడు, విభిన్న వర్గాలుగా ఉన్న అగ్రకులాలు ఒక్కటై ఒక మోర్చాగా నిలుస్తున్నాయి.

ముఖ్యంగా బహుజనుల జనాభా ఆధారంగా డిమాండ్లు పెరిగినప్పుడు ఇది మరింత స్పష్టంగా కనిపిస్తుంది. బహుజన జనాభా ఒకవైపు రాజకీయంగా అధిక ప్రభావం చూపగల శక్తిగా అగ్రకులాల్లో భయాన్ని కలిగిస్తుంది. బహుజనుల జనాభా ఎంత ఎక్కువైతే, అది అంతటి ప్రమాదంగా అగ్రకులాలకు కనిపిస్తుంది; అందువల్ల కుల గణనను చేపట్టడానికి ససేమీరా అన్నది హిందుత్వ ప్రభుత్వం. కాంగ్రెస్ తాను అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కుల గణన చేపట్టింది, ఇక హిందుత్వ ప్రభుత్వం ఒప్పుకోక తప్పలేదు. నిరక్షరాస్యత అధికంగా ఉన్న కొన్ని రాష్ట్రాల్లో హిందుత్వం ప్రబలంగా ఉండడానికి కారణం బహుజనవాదం స్పష్ట చేస్తుంది. విద్యావంతులైన బహుజన సమూహం రాజకీయంగా ప్రభావం చూపగల శక్తిగా ఆధిపత్య కులాల్లో భయాన్ని కలిగిస్తుంది. బహుజనుల విద్య ఎంత ఎక్కువైతే, అది అంతటి ప్రమాదంగా వారికి కనిపిస్తుంది; అందువల్ల విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారు. ఇలా, తమ స్వార్థాలకు భంగం కలిగించే అంశాలు ఎదురైనప్పుడు, కుల ఆధిపత్య వర్గాలు తమ ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఒక

ఏకీకృత, దృఢమైన రూపంలో వ్యవహరిస్తున్నాయి. వారు తమకు మాత్రమే చెందినదిగా భావించే హక్కులను కాపాడుకోవడానికి సమూహంగా ప్రతిస్పందిస్తున్నారు —వివిధ రూపాలలో ఆ వర్గానికి వెలుపల ఉన్నవారిని తప్పించి, మోసం చేసి పొందుతున్న ప్రయోజనాలు కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాలు అవి.

భారతదేశంలో "జాతి లేదా కుల సంబంధాలు" అనేవి ఆర్యుల విస్తరణ అనే దీర్ఘ చారిత్రక ప్రక్రియకు ప్రత్యక్ష ఫలితాలు. అనాదిగా ప్రారంభమైన ఈ విస్తరణలో, హిందూ మత సూత్రాల ఆధారంగా బహుజనులను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. జాతి లేదా కుల సిద్ధాంతాలు రూపుదిద్దుకుని విస్తరించిన తరువాత, వాటిని రాజకీయ ఆధిపత్యం మరియు ఆర్థిక నియంత్రణను, సామాజిక ఆధిపత్యాన్ని వ్యవస్థీకృతం చేయడానికి శక్తివంతమైన సాధనాలుగా మార్చుకొన్నారు.

అదే విధంగా, నేటి రాజకీయ, ఆర్థిక మరియు సామాజిక వ్యవస్థలలో ప్రత్యేక హక్కులను పొందిన వర్గాలు కూడా తమ హక్కులను సమర్థించుకునేందుకు తప్పుడు సిద్ధాంతాలను నిర్మిస్తున్నాయి. సమాజంలో దీర్ఘకాలికంగా సంపదను సంపాదించడం, అధికారాన్ని వినియోగించడం, ప్రతిష్ఠను పొందడం వంటి అవకాశాలను అనుభవించిన వర్గాలు, ఆ ప్రయోజనాలు తమ "హక్కుగా" భావించే ధోరణి కలిగి ఉంటున్నాయి. ఈ ప్రయోజనాలు వారి దృష్టిలో సహజమైనవిగా, సరైనవిగా, సంప్రదాయబద్ధమైనవిగా భావించబడుతున్నాయి. ప్రస్తుత

పరిస్థితిని మార్చే ఏ ప్రయత్నమైనా వారిలో ఆగ్రహాన్ని రేకెత్తిస్తుంది; ఇటువంటి స్థితి సహజమేనని, తప్పనిసరి అని నిరూపించే సిద్ధాంతాలు నిర్మించబడుతున్నాయి. హిందుత్వం ఇందులో ప్రధాన పాత్రను పోషిస్తుంది. అధికారంలో, సంపదలో, ప్రతిష్ఠలో, జ్ఞానంలో తేడాలు సృష్టించడానికి, మతంలో ప్రత్యేక గౌరవం / స్థానం పొందడానికి, మత విశ్వాసం పేరిట సైన్స్కు సంబంధంలేని మూఢనమ్మకాలు, సంస్కృతి బహుజనులపై రుద్దడానికి, వారసత్వంగా కబ్జా చేసిన ఆస్థిని, సంపదను, సహజ వనరులను కాపాడుకోవడానికి, ఆధిపత్య కులాల స్వార్థ ప్రయోజనాల కొనసాగింపు కొరకు ఏర్పడిన వ్యవస్థ చాలా శక్తివంతమైనది— ఆ వ్యవస్థే హిందుత్వ వ్యవస్థ. అధికారం కలిగిన వర్గాలు తమను ఒక సమూహంగా చూసుకుంటాయి; తమ అభిప్రాయాలను

పరస్పరం బలపరచుకొంటాయి. ఈ ఏర్పాట్లలో న్యాయం అనేది ఉందా అనే సందేహం ఆ భావజాల స్వభావం కారణంగా క్రమంగా తగ్గిపోతుంది ఆ వ్యవస్థే హిందుత్వ వ్యవస్థ.

సూత్రప్రాయంగా చూస్తే, దేశ స్థాయిలో రాజకీయ అధికారాన్ని చేపట్టడానికి ఎలక్షన్ కమీషన్ అవినీతికి పాల్పడినట్టు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రజలముందు ఆధారాలను ఉంచారు. ఈ రాజకీయ హత్యలు ఆపడానికి మన ఫెడరల్ ప్రభుత్వానికి పరిమిత అధికారాలే ఉన్నాయని పైకి చెబుతున్నారు. న్యాయ వ్యవస్థ మీరే తేల్చుకోండి అంటుంది. ఎలక్షన్ కమీషనర్లకు ఇమ్మ్యూనిటి ఇచ్చి కాపాడుతాను అంటుంది హిందుత్వ ప్రభుత్వం. ఇదంతా హిందుత్వాన్ని అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రభుత్వ వ్యవస్థలు నిస్సిగ్గుగా అవినీతిని చేస్తున్న ఉదంతం. అగ్రకులాల, పెట్టుబడిదారుల, బూర్జువా వర్గాల ప్రభుత్వాన్ని కాపాడడం కోసం రహస్యంగా జరుగుతున్న అవినీతి. మరోలా చెప్పాలి అంటే బహుజనులపై జరుగుతున్న సంస్థాగత దాడి. వేల సంవత్సరాల అణచివేత ప్రక్కన పెడితే, స్వాతంత్రానంతరం కూడా స్వార్ధ సంస్కృతిని కొనసాగించడానికి, మానవవాదాన్ని మట్టుబెట్టడానికి మతం ముసుగు తొడుక్కొని మన మధ్య సంచరిస్తున్న మృగం హిందుత్వం.

బహుజన సమాజం “dominant castes power structure” ఆధిపత్య కుల అధికార నిర్మాణాన్ని చాలా స్పష్టంగా అనుభవిస్తుంది అనడానికి బీజేపీ మూడు వరస గెలుపులు నిదర్శనం. అయితే చట్టాల్లో చెప్పే “అధికార విభజన” (separation of powers)—అంటే “పరస్పర నియంత్రణలు మరియు సమతుల్యతలు” (checks and balances) గురించి ఏమందాం? అధికారం కోసం లేదా జాతి/కుల సమస్యల విషయంలో ఆధిపత్య కులాల వారు తమను తాము ఏకరూప సమూహంగా భావించి ప్రవర్తిస్తారు. అంటే, తమ సమూహ ప్రయోజనం లక్ష్యంగా ఉన్నప్పుడు; లేదా అవసరమైనప్పుడు "Dominant castes power structure” ఈ అన్ని గీతలను దాటి, “అధికార విభజన” (separation of powers)—అంటే “పరస్పర నియంత్రణలు మరియు సమతుల్యతలు” (checks and balances) అనే వాటిని అప్రాసంగికంగా మార్చేస్తుంది. అందుకు ఉదాహరణే ‘ఓట్ చోరీ.’

వలస రాజకీయాలలో ఒక ముఖ్యాంశం ఉంది—“పరోక్ష పాలన” (indirect rule). “బహుజన నాయకులు” అనే వారి ద్వారా వలస పరిపాలనను నిర్వహించడం. ఇది తక్కువ

ఖర్చుతో జరిగే ఆమోదయోగ్యమైన వలస పాలన రూపం. అదేవిధముగా, కుల ఆధిపత్య అధికార నిర్మాణం బహుజన సమాజాన్ని, ఆధిపత్య కులాల నాయకత్వానికి విధేయంగా ఉండే స్థానిక బహుజన నాయకుల ద్వారా పాలిస్తుంది. ఈ నాయకులు తమ ప్రజల కంటే కేంద్రంలోని ఆధిపత్య కులాల రాజకీయ యంత్రాంగానికి విధేయంగా ఉంటారు. అటువంటివారు వారు నిజమైన అధికారాన్ని వినియోగించలేరు; తమ ప్రజల కోసం బలంగా డిమాండ్ చేయలేరు. ఫలితంగా, వారు తోలు బొమ్మలుగా మారిపోతారు. వారు తమ ప్రజల పట్ల విధేయత కంటే ఆధిపత్య కులాల లేదా పాలక కులాల రాజకీయ పార్టీల పట్ల విధేయతకు పెద్దపీట వేస్తారు; దాంతో బహుజన సమాజం తనను తాను అభివృద్ధి చేసుకునే శక్తి నశిస్తుంది.

ఆధిపత్య కులాల అధికార నిర్మాణంలో భాగమై ఉన్నప్పుడు, రాజకీయాలు వ్యక్తి తన స్వరాన్ని తగ్గించుకునేలా చేస్తాయి. బహుజన ప్రతినిధి తమ జాతుల కోసం స్పష్టంగా, బలంగా మాట్లాడే అవకాశాన్ని కోల్పోతాడు; దీనిని అవసరాల పేరుతో సమర్థించుకుంటాడు. అందువల్ల, ఈ దేశంలోని అనేక రాజకీయ పార్టీల్లో బహుజన సామాజిక గుర్తింపు ఉన్న నాయకుల గురించి మాట్లాడినప్పుడు, అది ఆధిపత్య కులాల అధికారంపై ఆధారపడి ఉన్న తోలుబొమ్మల వ్యవస్థనే సూచిస్తుంది— అది ఆధిపత్య కులాల ఎంపికతో ముందుకు వచ్చిన బహుజన సామాజిక గుర్తింపు ఉన్న నాయకుల సమూహం. ఈ రకం నాయకులు తమకు అధికారాన్ని ఇచ్చిన అగ్రకులాల పరిమితుల్లోనే పనిచేయగలరు. ఇది ఉత్తర భారతానికే కాదు, దక్షిణ భారతానికి సమానంగా వర్తిస్తుంది.

గరిష్ఠ లాభాలు పొందాలంటే ఆధిపత్య కులాల రాజకీయ భావజాలంతో "సరిపడి" నడవాలి అనే భావనను స్వచ్ఛమైన బహుజనవాదం తిరస్కరిస్తుంది. ఆధిపత్య కులాల రాజకీయ భావజాలాలతో ప్రయాణం కొంతమంది వ్యక్తులకు ప్రతిష్ఠను లేదా భౌతిక లాభాలను లేదా ప్రయోజనాలను ఇవ్వవచ్చు; కానీ బహుజన సమాజం లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి ఇటువంటి ప్రయాణం దోహదపడదు. ఎందుకంటే రాజకీయపార్టీలలో సంస్కరణ 'పై నుండి క్రిందకు' జరుగుతుంది. పైన ఆమోదం పొందినవే క్రింది స్థాయిలో అమలు అవుతాయి. ఒకరు రాజకీయ పార్టీని సంస్కరించేందుకు లేదా బహుజనులను ఉద్ధరించేందుకు గొప్ప ఆలోచన చేశా అనుకొందాము. కాని దాన్ని ఉన్నది

ఉన్నట్టుగా అమలు చేయడానికి కుల ఆధిపత్య నాయకత్వానికి సమస్య. ఆ ఆలోచన ఉన్నది ఉన్నట్టుగా అమలు చేస్తే బహుజనుల ప్రభావం పెరిగి, కుల ఆధిపత్య ప్రభావం పోతుందేమోనని భయం. బహుజనుల రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కావలసిన లేదా జరగాల్సిన సంస్కరణ 'పై నుండి క్రిందికి' జరగాలి. ఇది కుల ఆధిపత్య, పాలక కుల పార్టీల్లో లేదా భావజాలాల్లో అసాధ్యం. విప్లవం క్రింది నుండి పైకి జరిగే కార్యాచరణ. క్రింది స్థాయిలో బహుజనులు సమీకరించబడి ఉద్యమించగలిగినప్పుడు విప్లవాత్మకమైన మార్పు సాధ్యం. విప్లవ కార్యరూపంలో కూడా కుల ఆధిపత్య చొరబాటు ఉంటుంది. వారి మౌత్ పీస్ మీడియా ద్వారా ఉద్యమ స్ఫూర్తితో నాయకత్వం చేస్తున్న వారిపై బురద చల్లగలరు, బహుజన రాజ్యం ఒక యుటోపియన్ ఆలోచనగా దుష్ప్రచారం చెయ్యగలరు. బహుజన నాయకులను టార్గెట్ చేయగలరు లేదా ఉద్యమస్ఫూర్తి లేని, సమీకరించబడని బహుజన బద్దకస్తులను బ్రెయిన్ వాష్ చేయాగలరు. కాబట్టి విప్లవ రాజకీయమే బహుజనుల ముందున్న మార్గము.

కొందరు బూర్జువా, పక్షపాత, అవినీతి నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు కుల ఆధిపత్య రాజకీయ పార్టీలో క్రియాశీలకంగా పాల్గొనటానికి అనుమతి పోయి ఉండవచ్చు. కొందరిని కుల ఆధిపత్య పార్టీల నుండి బయటకు పంపే ప్రయత్నాలు జరిగి ఉండవచ్చు. కుల ఆధిపత్య ప్రత్యక్ష, పరోక్ష నాయకత్వంలో అలా జరగడం పరిపాటే. సంస్కరణ 'పై నుండి క్రిందికి' జరగని కుల ఆధిపత్య రాజకీయ పార్టీల్లో బహుజనుల స్వరం అణచివేయబడడం మామూలే. బహుజన గుర్తింపు గల నాయకులు తాము లేకపోతే కుల ఆధిపత్య రాజకీయ వ్యవస్థలో బహుజన స్వరం లేకుండా పోయేదని భావించడం తప్పుడు భావన. ఈ భావన వ్యక్తిగత గుర్తింపును కాపాడుకోవడానికే ఎక్కువగా ఉపయోగపడుతుంది; బహుజన సమూహానికి గణనీయమైన ప్రయోజనాలు అందించడంలో కాదు.

అనేక సందర్భాల్లో, ఆధిపత్య కులాల మద్దతు ఉన్న బహుజన సామాజిక గుర్తింపు గల నాయకులు అప్రయోజకంగా మరియు ప్రజలకు అసంతృప్తికరంగా మారుతున్నారు. దీనికి ఉదాహరణగా ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఎన్నికవుతున్న కుల ఆధిపత్య పార్టీల బహుజన ప్రతినిధులనే తీసుకోవచ్చు. తోలుబొమ్మల వ్యవస్థ కాలక్రమేణా బహుజన సామాజిక గుర్తింపు ఉన్న నాయకులు మరియు బహుజన సమాజం మధ్య అంతరాన్ని ఏర్పరుస్తుంది. ఈ రకమైన

**రాజకీయాలు కొనసాగడం వల్ల బహుజన సమాజం, సరైన విధంగానే, బహుజన సామాజిక గుర్తింపు ఉన్న నాయకులను తమ నిజమైన ప్రతినిధులుగా చూడటం మానేస్తారు. వారు వారిని ఆధిపత్య కుల సమాజం పంపిన ప్రతినిధులుగా చూస్తారు. ఈ రకంగా ఈ రెండు శ్రేణుల మధ్య ఉండవలసిన ఐక్యత, నమ్మకం క్రమేపీ తగ్గుతున్నాయి. ఇది భారతదేశంలో తరచుగా జరుగుతుంది.**

**ఈ సహకరణ (co-optation) ప్రక్రియ ఫలితంగా బహుజన సామాజిక గుర్తింపు ఉన్న నాయక వర్గం మరియు బహుజన ప్రజల మధ్య పెరుగుతున్న అంతరం కుల ఆధిపత్య నయా వలసపాలన యొక్క సాధారణ లక్షణం. ఈ దేశంలో బహుజన సమాజాల్లో "బంధింపబడిన నాయకులు" అనే వర్గం ఒకటి ఏర్పడింది. వీరు సాంకేతిక మరియు పరిపాలనా నైపుణ్యాలు కలిగినవారైనా; సమాజానికి ఉపయోగపడే నాయకత్వాన్ని అందించగలిగినవారైనా, వారు అలా చేయలేరు, ఎందుకంటే వారు కుల ఆధిపత్య అధికార వ్యవస్థచే బంధింపబడ్డారు.**

# 4. నీలి అంతరంగం

సహకరణ (co-optation) ప్రక్రియలో ఎన్నిక చేయబడిన బహుజన నాయకుల తరువాత ఎక్కువగా బహుజన విద్యావంతులు, గ్రూప్ -1 మరియు గ్రూప్-2 అధికారులు, విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారాల్లో పై స్థాయి నుండి మధ్యస్థాయి వరకు ఉన్న వారు కుల ఆధిపత్య రాజకీయ పార్టీల ఏజెంట్లుగా మారి ఈ సహకరణ ద్వారా రాజకీయ పదవులు పొందాలని చూస్తున్నారు. ముఖ్యంగా వీరు కాలేజీ, యూనివర్సిటీ చదువులు చదివిన వారు, స్పష్టంగా మాట్లాడగలవారు, బహుజన యువతతో ప్రతిరోజూ సన్నిహితంగా ఉండేవారు. అయినప్పటికీ (కొన్ని మినహాయింపులు ఉన్నప్పటికీ), వీరిలో ఎక్కువమంది బహుజన సమాజానికి సానుకూలమైన లేదా దృఢమైన నాయకత్వం ఇవ్వడం లేదు.

"ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వం నా జీతం చెల్లిస్తుంది అంటున్నారు; రిటైర్డ్ ఉద్యోగులు, నా పెన్షన్ ప్రభుత్వం చెల్లిస్తుంది అంటున్నారు, నాకు మీతో చెప్పడానికి ఏమీ లేదు. క్షమించండి, నాకు వేరే ముఖ్యమైన పని ఉంది అని అంటున్నారు." పై వర్గంలోని చాలా మంది కుల వివక్ష వ్యవస్థకు తమను తాము అనుగుణంగా మార్చుకొన్నారు. కొద్దిపాటి డబ్బు మరియు సందేహాస్పదమైన ప్రతిష్ఠ కోసం వారు ఆధిపత్య కులాల దాస్యానికి తలవంచారు. ఫలితంగా, కులవివక్ష వ్యవస్థను మౌలికంగా సవాలు చేసే బహుజనుల స్థితి మెరుగుదలకు సంబంధించిన పోరాటం నుండి వారు స్పష్టంగా దూరమయ్యారు. వారితో పాటు వారి అనుచరగణం, వారి అనుయాయిలు కుల వివక్షతకు తమను తాము అనుగుణంగా మార్చుకొంటూ కుల ఆధిపత్య పార్టీల పంచన బ్రతుకుతున్నారు. ఇది స్పష్టంగా కనిపిస్తుంది.

బహుజనులు కుల ఆధిపత్య రాజకీయాల సరసన చేరినప్పుడు, కొందరు ఆధిపత్య కుల సమాజాన్ని కూడా తప్పుదోవ పట్టిస్తారు—అంటే ఈ వ్యవస్థకు బహుజనుల మద్దతు ఉందని భావించేలా చేస్తారు. బహుజనులు ఆధిపత్య కులాల పార్టీ రాజకీయాల్లో పాల్గొనడం వలన, వారు కుల ఆధిపత్య సమాజపు రాజకీయ వ్యవస్థను పూర్తిగా అంగీకరించారని అనుకోవడం కూడా సరైనది కాదు. నా వ్యాఖ్యానం ప్రకారం, బహుజనసామాజిక గుర్తింపు గల నాయకులు ఆధిపత్య కుల వర్గాల్లా నిజమైన విధేయతతో ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలకు కట్టుబడి ఉండటం లేదు.

వారి జనాభా సాంద్రతను బట్టి రాజకీయ పార్టీలు వారికి పెద్దపీట వేస్తున్నాయి. గత్యంతరం లేక ఆధిపత్య కుల పార్టీల్లో జీవిస్తున్నారు. రాజకీయ పార్టీలకు వారి మద్దతు చాలా సందర్భాల్లో వ్యూహాత్మక రాజీ మాత్రమే, పూర్తిస్థాయి మద్దతు కాదు.

బహుజనులు ఆధిపత్య కులాల రాజకీయ పార్టీల అధినేతలుగా కేవలం అలంకరణకు మాత్రమే నియమించబడుతున్నారు. వారి మాట రాజకీయ పార్టీలలో చెల్లదు. ఉదాహరణకు మన ప్రధాని మోదీ బీసీ కానీ బీసీ. బహుజన సామాజిక ముసుగు తొడుగుకున్న ఆధిపత్య కులాల రాజకీయ ప్రతినిధి. అతని వ్యక్తిత్వ విలువలు పక్కన పెడదాం. ఎన్నికల్లో బహుజనుల ఓట్లు కొల్లగొట్టటానికి బహుజన సామాజిక గుర్తిపు ఉన్న నాయకునిగా కార్పొరేట్ మౌత్ పీస్ మాస్ మీడియా, బీజేపీ సోషల్ మీడియా విపరీతమైన ప్రచారం చెయ్యబట్టి బహుజన ఓటు బీజేపీ వైపు మరలింది అనడంలో సందేహమే లేదు. అటువంటివారిని అలంకారానికి వాడుకోవడానికి ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి అనడానికి ఇదొక ఉపమానము. గత్యంతరం బహుజన వాదమే.

ఈ దేశంలో చిత్తశుద్ధితో బహుజనులకు ప్రాతినిధ్యం వహించే బాధ్యతను తీసుకునే వారు, తమ పూర్తి భద్రతను కాపాడుకుంటూ నాయకత్వం సమర్థంగా చేయగలమనే భావనను వదిలేయాలి. ఎందుకంటే వారు అగ్రకులాల దాడికి ఖచ్చితంగా గురికావాల్సి వస్తుంది. ఉద్యోగాలు త్యజించాల్సి వస్తుంది, గౌరవస్థానాలు వదులుకోవాల్సి వస్తుంది, అనుకూలతలు కోల్పోవాల్సి ఉంటుంది. వాస్తవానికి, బహుజన నాయకత్వం మరియు భద్రత పరస్పర విరుద్ధ ఆలోచనలు. ఒకరు కులాహంకార వ్యవస్థను ధైర్యంగా సవాలు చేస్తే, ఆ వ్యవస్థ అతనిని ప్రోత్సహిస్తుందని లేదా సౌకర్యంగా చూసుకుంటుందని ఆశించరాదు. బహుజనుల కోసం ఏదో సాధిస్తున్నామనే పేరుతో తమ స్వరాన్ని తగ్గించుకునే బహుజన సామాజిక గుర్తింపు గల నాయకత్వం, అసలుకు చూస్తే, ఆధిపత్య కులాల సంపన్న సమాజం సులభంగా ఇవ్వగల చిన్న చిన్న, అర్థరహిత ప్రయోజనాలకే పరిమితమవుతుంది.

రాజకీయ వలసవాదం యొక్క మరో ముఖ్యాంశం రాజకీయ సరిహద్దుల మార్పిడి మరియు లోపభూయిష్ట ఎన్నికల వ్యవస్థ రూపకల్పన.

బహుజనుల జనాభా స్థూలానా 80 శాతం పైమాటే అనే వాదన తరచూ వినిపిస్తుంది. ఎక్కువ శాతం ప్రజలు భౌగోళికంగా కేంద్రీకృతమై ఉన్నందున, వారు అన్ని ప్రాంతాల్లో మెజారిటీ బలంగా మారే అవకాశముంది—వీరు సమీకరించబడితే ఆధిపత్య కులాల అధిపత్య విధానానికి వ్యంగ్య ఫలితం ఇవ్వగలరు. అయినప్పటికీ, బహుజనులు ఇంతవరకూ తమ ఓటు బలాన్ని పూర్తిగా బహుజన సిద్ధాంతంవైపు వినియోగించుకోలేకపోయారు. కుల ఆధిపత్య రాజకీయ వ్యవస్థలు కులాల కుమ్ములాటలు సృష్టిస్తున్నాయి ఆ పైన సరిహద్దులను మార్చి (gerrymandering) బహుజనుల అసలు ఓటు బలం బహుజనవాదంలో ప్రతిబింబించకుండా చేస్తున్నాయి. ఆ ప్రయత్నాలు విభజించి పాలించేందుకు అగ్రకులాలకు ఉపయోగపడవచ్చు కానీ ఎన్నికల ఫలితాల్లో బహుజన మెజారిటీని తగ్గించడంలో ఏమాత్రం ఉపయోగపడవు. ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా అది బహుజన ఓటు ఆమోదంతోనే సాధ్యమవుతుంది.

రాజకీయ అధికారాన్ని తమ చేతుల్లోనే ఉంచుకోవడానికి కుల ఆధిపత్య అధికార నిర్మాణం కొత్త మార్గాలను ఆవిష్కరించడంలో, లేదా ఇప్పటికే వ్యవస్థ లో ఉన్న లోపభూయిష్ట పరిస్థితులను వినియోగించడంలో ఎంతో నైపుణ్యం చూపిస్తుంది.

ఉత్తర భారతదేశంలో బీసీలు 60 శాతం ఉన్నారని ఎవరైనా ఊహిస్తారా? బీసీలను అగ్ర వర్ణాలు తమలో కలిపేసుకోవడం వల్ల బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ లేకపోవడం వల్ల, బీసీ సమాజం నుంచి వచ్చే రాజకీయ ప్రతినిధుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

బహుజన అభ్యర్థికి ఎన్నికల్లో సీటే గనుక కేటాయించబడితే బహుజన అభ్యర్థి గెలిచే అవకాశాలు ఎక్కువ — కానీ బహుజనులను గందరగోళంలోకి నెట్టడానికి ప్రత్యర్థి పార్టీ కూడా అదే కులానికి చెందిన వ్యక్తికీ అదే నియోజకవర్గంలో సీటు కేటాయిస్తుంది, లేదా ఆ నియోజకవర్గంలో జనాభా అధికంగా ఉన్న మరో బహుజన కులానికి సీటు కట్టబెడుతుంది. రాజకీయంగా రెండు బహుజన కులాలను దాయాదులు చేస్తుంది, వాటి మధ్య రాజీ కుదుర్చుతుంది. ఇలా బహుజనులు నిట్ట నిలువునా చీల్చుతూ వారికి సంభంధములేని మాయలో పడిపడిపోయేటట్టు చేస్తున్నారు. స్వచ్ఛమైన బహుజన గుర్తింపు, తుచ్ఛమైన కుల గుర్తింపు మధ్య బహుజనులు తమ కులాలవైపు మొగ్గు చూపడం కుల ఆధిపత్య పార్టీలకు, పాలక కులాలకు అధికారం చేజిక్కించుకోవడానికి కావలసిన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఆ సందర్భంలో

ఆధిపత్య కులాల ఓట్లు క్రియాశీలకంగా మారుతున్నాయి అనడంలో సందేహమే లేదు. ఇలాంటి సందర్భాల్లో అగ్రకులాలు నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. ఎందుకంటే ఖచ్చితంగా ఆధిపత్య కులాల జెండా మోసిన వాడు, పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద జెండా మోసిన వాడు, ఆధిపత్య కులాల ఆశ్రయం పొందిన వాడు విజయానికి దగ్గర అవుతున్నాడు. తోలుబొమ్మ వ్యవస్థలో అటువంటి విజయాలు కూడా విజయాలుగానే పరిగణింపబడతాయి. తోలుబొమ్మలు నిజమైన బహుజన స్ఫూర్తి ఉన్న నాయకులు కాదు, కేవలం ఆధిపత్య కులాల చేతిలో తోలుబొమ్మలు.

బ్రిటీషు వలస పాలన పరిస్థితిలో ఉన్నట్లే, ప్రస్తుతం బహుజనుల్లో ఆధిపత్య కులాల పట్ల ఒక విధమైన విధేయతతో కూడిన -ఆగ్రహ భావం గూడుకట్టుకుని ఉంది. రాజకీయ పార్టీల వ్యూహ సమావేశాలకు హాజరైనప్పుడు మెజారిటీ బహుజనులు విధేయులుగా కనిపిస్తారు; కుల ఆధిపత్య పార్టీల నాయకులు సూచించిన వ్యూహాలను సంతోషంగా అంగీకరిస్తున్నట్లు నటిస్తూ ఉంటారు. మీడియా ముందు భజన చేస్తుంటారు. అటువంటి సమావేశాల తర్వాత ఆ బహుజన గుర్తింపు గల నాయకులు "బహుజన ప్రాతినిధ్యం ఉండాలంటే ఆధిపత్య కులాల వైఖరులన్నింటిని తట్టుకోవాల్సి వచ్చింది"అని చెపుతుంటారు. తమ బహుజన సామాజిక సమూహం దగ్గర మాత్రం తాము ప్రాతినిధ్యం వహిస్తున్న కుల ఆధిపత్య పార్టీ శ్రేణులపై తమ అసహనాన్ని రహస్యంగా వ్యక్తపరుస్తూ, బహుజన హక్కుల కోసం తమను తాము ఎక్కువ పోరాటస్ఫూర్తితో ఉన్నవారిగా సర్దిచెప్పకొంటూ బయటపడుతుంటారు. ఇలాంటి వారిమీద ఓ కన్నేసి ఉంచే ఏర్పాట్లను కూడా ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు చేస్తూఉంటాయి. ఈ విధమైన వైఖరి నేటి రాజకీయాల్లో అసాధారణ మేమి కాదు. చాలామంది బహుజనులు, కలిసి పనిచేయాల్సి వచ్చే అసత్యసంధులైన ఆధిపత్య కులాల పార్టీల నాయకత్వాల మీద తమలో ఉన్న అసహ్యాన్ని వ్యక్తిగతంగా ఒప్పకుంటారు. (అనేక సందర్భాల్లో ఈ అసహ్యం పరస్పరంగానే ఉంటుంది.)

భారతదేశంలో విస్తృత సమాజంతో బహుజనుల ఆర్థిక సంబంధాలు కూడా వలస స్థితిని ప్రతిబింబిస్తున్నాయి. బహుజన సమాజంపై అమలవుతున్న ఆధిపత్య కులాల రాజకీయ అధికారము, బహుజనులు అనుభవిస్తున్న ఆర్థిక దౌర్భాగ్యము రెండూ కలిసి నడుస్తున్నాయి.

వలసవాదం అనాగరిక చర్య, నాగరికతను విస్తరించాలనే కోరిక వలసవాదానికి లేదు. వలసవాదం మనుషుల మధ్య, సమూహాల మధ్య కొనసాగిన పోటీలలో కొన్ని ఘట్టాలు మాత్రమే.

దూర ప్రాంతాలకు వెళ్లి వలస ప్రాంతాలను ఆక్రమించిన వారు మొదటగా తమ గురించే ఆలోచించుకొన్నారు; తమ లాభం కోసం పనిచేసుకున్నారు, తమ అధికారాన్ని పెంచుకోవడానికే వలస ప్రాంతాలను జయించారు.

చరిత్రలో వలస ప్రాంతాలు ప్రధానంగా "వలస పాలకుడి" సంపదను పెంచేందుకు మాత్రమే పని చేశా ; దాని ఫలితం వల్ల వలసప్రాంత ప్రజలు పాలకునిపై ఆర్థిక అవసరాల కోసం ఆధారపడ్డారు. తరచూ వలస పాలన వెనుక "మత ప్రచారం," "సంస్కరణ," "అణచివేయబడిన ప్రజలను అభివృద్ధి చేయడం" వంటి నెపాలు కనిపించాయి. ఈ ఆర్థిక స్థితి స్వతంత్ర భారత.దేశంలోని బహుజన సమాజాలపై ఇప్పటికి కూడా కొనసాగించబడుతుంది. కుల ఆధిపత్య అధికార నిర్మాణం బహుజన సమాజాన్ని క్యాపిటలిస్ట్ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడేలా చేస్తుంది. బ్రిటిషువారి మాదిరిగానే, వీరు కూడా "మిత్రులు" అనే రూపంలో కనిపిస్తారు; "బహుజన మిత్రులు" అనే రూపంలో కనిపిస్తారు; విలువైన సేవలు అందిస్తున్నామని చెబుతారు, కానీ వారి అసలు లక్ష్యం వ్యక్తిగత లాభం, ఆధిపత్య కులాల అధికార వ్యవస్థను కొనసాగించడమే. ప్రభుత్వ, ప్రైవేట్ సామాజిక సంక్షేమ సంస్థలు పథకాలు కూడా తరచూ "ఉద్ధరణ"పేరుతో సేవలు అందిస్తున్నట్లు నటిస్తుంటాయి; కానీ వాస్తవంలో అవి వ్యక్తి పోరాటస్ఫూర్తి కోల్పోయేలా చేసి, అతనిని మరింత ఆధారపడే స్థితికి దిగజార్చుతాయి. ఆధిపత్య కులాల దృక్పథమైన ఈ సంరక్షణ భావాన్ని (paternalism), బహుజన మేధావులు స్పష్టంగా ఖండించాలి. RSS కార్యకర్తలు నయా మిషనరీల రూపంలో గ్రామాల్లో సంచరిస్తూ, ఒక పూటే తింటూ, ఎదో ఒక పంచన సేదదీరుతూ రాజకీయ లక్ష్యాలతో కూడిన మత ప్రచారం చేస్తూ బహుజనులను వంచించే ప్రయత్నాన్ని విద్యావంతులైన బహుజన కార్యకర్తలు గుర్తించి వాస్తవాలను బహుజనులకు వివరించాలి. కేపిటలిస్ట్ నిధులతో, కేపిటలిస్ట్ ధోరణికి అనుకూలంగా బహుజన ప్రజలను మార్చే లక్ష్యంతో పని చేస్తున్న RSS ప్రచార ఆచరణ విధానాలకు ఏమాత్రం తీసిపోని సిద్ధాంతబలం, ప్రచార ఆచరణలతో బహుజన నాయకత్వం, కార్యకర్తలు రంగంలో నిలవాలి.

అణచివేతదారుడి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటే, అణగారినవారు ఎప్పటికీ స్వేచ్ఛను పొందలేరు. ఈ అంశాన్ని బహుజన నాయకత్వం దశాబ్దాల క్రితమే గుర్తించింది. పూలే, అంబేద్కర్, కాన్షిరాం నాయకత్వంలో దఫదఫాలుగా బహుజన ఉద్యమం ఉవ్వెత్తున లేచింది.

ప్రస్తుత పరిస్థితి వేరేలా ఉంది. బహుజన భావజాలంతో పని చేసే నాయకులను ఆధిపత్య కులాల అధికార నిర్మాణం గుర్తించి వారి మీద పరోక్ష దాడి చేస్తుంది. బహుజన భావజాలంతో పనిచేసే వారిని గుర్తించేందుకు RSS తమ వాలంటీర్లను ప్రతి ఆఫీసులో నియమించింది. వారు బహుజన భావజాలంతో పనిచేసే వారికి ఏ అనుమానం రాకుండా బహుజన ముసుగు ధరించి ఆధిపత్య కులాల ఎజెండాను మోస్తున్న వారు. ఆ వ్యవస్థ బహుజన నాయకుడికి మరో బహుజన నాయకుడికి మధ్య కులం అనే అంతరాన్ని సృష్టిస్తుంది. బహుజనుల మధ్య తన కార్పొరేట్ మౌత్ పీస్ మీడియా ద్వారా కులం, మతం, ప్రాంతం, తరగతి అంటూ అంతరాలను సృష్టిస్తుంది. బహుజనులు ఐక్యం కాకుండా సవాలక్ష విధాలా ప్రయత్నిస్తుంది.

ఆధిపత్య కులాల బందిఖాణా నుండి బహుజనులు బయటకు రావడంలేదు అంటూ బహుజన ప్రజలను బహుజనులే తప్పుబట్టడం హాస్యాస్పదం. బహుజనులు ఏదో స్వభావ లోపం వల్ల దిగజారిన స్థితిలో లేరు. ఎందుకు ఆధిపత్య కులాల అధికారం నుండి విముక్తులు కాలేక పోతున్నారు? బహుజనులదే తప్పా? అని ప్రశ్నిస్తే సమాధానం: కుల ఆధిపత్య అధికార నిర్మాణం బహుజనుల మెడపై అణచివేత అనే కత్తిని పెట్టి, మతం అనే ముసుగులో మోసంచేస్తూ, మరో ప్రక్క 'వారు స్వేచ్ఛకు సిద్ధంగా లేరు' అని వ్యంగ్య సందేశాన్ని ఇస్తుంది.

నేటి సమాజంలో హిందూ మత కులచట్రంలో బంధింపబడిన నాయకులలో అత్యధిక శాతం "కుల ఆధిపత్య అధికార నిర్మాణం"అనేదేమీ లేదని అనుకుంటున్నారు. కులాలు సోమరులు కాకుండా పని చేయించే విధానం అని అనుకుంటున్నారు. ఆధిపత్య కులాల ప్రతినిధులైతే వారి అధికార నిర్మాణ నియంత్రణ, అణచివేత, వలసవాదం వంటివికాదని వాదిస్తారు. భారతదేశంలో అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఈ దేశం స్వేచ్ఛా గృహమని నమ్మిస్తారు.

వలసవాదం—ప్రపంచ దేశాల్లో సృష్టించిన అత్యంత క్రూరమైన ఫలితం ఏమిటంటే, అది ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో, నిర్లక్ష్యంగా, బలహీనులను సమాజంలో మరింత దిగువ, మరింత తక్కువ స్థాయికి నెట్టివేసింది. వలసవాద పోకడలను పుణికిపుచ్చుకున్న కుల ఆధిపత్య నియంత్రణకు మూలమైన హిందూమతం తన కులవ్యవస్థను కొన్ని కులాల ప్రయోజనాల కోసం మాత్రమే తీసుకువచ్చింది; బహుజనులను రక్షించడం కోసం లేదా అభివృద్ధి చేయడం కోసం కాదు. సాటి మనిషిని తక్కువ స్థాయి జంతువుగా భావించి బానిసలుగా మార్చారు, సరైన నివాసం

ఇవ్వకుండా, తగిన వైద్య సేవలు అందించకుండా, గౌరవప్రదమైన విద్య ఇవ్వకుండా వేలాది సంవత్సరాలు అణగద్రొక్కారు. అగ్రకులాల వారు ప్రధానంగా భూవనరులను, కులాలవారీగా శ్రమను కేటాయించి మానవ వనరును తమ అధీనంలో పెట్టుకోవడంలో మాత్రమే ఆసక్తి చూపించారు. భూమిని సేద్యపరచి పంటను పండించాలి అంటే శ్రమ అవసరం—అది ఎంత చౌకగా దొరికితే అంత మంచిదని వారు భావించారు. కారు చౌకగా బహుజన సమాజం వారికోసం శ్రమ చేసింది. రాచరికంలో అగ్రకులాల దయా దాక్షిణ్యాల వల్ల అతికొద్దిమంది బహుజనులకు కొద్దిపాటి భూమి లభించింది.

వేల సంవత్సరాల క్రితం రాచరిక, జమీందారీ వ్యవస్థలో అగ్రకులాల అధీనంలో ఉన్న భూమిని చదును చేయడానికి, పంట పండించడానికి, వారికి సేవలు అందించడానికి బహుజనులు సహజ పరిష్కారంగా కనిపించారు. బహుజనులకు ఉన్న వ్యాధి నిరోధక శక్తి, వ్యవసాయం లేదా తోటల వ్యవస్థలో, నిర్మాణ శ్రమలో, కళలలో మరియు చరిత్ర నిర్మాణంలో కఠిన శ్రమ చేయగలిగే శక్తి సామర్థ్యాలు, కండ బలం, గుండె బలం, కుల వ్యవస్థకు ఎదురు చెప్పకుండా లోబడేతత్వం, హిందూ మతం పట్ల ప్రగాఢ విశ్వాసం బహుజనులని బానిసలుగా మార్చివేసే ఆలోచనకు ఆజ్యం పోశాయి. హక్కులు లేని వారీగా చేయడం వలన బహుజనులను సులభంగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవచ్చు. వారిని పూర్తిగా వినియోగించుకోవచ్చు. అలా చేస్తే యజమానికి అత్యవసరమైన శ్రమ సరఫరా నిరంతర మార్పులకు లోనవదు. కఠినమైన మత నియమాలతో, ధర్మం పేరుతొ బహుజనులను నియంత్రించవచ్చు; నైతికంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా వారిని దిగజారిన స్థితిలో ఉంచవచ్చు. కొందరు బహుజనులను కట్టు బానిసలుగా, మరికొందరిని ఒప్పంద సేవకులుగా (indentured servants) చేయవచ్చు. మతం మాటున వేటు వేయవచ్చు. ఎదురు ప్రశ్నించకుండా ఆధిపత్య కులాల యజమానులకు సేవ చేయడం వారి పని. వ్యవస్థతో వారికున్న ఆర్థిక సంబంధాన్ని కాదని, మనుగడ కోసం వేరే చోటికి పారిపోయే అవకాశము వారికి లేదు. ఈ విధంగా బహుజనులు అగ్రకులాల వారికి ఆర్థిక రక్షకులుగా చేయబడ్డారు. నాటి నుండి నేటి వరకూ బహుజనులు ఆర్థిక దౌర్భాగ్యములో కొట్టుమిట్టాడుతున్నారు.

బహుజనులు ఆధిపత్యకులాలు గౌరవించాల్సిన హక్కులు ఏమి లేనివారు; కుల వ్యవస్థ, సనాతన ధర్మం  ప్రకారం బహుజనులను ఆధిపత్య కులాల ప్రయోజనార్థం బానిసత్వంలోకి తగ్గించడం న్యాయసమ్మతము, చట్టబద్ధము.

ఆర్థికపరమైన అంశాలు మాత్రమే అత్యంత ముఖ్యమైనవిగా పరిగణింపబడిన కాలంలో కులవ్యవస్థ ఏర్పాటు అగ్రకులాల వారికి ఎంతో రక్షణగా నిలిచింది. క్రైస్తవ, ముస్లీము మతాలలో చెప్పబడే ఆత్మ రక్షణ కన్నా, కుల వ్యవస్థ ఆధిపత్య కులాలవారికి ఇచ్చిన సమగ్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక రక్షణ ఎన్నో రేట్లు బలీయమైనది. బహుజనుల శ్రమ సరఫరా, విధేయత, విశ్వాసం అనంతమైనదిగా కనిపించడంతో, ఆధిపత్య కులాలకు తమ సమగ్ర రక్షణ గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేకుండాపోయింది.

# 5. అమృతకాల విషం

నిరంతర శ్రమ సరఫరా ఆధిపత్య కులాలకు నిత్యావసరం, దానిని పొందడంలో కుల వ్యవస్థ కీలక పరిష్కారంగా మారింది. అందువల్ల కుల వ్యవస్థ ఒక స్థిర సంస్థగా అవతరించింది. ప్రపంచంలో పరిష్కరించబడని అత్యంత క్లిష్ట సమస్యలలో ఒకటిగా నిలిచింది. కుల వ్యవస్థను కాపాడుకోవడం నేటి అగ్రకులాల ప్రధాన అజెండా. హిందూ మతం వారికీ ఇచ్చిన ఉన్నత స్థితిపై వారికి నమ్మకం; రాజ్యాంగంలో ఉన్న చట్టాలపై కాదు. ఆ నమ్మకం ఇప్పటికీ కొనసాగుతోంది. చట్టం ద్వారా బానిసత్వాన్ని తొలగించినా కుల అహంకారుల మనసుల నుండి ఏ శక్తి దాన్ని తొలగించలేకపోయింది.బహుజనులు ఈ దేశాన్ని రక్షించడానికి యుద్ధాలలో పాల్గొన్నప్పటికీ, తమ దేశభక్తిని పదేపదే నిరూపించినప్పటికీ, ఆంతర్యంగా ఉన్న కుల అహంకార, అణచివేత ధోరణి వారికి సామాజిక వ్యవస్థలో సమాన స్థానం లేకుండా చేసింది, చేస్తుంది.

పూర్వం నుండీ స్వాతంత్ర్యం సిద్ధించే వరకు అగ్రకుల పాలకుల యుద్ధాలలో బహుజనులను పాల్గొననివ్వని సనాతన ధర్మం, స్వాతంత్రము సిద్ధించాక ఆధిపత్య కులాల అధికారం కోసం రాజకీయ యుద్ధములో సమిధలుగా మార్చుతుండడము, బహుజనులను అధికారానికి దూరంగా పెట్టడమూ, అన్యాయాన్ని కొనసాగించడమూ విచిత్రమే. వలస పాలకుడు తన ఆధీన ప్రజలను యుద్ధానికి పంపిస్తాడు, వారు తన సామ్రాజ్యాన్ని కాపాడేందుకు పోరాడాలని, చనిపోవాలని ఆశిస్తాడు; కానీ వారికి సమాన స్థానం ఇవ్వాల్సిన బాధ్యత తనపై ఉందని మాత్రం భావించడు. వాస్తవానికి, ఆ యుద్ధాలు పాలకుడు మరియు ఆధీన ప్రజల మధ్య ఉన్న సామాజిక-రాజకీయ- ఆర్థిక స్థితిని కాపాడేందుకే జరుగుతాయి. యుద్ధాలు ఎంత మార్పులు తెచ్చినా, వలసాధిపతి మరియు ఆధీనుల మధ్య మౌలిక సంబంధం పెద్దగా మారదు. వలసాధిపతి పాత్రలో ఆధిపత్య కులాల వారు ఉంటే, అధీన ప్రజల పాత్రలో బహుజనులు ఉన్నారు. రాజ్యాంగబద్ధ పాలనలో ఇలా జరగడం అన్యాయం.

ముందు చూసిన విధంగానే, స్వాతంత్ర్యానంతరం మనదేశంలో బహుజనులు ఎంత దేశభక్తిని కనబరచినా, ఉత్పత్తి శ్రమలో నూటికి తొంభై తొమ్మిది శాతం భాగమై ఉన్నా, రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం విషయానికి వచ్చే సరికి ఆధిపత్య కులాలు వారికీ మొండి చెయ్యి చూపిస్తున్నాయి. గడిచిన 12 సంవత్సరాలుగా మోడీ హయాములో హిందుత్వ ప్రభుత్వం ఈ

విధానాన్ని సాధారణం చేసేసింది. ఒక్క రూపాయి ధర పెరిగితే నానాయాగీ చేసిన ప్రజలు నేడు వందల రూపాయలు ధరలు పెరిగినా కిమ్మనకుండా చూస్తున్నారు. సూక్ష్మముగా మోడీ ప్రభుత్వం ఏ కార్పొరేట్ పెట్టుబడిదారునికి నొప్పి కలుగకుండా చూస్తూ, బహుజనుల శ్రమను కారు చౌకగా దోచుకొంటుంది.

తరచుగా వినపడే 'బహుజనులను యోగ్యత లేని, హక్కులు లేని, అధికారం సంపాదించుకొనే జ్ఞానం లేని, వనరులు లేని, ముఖ్యంగా సమీకరించబడలేని వర్గంగా వర్ణిస్తూ ఉండడం పరిపాటే. బహుజనులు మునుపు బానిసలు; భక్తి ఉద్యమ ప్రారంభం ద్వారా స్వేచ్ఛ పొందిన వారు; విడుదల లేదా విముక్తి అనేది ప్రేమ, శరణాగతి మరియు భక్తి ద్వారా లభిస్తుందని బోధించిన భక్తి ఉద్యమం ద్వారా హిందూ మతంలో స్థిరపరచబడిన వారు; స్వతంత్రులుగా జీవించడంలో అనుభవం లేని వారు, స్వీయ నియంత్రణలో శిక్షణ లేని వారు; స్వయం పోషణ శిక్షణ ద్వారా గంభీరత పొందలేని వారు; తాము అర్థం చేసుకోలేని స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం ఉత్సాహపడిన వారు; ఆశలతో ప్రేరేపించబడ్డవాళ్లు; నాయకత్వం లేక గందరగోళంలో ఉన్న వారు; అయినప్పటికీ అమాయకత్వంతో దూకుడుతో ఉన్న వారు; పనిని ద్వేషించి, సుఖాలను కోరుకునే వారు, అధికారం కోసం ఉవ్విళూరే వారు' ఇవి బహుజనుల పట్ల ఆధిపత్య కులాలకు ఉండే తప్పుడు నిర్వచనాలుగా భావించవచ్చు. వాస్తవానికి 'బహుజనులు దోపిడీకి గురౌతున్నవారు, భక్తి ముసుగున అణచివేయబడుతున్నవారు, మూల సమస్యలను అర్థం చేసుకొని సమీకరించుకోగల శక్తి గలవారు' ఈ నిర్వచనాలు, వాటి వెనుకనున్న అర్థాలను బహుజనులు అర్థం చేసుకోవాలి.

బహుజనులను తక్కువ స్థాయి వర్గంగా, అయోగ్యులుగా, కులహీనులుగా భావించే కుల వ్యవస్థ సిద్ధాంతాన్ని నిలబెట్టడానికి వివిధ సిద్ధాంతాలను కూడా హిందూ ధర్మం అభివృద్ధి చేసింది. ఖర్మ సిద్ధాంతం అటువంటిదే.

కృత్రిమ మేధ (ఎఐ) వివిధ రంగాల్లో కార్మికుల అవసరాన్ని తగ్గిస్తుంది. ఫలితంగా బహుజన ప్రజలకు ఉద్యోగ అవకాశాలు మెల్లగా తగ్గుతున్నాయి. ఇది పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద విధానాల ఫలితం. మానవ మేధస్సుకు మించిన కృత్రిమ మేధస్సు, మానవ శ్రమకు మించిన కృత్రిమ శ్రమను పెట్టుబడిదారి వ్యవస్థ తయారు చేసుకోంది. ఇప్పుడు దీనికి ఒకప్పుడు శ్రమను

అందించిన మానవాళి సంఖ్య ప్రమాదకరంగా కనబడింది. మానవాళిలో ముఖ్యముగా పేదలను నిర్మూలించాలని చూస్తుంది, ఎపిస్టన్ ఫైల్స్ మనకీ విషయాన్ని తెలియ జేస్తున్నాయి. భారతదేశంలో పెట్టుబడీ దారి వ్యవస్థ కూడా అంతర్జాతీయ పెట్టుబడిదారి మాఫియాతో చేతులు కలిపింది. బహుజనులు చాలా జాగ్రత్తగా ఈ విషయాలు పరిశీలించి అప్రమత్తతతో భవిష్యత్తును నిర్మించుకోవాలి. పెట్టుబడిదారుడు తన లాభాలనే, తన రక్షణనే, తన అభివృద్ధినే చూసుకొంటాడు; కార్మికుని రక్షణ, అభివృద్ధి కానేకాదు. రక్షణ రంగంలో ఉద్యోగాలకు పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద, హిందుత్వ ప్రభుత్వం ఎగనామం పెట్టింది. చివరకు బహుజనులకు అవకాశాలు ఉన్న అన్ని రంగాల్లో ఉద్యోగాలకు కోతపెడుతుంది లేదా ఆ రంగాలనే ప్రవేటీకరించాలనీ చూస్తుంది. అంతెందుకు కులవ్యవస్థ కారణంగా పారిశుధ్య పనినే నమ్ముకొని జీవిస్తున్న వారి గంజినీటిలో ఉప్పు చూసి కూడా కుళ్ళుకుంది 'కుల ఆధిపత్య అధికార నిర్మాణం'. పారిశుధ్య ఉద్యోగాలను సైతం కాంట్రాక్టు ఉద్యోగాలుగా మార్చి వారి భవిషత్తును అంధకారంలోకి నెట్టిన నీచ ఆలోచనల పుట్టిల్లు 'కుల ఆధిపత్య అధికార నిర్మాణం'. ఇలా 'కుల ఆధిపత్య అధికార నిర్మాణం' బహుజనులను చూడడం దాస్య వ్యవస్థలో వేళ్లూనుకున్న దృక్కోణం. కుల ఆధిపత్య అధికార నిర్మాణం యొక్క వెన్నెముక దాని పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద విధానం. దాన్ని బహుజనులు సామూహికంగా ఎదుర్కోవాలి. ఎఐ యుగంలో, ఉద్యోగాలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో, శ్రమకు విలువలేకుండా పోతున్న ఈ రోజుల్లో 'ఆధిపత్య కులాల అధికార నిర్మాణాన్ని' రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదుర్కొని పోరాడడం బహుజనుల ముందున్న కర్తవ్యం.

బహుజనులు ఇది తమ ఖర్మ ఫలితం అనుకోకుండా కుల ఆధిపత్య ప్రతిపాదిత రాజకీయ నాయకులను, పాలక వర్గాలుగా మారి కుల ఆధిపత్య అనుకూల నిర్ణయాలు అమలు చేస్తూ అగ్రకులాలతో చేరిపోయిన నయా అగ్రకులాల రాజకీయ పార్టీలను, అధికారులను గుర్తించి వారి పైత్యానికి విరుగుడు ఓటు రూపంలో ఇవ్వాలి.

బహుజన సమూహం అనే భావన నిబంధనలా, ఆజ్ఞలా పాటించాలి. బహుజన సమూహం అనే భావన ఒక నిబంధనలా, ఒక ఆజ్ఞలా పనిచేస్తుంది—అది బహుజనులకు మార్గనిర్దేశం చేస్తుంది, ప్రేరేపిస్తుంది, కొన్నిసార్లు ఒత్తిడి చేస్తుంది కూడా. ఈ భావన సభ్యుల మధ్య ఒక బలమైన

ఐక్యతను సూచిస్తుంది. ఒకరు తమను గుంపులో భాగమని నమ్మితే లేదా భావిస్తే, ఆ గుంపుకు కలిగిన స్థితి భావన ప్రభావంలోకి సహజంగానే వస్తారు. ప్రాబల్యం కలిగిన గుంపుగా మారతారు. కాన్షీరాం నాయకత్వంలో జరిగింది ఇదే. ఇటుంటివారితో భవిష్యత్ బహుజన తరాలకు న్యాయం జరుగనుంది. తమను బహుజన గుంపులో భాగమని గుర్తించని వారు. బహుజన ఉద్యమంలో, లేదా ప్రగతిశీల ఉద్యమాల్లో, తమ బహుజన గుర్తింపును తిరస్కరించి, కొన్నిసార్లు 'అగ్రకులాల'వారిలా జీవించడానికి ప్రయత్నించిన బహుజనులను గమనిస్తున్నాము. ఇటుంటివారితో భవిష్యత్ బహుజన తరాలకు ముప్పు పొంచి ఉంది.

ప్రతి మనిషి విస్తృత సమాజంతో తన అనుభవాల ఆధారంగా తనను తాను అంచనా వేసుకొంటాడు. బహుజన సమాజపు పరిస్థితుల్లో జీవించాల్సి వచ్చిన వారు రోజువారి తమకు గౌరవం, మర్యాద ఇవ్వబడని అనుభవంతో, వారు తమ విలువపై సందేహపడటం సహజం. ఈ సహజ సందేహాన్ని కొంతమేర హిందూ మతం తన పరిభాషలో నివృత్తి చేసింది. హిందూమతం బహుజనులకు కులాల వారీగా వివిధ అనుభవాలను ఇచ్చింది. కొందరిని ఊరిబయట నిలువ బెట్టింది, కొందరిని వీధి బయట నిలువ బెట్టింది, కొందరిని ఇంటిబయట నిలువ బెట్టింది, కొందరిని ఇంట్లో నిలువబెట్టింది.

ఎప్పటికప్పుడు తిరస్కరణను ఎదుర్కొనే సమూహాలు, తమకు, తమ కుటుంబానికి, తమ వర్గానికి విస్తృత సమాజం ఇస్తున్న గౌరవం సరైనదా? సరిపడనిదా? తమ కుటుంబం గౌరవించ బడుతుందా? అవమానించబడుతుందా? అని సహజంగానే అనుమానిస్తాయి. ఈ సందేహాలే పరస్పర, సమూహ వైరాలకు విత్తనాలవుతాయి. ఆ విత్తనాలిప్పుడు బలమైన వృక్షాలుగా ఎదిగాయి. కుల సమూహాలు ద్వేషించుకొంటున్నాయి.

ద్వేషం ఎక్కడా సరైన ఎంపిక కాదు. అయితే ద్వేషం, హింస ఆధిపత్య కులాల అధికార నిర్మాణపు ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల బహుజనులు కూడా ఐక్యంగా అగ్ర కులాలపై తిరగబడుతున్నారు. హింసకు ప్రతిహింస, ద్వేషానికి ప్రతిద్వేషం బహుజనులు అలవాటు చేసుకొనే స్థితికి చేరుకున్నారు. ఈ స్థితిని కొనసాగించే కన్నా కుల ఆధిపత్య అధికార నిర్మాణాన్ని, దాన్ని వెన్నెముక అయిన పెట్టుబడిదారి విధానాన్ని కూలదోసి, ప్రేమను పంచే బహుజన అధికారం నిర్మించడం ఉత్తమం.

పంచజనుడు అనే రాక్షసుడి ఎముకలతో తయారైంది కాబట్టి, శ్రీకృష్ణుడి శంఖానికి 'పాంచజన్యం' అని పేరు. అదేపేరున 1974లో లిఖించబడిన గోల్వాల్కర్ పాంచజన్యం 'అధిక సంఖ్యాకులకు అధిక లాభం' అనే నినాదాన్ని పరిణితిలేని నినాదంగా పేర్కొంటూ ప్రారంభించబడింది. స్వార్ధ ప్రయోజనాలకై మాత్రమే పనిచేసే ప్రజాసమూహాలు ఎక్కడున్నా పరస్పర సంఘర్షణ ఉండి తీరుతుంది అనేది అప్పటికి వారికి అనుభవంలో ఉన్న విషయమే. అ సంఘర్షణ కొనసాగినంతకాలం మానవ సమైక్యత, సంక్షేమాలు సాధ్యం కావనేది కూడా వారికీ సుస్పష్టమే. అయితే వారి మాటల్లో వినిపించిన "సర్వేపి సుఖినస్సస్తు సర్వే సన్తు నిరామయాః" నాటి నుండి వారి చేతల్లో లేశమంతైనా కనిపించదు. నేటి ఆధిపత్య కులాల అధికార నిర్మాణం వారి మాటల్లో తరచుగా వినిపించే స్వపరిపాలన, స్వదేశీ వస్తు ఉపయోగం, 'సబ్ కా వికాస్' ఆచరణలో కనీసం కనిపించవు. వారు మాయ మాటలను ఉపయోగించి అన్ని బహుజన ఉద్యమాలను అణచివేశారు, లేదా తమలో కలిపేసుకొన్నారు. అంతేకాక హిందూ కుల నిర్మాణం బహుజనులకు విముక్తి మార్గాలను సూచించింది: అగ్రకులాల వాడిగా నటిస్తూ, భ్రమిస్తూ, భక్తితో జీవించడం, వేరే కులాలను ద్వేషిస్తూ తమ కులం తమకు గొప్ప వరమని బ్రతికేయడం. పూర్తిగా వారి కుల ఆధిపత్య వాదనతో ఏకీభవించడం, వారి సంస్కృతిలో కలిసిపోవడం. హిందుత్వం క్రైస్తవ, ముస్లీములకు ఒక విముక్తి మార్గాన్ని సూచించింది: అయితే ఒక మత పరమైన కర్మకాండ ద్వారా, ఒక క్రైస్తవుడు గానీ, ఒక ముస్లీము గాని ఘర్వాప్సి "హిందువుగా" మారవచ్చు. కానీ ఏ విధానం ద్వారానూ ఒక పంచముడు, బహుజనుడు, లేదా శూద్రుడు అగ్రవర్ణం వాడిగా మారలేడు.

ప్రస్తుత తన వలస పాలనలో కుల ఆధిపత్య అధికార నిర్మాణం, కుల "సంస్కృతి"లో మునిగిపోయిన ఒక బహుజన ఎలైట్ వర్గాన్ని సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకుందని అర్థం అవుతుంది. ముందు చూసిన విముకి మార్గాలలో నడిచే బహుజనులను ఎలైట్ వర్గాలుగా చేసే పనిని చేపడుతుంది. చరిత్ర శిథిలాల్లో అసిమిలాడో అనే ఒక ఘర్వాప్సి రకం పోర్చుగీస్ నల్లజాతీయులు బహుజనులకు కనబడతారు. పోర్చుగీస్ ఆచారాలు, దుస్తులు, భాషను స్వీకరించి, కనీస హైస్కూల్ విద్య పొందిన నల్ల జాతీయుని అసిమిలాడో అనేవారు. అతనికి ప్రత్యేక గౌరవం, మెరుగైన నివాసం, పోర్చుగీసు తెల్లవారి మద్దత్తు లభించేవి. విదేశాలకు—ప్రత్యేకంగా పోర్చుగల్, బ్రెజిల్—ప్రయాణించేందుకు పాస్పోర్ట్ కూడా ఇచ్చేవారు. పోర్చుగీస్ వారు

అతనిని సామాజికంగా అంగీకరించేవారు; రెస్టారెంట్లు, నైట్ క్లబ్బుల్లో అతనికి ప్రవేశం ఉండేది. కొన్నిసార్లు పోర్చుగీస్ అధికారులు ఆ నల్లవానికి తెల్ల మహిళను తెచ్చి వివాహం చేయిస్తారు కూడా. కానీ ఈ స్థితిని పొందడానికి, అతను తన మొత్తం ఆఫ్రికన్ వారసత్వాన్ని తక్కువగా భావించి తిరస్కరించాలి.

ఇంచుమించు మనదేశములో హిందుత్వం ఇదే విధానాన్ని అమలు చేయాలి అనుకొంటున్నది. ఆచార వ్యవహారాల్లో బహుజనులు కుల ఆధిపత్య విధానాన్ని ధర్మంగా గొప్పదిగా భావించాలని అది కోరుకొంటున్నది. అందువల్ల కొందరు బహుజనులు రెండు సాంస్కృతిక దృక్పధాల అంచుల్లో జీవించే 'మధ్యస్థ' మనుషులుగా మారుతున్నారు —మాయ ప్రపంచంలో జీవిస్తున్నారు. అసిమిలాడో వలే కుల ఆధిపత్య ఆలోచనను గొప్పదిగా అంగీకరించే బహుజనులు, బహుజన వారసత్వాన్ని తక్కువదిగా, దేశీయ సంస్కృతిని అశాస్త్రీయమైనదిగా భ్రమిస్తున్నారు. ఈ రకమైన బహుజనులను "ఇంటిగ్రేటెడ్"వ్యక్తులు అనవచ్చు. వీరిని అగ్రకులాలు సమాజానికి కుల సమస్యను అధిగమించి అభివృద్ధి చెందిన వ్యక్తులుగా చూపిస్తాయి. లేదా ఈ వ్యక్తులను సమాజ పురోగతికి ఉదాహరణలుగా చూపిస్తాయి. కానీ వాస్తవానికి, వారు తమ స్వంత సమూహాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తిరస్కరించడం ద్వారా, ఈ దేశంలో వివక్షతను మరింత బలపరుస్తున్నారు.

ఈ తరహా విధానాలు బహుజన సమాజం నుండి ప్రతిభను, మేధస్సును అణచివేయడానికి ఉద్దేశించినవి. చాలా సందర్భాల్లో, ఈ "ఇంటిగ్రేటెడ్" వ్యక్తులను బహుజన ప్రజల అసలైన భావాలు, లక్ష్యాలను పలుచన చేసేందుకు ఉపయోగిస్తారు. వారిని "బహుజన సామాజిక గుర్తింపు గల నాయకులు"గా ఎంపిక చేస్తారు, కుల ఆధిపత్య అధికార నిర్మాణం వారితోనే మాట్లాడుతుంది. అటువంటి పరిస్థితుల్లో నిజమైన బహుజన హిత చర్చ అసాధ్యం. ఈ ఎంపికైన నాయకులకు ప్రజాభిమానమూ ఉండదు. ఇది వలస పాలనలో కనిపించే సహకరణ (co-optation) విధానమే. ఇప్పుడు సమయం వచ్చింది—బహుజన సమాజం తనను తాను తిరిగి నిర్వచించుకోవాలి. విలువలను, లక్ష్యాలను స్థాపించి, వాటి చుట్టూ ఏకీకృతంగా నిలబడాలి.

"రాజకీయ - ఆర్థిక - సామాజిక వ్యవస్థలో తన స్థానం సుస్థిరం చేసుకోవడానికి వ్యవస్థలోని అనేక విలువలను తిరిగి నిర్వచించేందుకు భారత సమాజంలోని బహుజనులు పోరాడాలి" —

ఎందుకంటే కుల ఆధిపత్య సమాజం శతాబ్దాలుగా బహుజనులను రాజకీయాల్లో పాల్గొనడం నుండి ఉద్దేశపూర్వకంగా, వ్యవస్థబద్ధంగా దూరం చేసింది. బహుజనులను హక్కులు లేనివారిగా చేసి తద్వారా వారి శ్రమను, భూమిని దోచుకోవడాన్ని సమర్థించుకున్నట్లే, బహుజన ప్రజలను తప్పుగా నిర్వచించడం ద్వారా వారి మీద కొనసాగుతున్న అణచివేతను న్యాయబద్ధం చేస్తుంది. వారిలో కొందరు బహుజన శబ్దానికి రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రాసంగికతలేదని అంటున్నారు.

రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించాలంటే ముందుగా బహుజనుల్ని బహుజనులే సరిగ్గా నిర్వచించుకోవాలి. బహుజన చరిత్రను, బహుజను గుర్తింపును తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ఇది బహుజనుల ప్రాథమిక అవసరం.

నేడు హిందుత్వం, హిందూ సాంస్కృతిక జాతీయవాదం అని పిలవబడుతూ బహుజనులపై దోపిడీకి తెగబడింది. కాబట్టి బహుజనుల్ని బహుజనులే సరిగ్గా నిర్వచించుకునే పదాలను సృష్టించుకోవాలి. సమాజంతో బహుజనుల సంబంధాన్ని కూడా ఆ మాటల్లోనే నిర్వచించాలి; ఆ పదాలకు గుర్తింపు దక్కేలా చూడాలి. ఇది అభివృద్ధిని కోరుకొనే ప్రజల తొలి అవసరం; అలాగే ప్రతి పీడకుడు తొలుత నిరాకరించే అంశం.

రాజకీయ శక్తిని 'మనుషుల మనసులపై మానసిక నియంత్రణ'గా నిర్వచించవచ్చు. ఈ నియంత్రణలో అగ్రకులాలు తమ నిర్వచనాలను, తమ చరిత్ర వివరణలను, అణగారినవారు అంగీకరించేలా ప్రయత్నం చేస్తున్నాయి.

సమాజాన్ని నిర్వచించే హక్కు ఎవరిది? అధికారంలో ఉన్నవారిదా? లేక బాధను అనుభవించినవారిదా?

భారత రాజకీయాల విస్తార ప్రాంగణంలో "దళిత్" అనే పదం వేర్వేరు సిద్ధాంతాల చేతుల్లో వేర్వేరు స్వరూపాలు దాల్చుతుంది. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆలోచనల ప్రభావంలో పెరిగిన అంబేద్కరైట్ దృష్టిలో, "దళిత్" అనేది అణచివేత చరిత్రను గుర్తు చేస్తూ స్వీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన పదం; దీనిని వదిలేయడం అంటే పోరాటపు జ్ఞాపకాన్ని మసకబార్చడమే. ప్రధాన రాజకీయ ప్రవాహంలో ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ సమతౌల్యాన్ని పాటిస్తూ, అధికారికంగా షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని ఉపయోగించినా, సామాజిక సంభాషణలో "దళిత్" అనే పదాన్ని

పూర్తిగా నిరాకరించ లేదు. వామపక్ష సిద్ధాంతంలో "దళిత్" అనేది కేవలం కులానికే పరిమితం కాదు; అది ఆర్థిక దోపిడీని ప్రతిబింబించే వర్గ సమస్యగా కూడా భావించబడుతుంది. మరోవైపు బహుజన సమాజ్ పార్టీ వంటి దళిత ఆధారిత రాజకీయ పార్టీ ఈ పదాన్ని గౌరవం, ప్రతినిధిత్వం, అధికార సాధనకు శక్తివంతమైన ఆయుధంగా భావిస్తుంది.

ఇక హిందుత్వ అజెండాను మోసే భారతీయ జనతా పార్టీ వంటి మతతత్వ పార్టీ, కుల ఆధిపత్య అధికార నిర్మాణం "దళిత్" అనే పదం విభజనకు దారితీస్తుందని భావిస్తుంది. ఈ విధంగా, "దళిత్"అనే పదం చుట్టూ తిరిగే చర్చ చివరికి గంభీరమైన ప్రశ్నను విస్తృత సమాజం ముందు ఉంచింది.

గాంధీజీ కృషి, హరిజన నిర్వచనం దళితులకు కొంత ఉపశమనాన్ని ఇచ్చినా దళితులూ ఆ నిర్వచనాన్ని సొంతం చేసుకోలేదు. దీన్నిబట్టి —ఒక సమాజాన్ని నిర్వచించే హక్కు అధికారంలో ఉన్నవారిదా, లేక సంస్కరణలను ప్రతిపాదించే వారిదా? లేక కులవ్యవస్థ అనుభవాలను భరిస్తూ వచ్చిన ప్రజలదా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది.

బహుజన గుంపును కూడా పూలే, అంబేద్కర్, కాన్షీ రామ్ నిర్వచించారు. ఆ నిర్వచనం ప్రకారం బహుజన సమూహం 'గతపు బాధను మోస్తూ, భవిష్యత్తు గౌరవాన్ని, జనాభా ప్రాతిపదికన రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయాన్ని కోరుకునే జీవంతమైన సమూహం.' నిర్వచించే హక్కు ఎవరిదైతే అవుతుందో, పరిస్థితిని నియంత్రించే అధికారం వారిదే.

స్వీయాధిక్యాన్ని పెంచుకోవటమే సామ్రాజ్యాల మౌలిక లక్ష్యం కనుక, తమను అణగదొక్కి కొనసాగిస్తున్న దోపిడికి వ్యతిరేకంగా సామంత దేశాలు వాటిపై తిరుగుబాటు జరపటానికి అవి అవకాశం కలిగించాయి. అదే మూసలో స్వీయాధిక్యాన్ని పెంచుకోవటమే అగ్రకులాల లక్ష్యం కనుక, తమను అణగదొక్కి కొనసాగిస్తున్న దోపిడికి వ్యతిరేకంగా బహుజన సమూహం వాటిపై తిరుగుబాటు జరపటానికి అవి అవకాశం కలిగించాయి.

హిందుత్వం 'హిందువుగా జీవించు, హిందువునని గర్వించు' అనే నినాదంతో దళిత, గిరిజన, వెనుకబడిన కులాలను ప్రేరేపించడం తమను తాము తప్పగా నిర్వచించుకొనేలా చేసే ప్రయత్నమే. అగ్రకులావారికి అది సరైన నినాదమే. మార్క్స్, ఏంగిల్స్ నిర్వచనం "మతం ఒక మత్తు మందు" అనేది హిందూ మతానికి వర్తించదు. హిందూ మతం అగ్రకులాలకు మాత్రమే మత్తునిచ్చే

మధువు, వెనుకబడిన కులాలకు 'చేదు చిరక', దళిత గిరిజనులకు 'విషం.' బహుజనులు ఏ సమూహాన్ని పరిశీలించినా వారికీ స్పష్టమైన రుజువులు దొరుకుతాయి. ఆ కారణం చేత దళిత, గిరిజనులు ఆ విషాన్ని కక్కి, క్రైస్తవ మతం తీసుకొన్నారు, వెనుకబడిన కులాల వారు కొందరు ఇస్లాం మతం తీసుకొన్నారు, నేటికీ కొందరు పంటి బిగువున ఆ చేదు మింగుతున్నారు. అగ్రకులాలు మత్తులో తూగుతున్నారు. మనుస్మృతి మధువు కషాయం విషం అనవచ్చు. అగ్రకులాల వారు క్రైస్తవులుగా, ముస్లీములుగా మారడానికి కారణాలు ఆధ్యాత్మికమైనవి. వారు సామాజికిక అణచివేత కారణముగా మతం మారలేదు.

# 6. బహుజన చైతన్యం

మన దేశంలోని బహుజనులు ప్రజలు కఠినమైన ప్రశ్నలను లేవనెత్తాలి—కుల ఆధిపత్య సమాజ యొక్క స్వభావాన్నే సవాలు చేసే ప్రశ్నలను లేవనెత్తాలి, దాని పాతకాలపు విలువలను, నమ్మకాలను, పోకడలను అన్నింటినీ ప్రశ్నించాలి. శతాబ్దాలుగా కొనసాగిన కులపరమైన అణచివేతను ప్రశ్నించాలి. ఎందుచేత విద్యకు, గౌరవానికి, ఆస్తి హక్కుకు, మందిర ప్రవేశానికి, స్వర్గానికి, నాయకత్వానికి దూరం చేశారో ప్రశ్నించాలి. కుల ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి వేల ఏళ్లుగా తిమ్మిని బొమ్మి చేస్తూ, ప్రస్తుతంలో కూడా అటువంటి గారడీ మాటలనే ప్రయోగిస్తూ ఇంకా ఎన్నేళ్లు ఆధిపత్యం కొనసాగిస్తారో బహుజనులు ప్రశ్నించాలి.

బహుజనులు నిర్వచనంలో 'అగ్రకులాలకు నిరంతరంగా, చవకగా శ్రమ సరఫరా చేసేందుకు, సేవలు చేసేందుకు పుక్కిట పురాణాల సహాయంతో అగ్రకులాలు తమ ఆధీనంలోకి తెచ్చు కొన్న సమూహం.' బహుజనులు తమ చరిత్రను తెలుసుకోవడం, తమ మూలాలను గుర్తించడం, తమ సాంస్కృతిక వారసత్వంపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరం. బహుజనులు తమను శక్తివంతమైన, ధైర్యవంతమైన గుంపుగా తెలుసుకోవాలంటే, తమ మూలాలను తెలుసుకోవాలి.

ఈ దేశంలో అంతంత మాత్రంగానే ఉన్న లిఖించబడిన లేదా గ్రంధస్తం చేయబడిన చరిత్రలో బహుజనులకు ఎలాంటి ప్రాధాన్యతా లేదు. ఉన్న కాస్త చరిత్రనూ ప్రస్తుత హిందుత్వం వక్రీకరిస్తోంది. అగ్రకులాలు చాలా కాలంగా బహుజనులతో "మీకు సంస్కృతి లేదు, మీకు స్పష్టమైన చరిత్ర లేదు" అని చెప్పతూ వస్తున్నాయి. 'చరిత్ర హీనులు' అనే మాట ఆ రకంగా ఉత్పన్నమైనదే. హిందూ మత అధీన రాచరిక చరిత్ర గ్రంధస్తం చేయబడక మునుపే, వ్యవస్థీకృతమై ఉన్న తమ సంస్కృతిని, చరిత్రను అగ్రకులాలు బలవంతంగా అణచి వేశాయని, దేశంలోని పురాణాల్లో కాస్త కనబడినా, సాధారణ చరిత్ర పుస్తకాలలో ఉద్దేశ్యపూర్వకముగా లిఖించబడని చరిత్ర తమకున్నదని, ఉత్పత్తికి మూలమైన బహుజనులు గుర్తించాలి. బహుజనులు సమూహ భావనను, తమ స్వరూపాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నప్పుడే, ఈ దేశంలోని కులవివక్షతను, సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనగలరు. దీనిని 'బహుజన చైతన్యం' అని పిలుస్తాము; ఇదే అత్యంత కీలకమైన మొదటి అడుగు.

బహుజనులు ముఖ్యంగా "రాజకీయ ఆధునికీకరణ" అనే ప్రక్రియగుండా ప్రయాణించాలి — సమాజపు కుల వివక్షత నుండి విముక్తి పొందాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరిగా జరగాలి. "రాజకీయ ఆధునికీకరణ"అనేది అనేక అంశాలను కలిగి ఉన్నా, ఇందులో మూడు ప్రధాన భావనలు ఉన్నాయి: (1) సమాజంలోని పాత విలువలను, కట్టుబాట్లను ప్రశ్నించడం; (2) రాజకీయ మరియు ఆర్థిక సమస్యలకు పరిష్కారంగా కొత్త, భిన్నమైన రాజకీయ నిర్మాణాలను అన్వేషించడం; (3) నిర్ణయ ప్రక్రియలో ఎక్కువ మంది పాల్గొనేలా ప్రక్రియను విస్తరించడం.

రాజకీయ ఆధునికీకరణ పోరాటమే బహుజనుల భవిష్యత్ తరాల జీవితాలకు అర్థాన్ని ఇస్తుంది; అది బహుజన విశ్వాసాలను పరీక్షిస్తుంది, వ్యవస్థలపై కొత్త ప్రశ్నలు వేయడానికి మనకు బలాన్ని ఇస్తుంది.

ఈ సమాజపు విలువలు కులవివక్షకు మద్దతు ఇస్తున్నప్పుడు, ఆ విలువలను బహుజనులు స్వీకరించాలని అధికారం చెలాయించడం మానవవాద విలువలకు విరుద్ధం. ఆ విలువలను కొందరు బహుజనులు స్వీకరించడం మొత్తం బహుజన సమూహాన్ని మోసం చేయడం. కుల ఆధిపత్య అధికార నిర్మాణానికి ప్రాథమిక పునాది అయిన కులవ్యవస్థను సనాతన ధర్మం పేరున తప్పనిసరిగా కాపాడాలి అనే భావనను బహుజనులు నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. బహుజనుల లక్ష్యం కేవలం మధ్యతరగతిలో కలిసిపోవడం కాదు; ఎందుకంటే మెజారిటీ మధ్య తరగతి, మానవత్వం పట్ల సజీవమైన నైతికతను కోల్పోయింది అనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఆ తరగతి విలువలు మానవ వికాసం కంటే భౌతిక సంపద పెంపుపై మొగ్గు చూపుతున్నాయి. ఈ తరగతి మంచి విద్య, మంచి ఆరోగ్యం, నిజాయితీ గల ప్రభుత్వం, జీవన ప్రమాణాల పెంపు, ఉద్యోగ అవకాశాలు, అభివృద్ధి అవకాశాలకు మద్దతు ఇస్తుందని చెబుతారు. కానీ ఇదే తరగతి కులం విషయంలో తాము మిగతావారికంటే కాస్త ప్రత్యేక స్థానంలో ఉన్నామనే భావనను ప్రదర్శిస్తుంది. మతం విషయంలోనూ తాము ఉన్నత స్థానంలో ఉన్నామనే భావననూ ప్రదర్శిస్తుంది. బహుజనులలో భాగమైన మైనారిటీల విషయంలో కనబడని వేర్పాటు భావనను ప్రదర్శిస్తుంది ఈ తరగతి. ఈ తరగతి, ఈ దేశంలో సంస్థాగత కులవివక్షకు పునాదిగా నిలుస్తుంది. దీనితో ఈ తరగతి తీరు ఒకవైపు 'మంచి ప్రభుత్వాన్ని మంచి నాయకత్వాన్ని' కోరుకుంటూ,

మరోవైపు బహుజన సమాజాన్ని దోచుకుని, సంపద కొన్ని అగ్రకులాలు లేదా పాలక కులాలు పంచుకోవడాన్ని సమర్థించినట్టు అవుతుంది.

అందుకే కొందరు బహుజనుల మధ్యతరగతిలో కలిసిపోవడం అనే లక్ష్యాన్ని విస్తృత బహుజన సమాజం సూక్ష్మంగా పరిశీలించాలి —మెజారిటీ మధ్య తరగతి విలువలు మానవత్వానికి విరుద్ధం. గతంలో బహుజన ఉద్యమం ఈ విలువలను సవాలు చేయలేదు; దాని అసలు స్వరూపాన్ని పూర్తిగా గ్రహించకుండానే వాటిని అంగీకరించింది. ఇప్పుడు దాని పునర్నిర్వచనం అవసరం.

పేదరికం, గౌరవంలేని స్థితి, అణచివేతలను ప్రభుత్వ లేదా రాజకీయ పార్టీల అలసత్వంగా కాకుండా, కుల ఆధిపత్య అధికార నిర్మాణం ఉద్దేశపూర్వకంగా కొనసాగిస్తున్న ప్రణాళికగా, బహుజన సమాజానికి అవమానంగా చూడాలి. 'స్వేచ్ఛా వ్యాపారం'గురించి సందేశాలు ఇచ్చేవారికి 'స్వేచ్ఛా మనుషుల' ఆధారంగా సమాజాన్ని నిర్మించాలనే ప్రతి సందేశాన్ని ఇవ్వాలి. ఇదే నిజమైన ఆధునికీకరణ—నిజంగా నాగరికత వైపు అడుగు.

పాత విలువలకు మద్దతు ఇస్తున్న పాత రాజకీయ, ఆర్థిక, కుల నిర్మాణాలు మారితీరాలి. ఇక్కడ 'వ్యవస్థ మరియు 'నిర్మాణాల'మధ్య తేడాను గుర్తించాలి. 'వ్యవస్థ' అంటే సమాజపు మొత్తం విలువలు, విశ్వాసాలు, సంస్థల సమాహారం; 'నిర్మాణాలు' అంటే ఆ వ్యవస్థను నడిపే ప్రత్యేక సంస్థలు—పార్టీలు, సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగాలు. మనకు చక్కని రాజ్యాంగం ఉంది. మొత్తం వ్యవస్థే చెల్లనిదైతే, అవే నిర్మాణాలతో దానిని మార్చడం సాధ్యం కాదు. లోపించిందెల్లా ఆధునీకరణలో బహుజన సమాజం యోజనాబద్ధంగా, స్థిరంగా ఆలోచించలేకపోవడం.

మరో విషయం ఏమిటంటే ఈ దేశంలోని రాజకీయ పార్టీలకు ప్రజల నిజమైన అవసరాలను—ప్రత్యేకంగా బహుజనుల అవసరాలను—గుర్తించి వాటికోసం నిర్ణయాలు చేయాలనే శ్రద్ధ మొదటి నుంచీ లేదు. భారతదేశంలో పార్టీ వ్యవస్థ, సాంకేతికంగా క్లిష్టమైన సామాజిక న్యాయ డిమాండ్ రూపుదిద్దుకొనే సమయంలోనే ఏర్పడింది. ఇప్పుడు జీవన విధానాలు మారిపోయాయి; సిద్ధాంతాలు ప్రభావం కోల్పోతున్నాయి. నాయకుల దృష్టి రూపాలపై కాదు, బహుజనులపై ఉండాలి. అవసరమైతే సమాంతర సమాజ సంస్థలు ఏర్పడాలి; విద్యా, వైద్య, రెవెన్యూ, మానవ వనరులపై, పరిశ్రమలు, లా అండ్ ఆర్డర్, న్యాయ వ్యవస్థలపై బహుజనుల

నియంత్రణ ఉండాలి. నిర్ణయాలు నిజంగా బహుజనుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకునే వ్యవస్థలు రావాలి.

రాజకీయ ఆధునికీకరణలో కీలకమైన అంశం—ప్రాతినిధ్య విస్తరణ. బహుజనులంతా రాజకీయంగా చైతన్యవంతులు కావాలి. చిన్న ప్రయోజనాల కోసం అవినీతి యంత్రాంగాలకు, పుక్కిట పురాణాలకు తలవంచకుండా, ప్రజలు తమ బహుజన వాదాన్ని బలోపేతం చేసుకొని జవాబుదారీతనంతో వ్యవహరించాలి.

రాజకీయ చైతన్యం విస్తరించేకొద్దీ, బహుజనులు తమకు జరుగుతున్న అన్యాయాలను మరింత స్పష్టంగా గుర్తిస్తారు. కుల ఆధిపత్య సమాజం సంపన్నమవుతుంటే, తమ సమాజం వెనుకబడుతున్నదని వారు గ్రహిస్తారు. ఈ అవగాహన రాజకీయ చర్యకు దారి తీస్తుంది. విలువలు, సంస్థలు తమకు వ్యతిరేకంగా ఉన్నాయని గుర్తించినప్పుడు, వారు మొత్తం వ్యవస్థను ప్రశ్నించడం ప్రారంభిస్తారు. దీనితో రాజకీయ ఆధునికీకరణ ప్రారంభం అవుతుంది. రాజకీయ ఆధునికీకరణ ఇప్పటికే ప్రారంభమై బలహీనంగా ముందుకు సాగుతుంది. దీనిని ప్రాతినిధ్య విస్తరణ ద్వారా బలోపేతం చేయాల్సిన భాద్యత ప్రతి బహుజనునిపై ఉంది.

బహుజన రాజ్యాధికార భావన ఈ దేశంలోని బహుజనులు ఐక్యంగా నిలబడాలని, తమ వారసత్వాన్ని గుర్తించుకోవాలని, సమాజ, సమూహ భావనను నిర్మించుకోవాలని పిలుపునిస్తుంది. తమ లక్ష్యాలను తామే నిర్వచించుకోవాలని, తమ సంస్థలను తామే నడిపించాలని, ఈ భావనను బహుజనులంతా న్యాయ సాధనలో క్రియాశీల ప్రక్రియగా గుర్తించి సొంతం చేసుకోవాలని సూచిస్తుంది. అలాగే రాజకీయ ఆధునీకరణలో భాగంగా సమాజంలోని కుల ఆధిపత్య సంస్థలను, విలువలను తిరస్కరించాలని పిలుపునిస్తుంది. ఈ పిలుపుకు సిద్ధాంతానికి లోబడని బహుజనులు తమ గొయ్యి తామే తవ్వుకొంటునట్లు బహుజన సిద్ధాంతం ప్రకటిస్తుంది.

“బహుజన రాజ్యాధికార”భావన ఒక మౌలిక సూత్రంపై ఆధారపడింది: విస్తృత సమూహ సమాజంలో అధికారంలోనికి ప్రవేశించాలంటే ముందుగా తమలో తాము ఐక్యత సాధించాలి. అంటే, బహుళసాంస్కృతిక సమాజంలో మొదట బలమైన చర్చ జరగాలి ఆ స్థితి నుండి సమర్థవంతంగా పనిచేయాలంటే సమూహ ఐక్యత ఏర్పడాలి. సంప్రదాయంగా, ఈ సమాజంలో

ప్రతీ కులసమూహం తమ అవసరాలను ప్రాతినిధ్యం చేయడానికి స్వంత కులసంస్థలను నిర్మించుకోవడం ద్వారా సామాజిక, రాజకీయ స్థిరత్వాన్ని పొందుతున్నామని భావిస్తున్నాయి. కుల ఆధిపత్య అధికార నిర్మాణం కూడా వారితోనే చర్చలు జరుపుతుంది, కార్పొరేట్ మౌత్ పీస్ మీడియా కూడా వారి మాటలకే ప్రాధాన్యం పెరిగేలా చేస్తుంది. ఇది బహుజన ఐక్యతను దెబ్బతీసే కుట్రలో భాగమే. సొంత కుల సంఘాల, కుల పార్టీల నిర్మాణం లేదా ఆలోచన బహుజన ఐక్యతా భావానికి గొడ్డలిపెట్టు. బహుజనుల ఓటింగ్ ప్రవర్తనపై జరిగిన అధ్యయనాలు కులాధారిత ఓటింగులో బహుజనులు అధికముగా పాల్గొంటున్నారని చెపుతున్నాయి —రహస్యంగా వేసే ఓటులోనే, రహస్యంగానే కులానికి లేదా కుల పార్టీకి ఓట్లు వేయడం కులతత్వాన్ని సమర్థించడం. మరో ఐదేళ్లపాటు కుల ఆధిపత్య అధికార నిర్మాణాన్ని కదల్చకుండా ఉంచేందుకు ఒప్పందం. ఇది అసహ్యంగా అనిపించినా భారత రాజకీయ వ్యవస్థలో ఇది ప్రధాన వాస్తవం. కుల సంఘాలు, పార్టీలు సహకారం కంటే విభేదాల దృష్టితో తమ ప్రయోజనాలను చూస్తాయి. అవి సహకరించుకొన్న సందర్భాలు ఉన్నా అవన్నీ కలిసి ప్రోత్సహించేది పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద వ్యవస్థనే.

దేశంలోని బహుజనులు స్వచ్ఛమైన తమ బహుజన మూలాలను ఎంతగా అనుసంధానించుకుంటారో, అంతగా వారు రాజకీయంగా ప్రభావవంతంగా మారగలరు. బహుజన మూలాలు కుల మూలాల కంటే శక్తి గలవి, అగ్రకులాల చేతినుండి అధికారాన్ని కైవసం చేసుకోగల శక్తి గలవి. సమాజంలోని వర్గాలు తమ కులాలను గుర్తుచేసుకొని, వాటిని రాజకీయ రంగంలో సమర్థవంతంగా నిలబెట్టడానికి ఓటును వినియోగించడం, కుల ఆధిపత్య పార్టీల్లో తమ కులానికి చెందిన అభ్యర్థిని గెలిపించడం కూడా బహుజన భావజాలానికి గొడ్డలిపెట్టు. నేటికీ, బహుజన మిత్రులు తెలియకుండానే కుల ఆధిపత్య అధికారాన్ని బలపరిచిన సందర్భాలు అధికం.

బహుజనులు తమ సంస్థలను తామే నడిపించాలి. బహుజనులు తమకు సాధ్యమని చెప్పే విప్లవాత్మక ఆలోచనలను వారు మాత్రమే వ్యక్తపరచాలి. భూస్వామ్య కులాల ప్రతినిధులు బహుజన భావజాలం మాట్లాడితే వారిని అభినందించాలి. నాయకత్వం మాత్రం బహుజనులు తీసుకోవాలి. సమాజంలో నిరంతర బహుజన అవగాహనను సృష్టించాలి, అది బహుజన రాజకీయ బలానికి

పునాది. కాబట్టి, బహుజనులు కలసికట్టుగా తమ కోసం తామే పని చేయాలి. తమ లక్ష్యాలను చేరుకోవడానికి స్వీయగుర్తింపు, స్వయంనిర్ణయం, ఐక్యత ఆవశ్యమని గుర్తించాలి.

బహుజన సమాజం అగ్రకులాలతో సమాన స్థాయిలో పోటీ పడగలిగేంత రాజకీయ, ఆర్థిక, వృత్తిపరమైన బలం మొదట సంపాదించడంపై దృష్టి కేంద్రీకరించాలి. అటు తర్వాత మాత్రమే కుల ఆధిపత్య అధికార నిర్మాణంతో సహకారం గురించి చర్చించాలి. కానీ నేటి రాజకీయాల్లో దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. బహుజన గుర్తింపుగల నాయకులూ సమూహ సంక్షేమం, అభివృద్ధి ప్రక్కన పెట్టి రాజకీయాల్లో మనుగడ కోసం కుల ఆధిపత్య రాజకీయ పార్టీలతో సహకారం గురించి చర్చిస్తున్నారు. కాబట్టి తరాల నుండి వెనుకబడి ఉన్న బహుజన రాజకీయకుటుంబాలు బహుజనవాదంలో నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవాలి, బహుజనులంతా ఐక్యమవ్వాలి.

సమగ్రత వైపు ప్రయాణంలో, బహుజన సమాజం మరింత స్వతంత్రతను అభివృద్ధి చేసుకోవాలి—తమ వ్యవహారాలను తామే నడిపించుకునే అవకాశం కలిగి ఉండాలి. "బహుజన రాజ్యాధికారం" అనేది సరైన ప్రతినిధిత్వం, అధికార భాగస్వామ్యాన్ని సూచిస్తుంది. ఇది సిద్ధాంత బలం నుంచి అణచివేతను ఎదుర్కొనే అధికార కేంద్రాలను నిర్మించడాన్ని సూచిస్తుంది.

కేవలం అధికారంలో బహుజన ముఖాలను పెట్టడం కాదు. కేవలం రాజకీయ తెరపై కనిపించడమే "బహుజన రాజ్యాధికారం" కాదు. నేటి అనేక బహుజన సమాజ గుర్తింపు గల రాజకీయ నాయకులు కూడా "బహుజన రాజ్యాధికారానికి ఉదాహరణలు కాదు. నిజమైన అధికారం సమాజం నుండే ఉద్భవించాలి. రాజకీయ నాయకులు కూడా అదే భావజాల మూలం నుంచి ముందుకు రావాలి. వారి ప్రయోజనాలను కోల్పోయే పరిస్థితి వచ్చినా వారు కుల ఆధిపత్య రాజకీయ యంత్రాంగాలకు ప్రతినిధులుగా ఉండటం మానుకోవాలి. అప్పుడే స్వచ్ఛమైన బహుజన అధికార నిర్మాణానికి గట్టి పునాది నిర్మితమవుతుంది.

కుల ఆధిపత్య అహంకారం అంటే కేవలం కులం ఆధారంగా మానవాళిని విభజించడం మాత్రమే కాదు; బహుజనులను అణచివేయడం లేదా అణచివేత కొనసాగించడం కూడా. కుల ఆధిపత్య అహంకారుల లక్ష్యం బహుజన ప్రజలను కింద స్థాయిలో ఉంచడమే—ఇది వేల సంవత్సరాలుగా కొనసాగుతోంది. బహుజనులు కులాల కుమ్ములాటల్లో భాగస్వామ్యులు

కావడం, సామాజిక న్యాయం అమలు చేయడానికి, సమాన అవకాశాలను సృష్టించడానికి కుల ఆధిపత్య అధికార నిర్మాణం విఫలమవడమే అసలు సమస్య.

'బహుజన వాదం' స్వీయ గుర్తింపు, స్వీయ నిర్ణయం, సామాజిక న్యాయం కొరకు ఇచ్చిన పిలుపును బహుజన ఆధిపత్యంగా అభివర్ణించరాదు. ఈ వాదం యొక్క లక్ష్యం స్వేచ్ఛాయుతమైన, స్థిరమైన, బహుజన సమాజ అభివృద్ధికి అనుకూలమైన—ధనాత్మకమైన సమాజం. ఇది భారత రాజకీయాల్లోని కుల ఆధారిత స్వరూపాన్ని, అలాగే అధికార కేంద్రిత స్వభావాన్ని గుర్తిస్తుంది.

# 7. నిర్వచనం, నిర్ణయం, గుర్తింపు

సమూహ ఐక్యత, గుర్తింపును బహుజనవాదం సమర్థిస్తున్నప్పటికీ, దాని అర్థం కుల ఆధిపత్య అధికార నిర్మాణం పొందిన ఫలితాలను అనుకరించడం కాదు. వ్యవస్థలపై గుత్తాధిపత్యం చెలాయించడం కాదు. బహుజనవాద లక్ష్యం ఇతరులపై ఆధిపత్యం చెలాయించడం లేదా ఇతరులను దోపిడీ చేయడం కాదు; సమాజంలోని మొత్తం అధికారంలో న్యాయబద్ధమైన వాటాను పొందడం. న్యాయబద్ధమైన వాటాలను అందరికీ పంచడం.

బహుజన స్వీయ నిర్ణయం, స్వీయ గుర్తింపు—అంటే బహుజన జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలలో పూర్తి నియంత్రణ బహుజనులే కలిగి ఉండటం. తమలోని విలువలచే గుర్తించబడటం. ఈ దేశంలోని బహుజనులు ఇతర కులాల, మతాల వారిపై మూక దాడులు చేయలేదు, వారి మసీదులలో, చర్చిలలో, గుడులలో బాంబులు పేల్చలేదు, ఆధిపత్యం కొనసాగించలేదు, చట్టాలను వక్రీకరించి అణచివేత కొనసాగించలేదు, వారిని అగౌరవ పరచలేదు, వారిని దిగువ శ్రేణి మనుషులుగా చూడలేదు. ఇవి కుల ఆధిపత్్య అహంకారులే చేస్తున్నారు. బహుజనులు అధికారాన్ని పొందలేక పోవటంతో వారి మనసాక్షి కలుషితమవుతోంది; న్యాయం అందని పరిస్థితిలో న్యాయం కొరకైన ఆవేదన అస్తవ్యస్తమైన ఆగ్రహంగా మారుతోంది. శక్తిలేమి ఆధారపడే సంస్కృతిని పెంచుతుంది. ఒకవైపు శక్తిలేని మనసాక్షి బహుజనులదైతే, మరోవైపు మనసాక్షిలేని శక్తి కుల ఆధిపత్య అధికార నిర్మాణపు లక్షణాలుగా కనిపిస్తున్నాయి —ఇవి దేశపు పునాదులకే ముప్పుగా మారనున్నాయి.

బహుజనులు వ్యక్తులుగా కాదు, సమూహంగా అణచివేయబడ్డారు. అధికారంలో పాలుపంచుకొనే సామర్థ్యం, అర్హత లేనివారిగా చిత్రీకరించబడ్డారు. — రాజకీయ, ఆర్థిక, సామాజిక శక్తి లేకుండా చేయబడ్డారు — అందుకే బహుజనవాదం ఏకీకరణకు, సమూహ ఉనికికి ప్రాధాన్యత ఇస్తుంది.

కుల ఆధిపత్య అధికార నిర్మాణం బహుజన పౌరులను వ్యక్తులుగా అవకాశాల కోసం పోరాడమని అంటుంది; మాతో పోటీ పడమంటుంది. కానీ అవకాశాలు బహుజన సమూహానికి అవసరమయ్యాయి—కొంతమంది బహుజనులకు కాదు. అందుకు, బహుజనులు తమ చుట్టూ తాము ఏకీకృతమై, బలమైన స్థితిలో అధికారాన్ని చేపట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

ఏ సమూహమూ తమను ఇతరులు నడిపించడాన్ని అంగీకరించదు. బహుజన సమాజం 75 సంవత్సరాలు రహస్య ఓటు ద్వారా తమను నడిపించడానికి కుల ఆధిపత్య అధికార నిర్మాణానికి మాండేట్ ఇచ్చింది. గడిచిన 30 ఏళ్లుగా బహుజన అధికారం, సామాజిక న్యాయం అంశాలపై చర్చ జరుగుతున్నా పాలక కులాలలో పెద్దగా మార్పు రాలేదు. కుల ఆధిపత్య అధికార నిర్మాణం బహుజనులు తమ విషయాలను తామే చూసుకోవాలని భావించడం లేదు. అందుకు ఒప్పుకోవడం లేదు —స్టేటస్ కో కొనసాగడమే కుల ఆధిపత్య అధికార నిర్మాణానికి కావలసింది. అందుకు వారు కులాలను ఎగదోస్తారు. కులాల కుమ్ములాటలు సృష్టిస్తారు. కుల ఆధిపత్య అధికార నిర్మాణం జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం ఉండాలన్నా, నిర్ణయాలు చేయాలన్నా, వాటిని అమలు చేయడంలో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలన్నా భయపడుతుంది, వెనుకడుగు వేస్తుంది. తాము చూపుతున్న అణచివేత, అహంకార ధోరణి బహుజనులు తమ పట్ల తిరిగి చుపిస్తారేమో అనే భయం దీనికి కారణం కావచ్చు.

బహుజనులు చెబుతున్నది ఒక్కటే— ప్రాతినిధ్యంలో ప్రస్తుత పరిస్థితి అమానవీయం, అన్యాయం. నిజమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కోసం కృషి చేయడం తప్ప బహుజనులకు నిజమైన ప్రత్యామ్నాయం లేదు. బహుజనులు సమూహ శక్తి పెరుగుదల కోసం ప్రత్యేకంగా కృషి జరగాలి అనేది సుస్పష్టం. ప్రేమ సూత్రంగా బహుజన అధికారం సాధించబడితే అది కుల అహంకార రహితంగా ఉంటుందనేది బహుజన వాద ధర్మం.

సామాజిక మార్పులు ఎప్పుడూ ఊహించని ఫలితాలను తీసుకువస్తాయి. కాన్షిరామ్ స్థాపించిన బహుజన సమాజ్ ద్వారా బహుజన సమాజానికి స్పష్టమైన దిశను చూపించారు; ఆయన నినాదాలు కేవలం మాటలు కాదు, శతాబ్దాలుగా అణగారిన వర్గాల మనసులో దాగి ఉన్న ఆకాంక్షలకు రూపం. "Jisaki Jitni Sankhya Bhari, Usaki Utani Hissedari" అనే నినాదం ద్వారా జనాభాలో ఎంతమంది ఉంటే, అధికారంలో అంత భాగస్వామ్యం ఉండాలని ఆయన సమానత్వ సూత్రాన్ని ప్రతిపాదించారు. అదే విధంగా "Vote Hamara, Raj Tumhara, Nahi Chalega, Nahi Chalega" అనే పిలుపు ద్వారా ప్రజాస్వామ్యంలో ఓటు బహుజనులదైతే, పాలన కూడా వారి చేతుల్లోనే ఉండాలని గట్టిగా ప్రకటించారు. ఈ నినాదాలు SC, ST, OBC వర్గాలను ఒక రాజకీయ శక్తిగా ఏకీకృతం చేసి, సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత,

సముచిత ప్రాతినిధ్యం కోసం పోరాడే దిశగా నడిపించాయి; అవి బహుజనుల ఆత్మగౌరవాన్ని మేల్కొలిపి, సంఖ్యా శక్తిని అధికారంగా మార్చే మార్గాన్ని చూపించాయి. కుల ఆధిపత్య ప్రతిచర్య, భయం, కూటములు అనే పదాలను పక్కన పెట్టి ముందుకు కదిలిన విప్లవం అది. ప్రగతి, అహింస, సమగ్రత ఆయుదాలుగా జరిగిన పోరాటం అది. తిరిగి ఆ నినాదాలు ఊపందుకోవాలి. తిరిగి బహుజనములంతా సమీకరించబడాలి.

మేము న్యాయమైన డిమాండ్లనే చేస్తున్నాము. మరి మమ్మల్ని ఎందుకు అణచివేస్తున్నారు? ఎంతకాలం మీ వాటాకు మించి అవకాశాలు పొందుతారు? మేము అడిగిన జనాభా ప్రాధిపదికన ప్రాతినిధ్యం ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించడం మానుకోనాలి. కాన్షిరాం స్ఫూర్తితో "Jisaki Jitni Sankhya Bhari, Usaki Utani Hissedari" అనే నినాదం ద్వారా జనాభాలో ఎంతమంది ఉంటే, అధికారంలో అంత భాగస్వామ్యం ఉండాలి అంటూ నినదించాలి. "Vote Hamara, Raj Tumhara, Nahi Chalega, Nahi Chalega" ఓటు బహుజనులదైతే, పాలన కూడా వారి చేతుల్లోనే ఉండాలని గర్జించాలి. 'జిత్నా ఆబాది ఉత్నా హాక్' అని నినదించాలి.

ఈ దేశపు రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థల స్వభావమే బహుజనులపై సంస్థాగత అణచివేతను మోపుతుంది. స్వతంత్ర ఉద్యమ కాలంలో "అహింస" అనే మాట ముఖ్యమైన నినాదంగా నిలిచింది. అప్పటికి రాజ్యాంగం లేదు, వ్యవస్థ మొత్తం బ్రిటీషు వారి చేతుల్లో ఉంది. ఇప్పుడు సమాన హక్కులను, రాజకీయ ఆర్థిక సామాజిక న్యాయాన్ని వాగ్దానం చేస్తున్న రాజ్యాంగం ఉంది.

బహుజన ఉద్యమంలో అహింస స్థానాన్ని సూక్ష్మముగా పరిశీలిస్తే, బలహీనులు చేసే ఉద్యమాల్లో అహింస ఒక టాక్టిక్. స్వతంత్ర ఉద్యమంలోలా తలవంచి కొట్టించుకుంటే శక్తి వస్తుందని నేర్పించారు. అది రెండు వర్గాల శక్తి సామర్థ్యాలు, మతాలు బోధించే నైతిక విలువలు సమానం కానప్పుడు కొంతవరకూ నిజమే. సార్వభౌమ దేశంలో రెండు వర్గాల పౌరస్థితి సమానమైనప్పుడు, శక్తి సామర్థ్యాలు అసమానమైనప్పుడు, రాజ్యాంగం ద్వారా ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం వాగ్దానం చేయబడినప్పుడు, అహింస బహుజనులను నైతికంగా ఉన్నతంగా నిలబెడుతుంది. బహుజన భౌతిక పోరాటంలో అహింస సూత్రంకాదు, ఆయుధం మాత్రమే.

కానీ రాజకీయంగా ఓటు ద్వారా 'Agar tum mujhe mitaane aaoge, to main tumhe mita doonga.'"నన్ను నాశనం చేయాలని వస్తే, నువ్వు కూడా అదే ప్రమాదాన్ని ఎదుర్కోవాలి" అనే స్పష్టమైన సందేశం వేగంగా ప్రతిఘటనను కలిగిస్తుంది. చట్టం అమలు, వ్యవస్థలు ప్రజలను రక్షించలేకపోతే, ప్రజలే తమను తాము ఓటుద్వారా రక్షించుకోవాలి. దేశం తన పౌరులను రక్షించడంలో విఫలమైతే, వారు తమ రక్షణ కోసం ఆయుధం ఎత్తుకోవడాన్ని ఎవరూ తప్పు పట్టలేరు. కాబట్టి ఇప్పుడు బహుజనులు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం కోసం ఐక్యత అనే మంత్రాన్ని, ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించాలి.

బహుజనులు తమపై ఇంతకాలం జరుగుతున్న అన్యాయం, అణచివేతలను ఎదుర్కోవాలంటే పోరాటమే మార్గమని అర్థం చేసుకున్నారు. 'జిత్నా ఆబాది ఉత్నా హక్' నినాదం కొంతమంది అగ్రకులాల వారిని భయపెట్టింది, ఎందుకంటే ఆ ఆలోచన తర్వాత బహుజనులు ప్రతిఘటిస్తారని వారికి తెలుసు.

విషయం స్పష్టం—సామాజిక న్యాయం లేకుండా సామాజిక వ్యవస్థ నిలవదు. ఇక కుల ఆధిపత్య వర్గాలు బహుజనులతో ఆటలు ఆడటం ఆపాలి; లేకపోతే బహుజనులు ప్రతిఘటిస్తారు. దేశవ్యాప్త ప్రతిఘటన అత్యంత చేరువలో ఉంది.

ఇప్పుడు "ఇంటిగ్రేషన్" అనే భావనను సూక్ష్మంగా పరిశీలిద్దాము. ఈ ఆలోచన ప్రకారం, బహుజనులను అధికార వ్యవస్థలో, సంస్థలలో కలపడం ద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. కానీ ఈ ఆలోచన వెనుక ఉన్న అసలు భావన ఏమిటంటే—బహుజన సమాజంలో విలువైనది ఏమీ లేదు, వారు ఏదీ సృష్టించలేరు. అందుకే "అర్హులైన' కొంతమందిని మధ్యతరగతి సమాజంలోనికి తీసుకెళ్లడం జరుగుతోంది అని తన విధానాల ద్వారా అంటుంది కుల ఆధిపత్య అధికార నిర్మాణం.

ఈ విధానం వల్ల కొంతమంది బహుజనులు ఎదుగుతారు, కానీ ఈ విధానం బహుజన సమాజం నుంచి నాయకత్వాన్ని, ప్రతిభను తొలగిస్తుంది. ఈ విధంగా "ప్రతీకాత్మకంగా"మధ్యతరగతిలో కలసిపోయిన బహుజనులు నయా ఆధిపత్య కులస్తులుగా మారిపోయి కుల వివక్షతకు కేరాఫ్ అడ్రెస్సులుగా మారుతున్నారు, వీరు పేద బహుజనులకు గాని,

మధ్యతరగతి బహుజనులకు గాని ఉపయోగపడరు. వీరు కేవలం ఆధిపత్య కులాల మనస్సాక్షిని సాంత్వనపరిచే ప్రదర్శన వస్తువులుగా మారిపోతున్నారు.

ఇలాంటి వారు బహుజనులను "వ్యక్తులుగా మాత్రమే చూడబడాలని, సమూహంగా కాదు" అని అంటారు; "బహుజన సమూహం గురించి ఆలోచించకూడదు"అంటారు. ఇది పూర్తిగా అవాస్తవమైన భావన. ఎందుకంటే బహుజనులు వ్యక్తులుగా కాకుండా సమూహంగా బాధను అనుభవించారు. కాబట్టి వారి విముక్తి కూడా సమూహ చర్యల ద్వారానే సాధ్యమవుతుంది. ఇదే కారణంగా బహుజన అధికార భావన వ్యక్తిగత పరిష్కారాలు సమాజ సమస్యలను పరిష్కరించలేవని చెబుతుంది.

ఈ సమాజంలో బహుజనుడు "కేవలం మనిషిగా" జీవించలేడు. అతని గుర్తింపు ఎప్పుడూ అతనితోనే ఉంటుంది. ఈ తరం లేదా తదుపరి తరంలో గురింపు ప్రభావం తొలగిపోదు. దీన్ని అర్థం చేసుకొని పోరాడటం వేర్పాటువాదం కాదు—అది ఒక ముఖ్యమైన పోరాటంలో ముందంజలో ఉండటమే. ఈరోజు తీవ్ర పోరాటం లేకపోతే రేపు అర్థవంతమైన ఫలితాలు రావు అని బహుజన సమాజం గుర్తిస్తుంది.

'ఇంటిగ్రేషన్' అనే లక్ష్యం బహుజన సమస్యను వాస్తవానికి దూరంగా మాత్రమే కాకుండా, తక్కువగా చూపించే విధంగా రూపొందించబడినది. మంచి ఇల్లు, విద్య, ఉద్యోగం లేదా రక్షణ లేదా అధికారం పొందాలంటే, బహుజనులు కుల ఆధిపత్య అధికార నిర్మాణ దయ పొందాలి, వారి ఆధిపత్యాన్ని అంగీకరించాలి అనే భావనను ఇది బలపరుస్తుంది. దీని వల్ల "అగ్రకులాలు" స్వయంచాలకంగా ఉన్నతమైనవని, "బహుజనులు" తక్కువవారనే భావన బలపడుతుంది. అందుచేత ఇంటిగ్రేషన్ అనేది కుల ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఉపయోగించే పద్ధతి అని బహుజన సమాజం గుర్తిస్తుంది. నిజమైన సమానత్వం వచ్చినప్పుడు మాత్రమే ఈ పరిస్థితి మారుతుంది.

ఇంటిగ్రేషన్ విధానంలో బహుజనులు తమ స్వీయ గుర్తింపును, వారసత్వాన్ని వదులుకోవాల్సి వస్తుంది. ఇది నిజానికి బహుజన సమాజాన్ని అంతరించేటట్లు చేస్తుంది. అంతరించాల్సింది సమాజం కాదు; దానిపై మోపబడిన కుల వివక్షత, ఆధీన స్థితి.

బహుజనుల సాంస్కృతిక స్వరూపం కాపాడబడాలి. అదే సమయంలో ఆ సమాజం తన స్వేచ్ఛను సాధించాలి. పోరాటంలో, భావజాలంలో స్వీయ గౌరవం ఉండాలి—అహంకారం కాదు. శరీరంలోని ఒక భాగాన్ని తిరస్కరించడం ద్వారా ఎవరూ సంపూర్ణ వ్యక్తిగా మారలేరు. ఈ సత్యాలు స్పష్టంగా కనిపించినప్పటికీ, కుల అధిపత్యం వాటిని అంగీకరించదు —ఇది సమాజంలోని లోతైన కుల ఆధిపత్య అహంకారాన్ని చూపిస్తుంది. నాయకత్వం సమూహాలను ముందుకు నడిపించుకోవడం సహజంగా అంగీకరించబడింది. అదే హక్కు బహుజనులకు కూడా ఉంది.

ఇప్పుడు "కూటమి" అనే భావన సూక్ష్మముగా పరిశీలన చేద్దాం. బహుజన ఉద్యమాన్ని, శక్తివంతమైన కుల ఆధిపత్య సమాజం మరియు వారిపై ఆధారపడిన బహుజన సమాజాలను మధ్య మధ్యవర్తిగా చూడటం దీని ప్రధాన ఆలోచన. "కూటమి" అనే భావనను, రాజకీయాలను ఎలా ఎదుర్కోవాలి, రాజకీయ సంబంధాలను ఎలా నిర్మించాలి అనే మూల ప్రశ్న బహుజన రాజ్యాధికార భావనను అర్థం చేసుకోవడంలో ముఖ్యమైనది.

ఈ సమాజంలో బలంగా నాటుకుపోయిన అభిప్రాయం ఏమిటంటే—బహుజనులు తమ రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులను సాధించడానికి ఉత్తమ మార్గం అనుకూల శక్తులతో—ప్రత్యేకంగా అధికార కూటమిలో స్థానం ఏర్పరచుకోవడమే అని. అలాంటి మిత్రులతో కలిసి వారు చట్టాలపై, సామాజిక విధానాలపై ప్రభావం చూపగలరు; తద్వారా కుల అహంకారాన్ని నిర్మూలించవచ్చనేది కూటమి భావన.

బహుజన ఉద్యమం ప్రారంభంలో స్వతంత్ర గుర్తింపును ప్రోత్సహించేలా, కూటములకు సిద్ధంగా లేని భావన కనిపించేది. కానీ కాలక్రమేణా అది తన దిశను మార్చుకుంది. కాన్షిరాం దృష్టిలో అధికారం అనేది సిద్ధాంతాలకు అలంకారం కాదు, భవిష్యత్తును మలచే సాధనం. కాన్షీరాం అంగీకరించిన కూటములు ప్రేమతో కాదు, లెక్కలతో ఏర్పడ్డవి. అక్కడ తన పార్టీని, మాయావతిని నాయకత్వంలో ముందుకు తీసుకెళ్లాలనే ఆయన లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది: ముందుగా అధికారం, తర్వాత సిద్ధాంతాలపై చర్చ అయన విధానం. రాజకీయాల్లో విభజనల మధ్య ఆయన కూటములను శాశ్వత సంబంధాలుగా కాకుండా తాత్కాలిక వంతెనలుగా చూశారు. ఒక దశలో ఆయన హిందుత్వానికి వ్యతిరేకంగా నిలబడి, ములాయం సింగ్ యాదవ్

తో చేతులు కలిపారు. "మిలే ములాయం-కాన్షీరాం, హవా మే ఉడ్ గయే జై శ్రీ రామ్" అనే నినాదం ఆ కాలంలో ప్రతిఘటనకు ప్రతీకగా నిలిచింది. కానీ కాలం మారేకొద్దీ ఆయన వ్యూహం కూడా మారింది. 1990ల మధ్యకాలంలో, కాన్షీరాం బీజేపీతో వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకున్నారు. వాటితో మాయావతిని ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకురావడం జరిగింది. ఇవి సిద్ధాంతాలపై ఆధారపడి ఉన్న కూటములు కాదు; ఇవి తాత్కాలిక ప్రయోజనాల కోసం చేసిన రాజకీయ నిర్ణయాలు—బహుజన నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి ఉపయోగించిన మార్గాలు.

# 8. కూటములు రకాలు

కాన్షీరాం దృష్టిలో రాజకీయాలు పవిత్రతకు సంబంధించిన స్థలం కాదు; అది రంగ స్థలం —అక్కడ బలం ఉన్నవారే నిలబడతారు. అధికారం లేకుండా సామాజిక న్యాయం కేవలం నినాదంగా మిగిలిపోతుందని ఆయన నమ్మకం. తాత్కాలికమైనా అధికారాన్ని పొందగలిగితే, అది నిశ్శబ్దంగా ఉన్న సమాజాన్ని మేల్కొలిపే సాధనంగా మారుతుందని అయన అభిప్రాయం.

విమర్శకుల దృష్టిలో ఈ రాజకీయ కూటములు ఋణాత్మకమైనవిగా అభివర్ణించబడ్డాయి. కొన్ని అభిప్రాయాల ప్రకారం, ఈ కూటములు మైనారిటీలలో బహుజన సమూహ భావనను నీరుకార్చాయి. ఐక్యత లక్ష్యాన్ని బలహీనపరిచాయి. ఈ కూటముల వల్ల బహుజన ఐక్యత అనే స్వప్నం మసకబారినట్టు అయ్యింది.

అధికారం కైవసం చేసుకోవాలి అంటే కూటములను తిరస్కరించడం సరైన విధానం కాదు; అవి విజయవంతం కావాలంటే ఏ పునాదులపై నిర్మించబడాలి అన్నది స్పష్టంగా పరిశీలించాలి. కూటమి సిద్ధాంతం మూడు ప్రధాన అంచనాలపై నిలబడి ఉంటుంది.

మొదటి అంచనా — భారతదేశంలోని బహుజనుల ప్రయోజనాలు, విస్తృత సమాజ ప్రయోజనాలతో సమానమని భావించడం. ఈ భావనలోని అపోహ ఏమిటంటే—దేశానికి ఏది మంచిదైతే, అది బహుజనులకు కూడా మంచిదే అనుకోవడం.

రెండవ అంచనా —రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా సురక్షితంగా ఉన్న వర్గాలు మరియు అసురక్షిత వర్గాల మధ్య స్థిరమైన కూటమి సాధ్యమవుతుందని భావించడం.

మూడవ అంచనా —కూటములు నైతికత, స్నేహభావం లేదా భావోద్వేగ పిలుపులపై నిలబడతాయని నమ్మకం.

మొదటి రకం కూటమి: ఈ రకమైన కూటమి సిద్ధాంతాన్ని సమర్థించే వారు చేసే ప్రధాన తప్పు ఏమిటంటే—సమాజాన్ని పూర్తిగా మార్చాలనే లక్ష్యంతో సిద్ధాంత స్వరూప్యత లేని పార్టీలతో కూటములను ప్రోత్సహించడం. ఈ గ్రూపులు కుల ఆధిపత్య వ్యవస్థను అంగీకరిస్తాయి; అత్యధికంగా చిన్న చిన్న సంస్కరణలకే సిద్ధంగా ఉంటాయి. కానీ అలాంటి మార్పులు కులాహంకారాన్ని నిర్మూలించడానికి సరిపోవు.

మరో ముఖ్యమైన అంశం ముందుకు వస్తుంది—కుల ఆధిపత్య సమాజంలో వ్యాప్తి చెందిన ఆధిపత్య భావన. అగ్ర కులస్తుడు, ఎంత సంస్కరణాభిలాషి అయినా, బహుజన సమస్యలను బహుజన వ్యక్తి దృష్టితో చూడలేడు. ఎందుకంటే అతని జీవితం కుల ఆధిపత్య ప్రపంచంలోనే సాగుతుంది—అతని నివాసం, విద్య, సామాజిక సంబంధాలు అన్నీ అదే పరిధిలో ఉంటాయి. అతను బహుజనుల వాస్తవ పరిస్థితులను చూడటానికి ప్రత్యేకంగా ప్రయత్నించాలి; అయినప్పటికీ, అతని అవగాహన చాలాసార్లు ఉపరితల స్థాయిలోనే ఉంటుంది. కుల ప్రపంచంలో అతను ఆధిపత్య స్థానంలో జీవిస్తాడు; కానీ బహుజనుడు అదే ప్రపంచంలో అవమానంతో, దిగువ స్థాయి గుర్తింపుతో జీవించాల్సి వస్తుంది. అందుకే, ఎంత సంస్కరణాభిలాషి అయినా, అగ్ర కులస్తుడు తనలోని 'కుల ఆధిపత్య' ప్రభావాన్ని పూర్తిగా అధిగమించలేడు అనే సత్యాన్ని బహుజనవాదం గుర్తిస్తుంది.

ఇలాంటి కూటమి భాగస్వామ్యులు బహుజనులను సమాన భాగస్వాములుగా చూడరు; వారి లక్ష్యం సనాతన ధర్మ విలువలను అనుసరించడం మాత్రమే అని భావిస్తారు. ఇతరులు వారికి అనుగుణంగా మారాలి అనే భావన వారిలో స్పష్టంగా కనబడుతుంది. ఈ విధమైన దృక్పథం స్పష్టమైన కుల ఆధిపత్య అహంకారం కాకపోయినా, దాని ఫలితం కుల ఆధిపత్య అహంకారాన్ని కొనసాగించడమే. కాబట్టి, అర్థవంతమైన బహుజన కేంద్రిత కూటములు ఏర్పడాలంటే, భాగస్వాములు అందరూ ప్రస్తుత సామాజిక ప్రమాణాలను, వ్యవస్థలను సవాలు చేయడానికి సిద్ధంగా ఉండాలి.

హిందూ జాతీయవాదం అనే దృక్కోణం ప్రకారం, భారత దేశానికి —అంటే అగ్రకులాలకు —ఏది మంచిదో అదే బహుజన ప్రజలకు కూడా మంచిది. అన్ని కులాలను, మతాలనూ ఒకే జాతిగా జాతీయవాదం చూస్తే, హిందువులను మాత్రమే ఒకేజాతిగా పరిగణిస్తుంది హిందూ జాతీయవాదం. దీన్ని బహుజనులు తిరస్కరించాలి. స్వాతంత్ర పోరాట కాలం నుండి నేటి వరకు బహుజన ప్రజల , ఆర్థిక మరియు సామాజిక హక్కులు, వారి 'పాలకుల' ప్రయోజనాలతో ఢీకొన్న క్షణంలో మాత్రం చర్చకు వచ్చి, వెంటనే త్యాగం చేయవలసిన వాటిగా మారిపోతున్నాయి, ఎప్పటికీ తీరని సమస్యల రూపంలోనే ఉన్నాయి.

దీనికి స్పష్టమైన ఉదాహరణగా హిందూ జాతీయవాదంతో జతగట్టిన "కోయిలీషన్" ప్రభుత్వాల పనితీరును వివరించవచ్చు. ఈ కూటములు స్థూలంగా బహుజనుల మద్దతుపైనే ఆధారపడుతున్నాయి; దురదృష్టవశాత్తూ, గత కొద్దీ కాలంగా బహుజనులు అదే రాజకీయ యంత్రాంగానికి ఓట్లు వేస్తున్నారు. ఫలితాలు ఏమిటో చూస్తున్నా . రైతులను ఇరుకున బెట్టే చట్టాలను, చిన్న, మధ్యతరగతి వ్యాపారులను పీడించే పన్నుల వ్యవస్థను, వ్యవసాయాన్ని కూలదోసే చట్టాలను, ఉత్పత్తి కులాలను, మైనారిటీలను హింసించే చట్టాలను "కోయిలీషన్" ప్రభుత్వాలు చేస్తున్నాయి. పౌర ప్రాజెక్టులలో — ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, కొత్త విమానాశ్రయాలు, పోర్టులు, వీటిని నేటి రాజకీయ నాయకులు తమ పెట్టుబడిదారులకు అనుగ్రహాలుగా పంచుతున్నారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఎలెక్టోరల్ బాండ్లు కొన్నవారికి వాటిని ప్రసాదంగా పంచి పెట్టారు. వీటి వలన బహుజనుల సమస్యలకు పరిష్కారం ఏమి లభించదనీ, బహుజనులు కుల ఆధిపత్య రాజకీయ యంత్రాంగంపై ఆధారపడుతూ ఉన్నంతకాలం, వారి ప్రయోజనాలు రెండో స్థానంలోనే ఉంటాయి అని స్పష్టం అయ్యింది.

ఒక పార్టీ గురించి చిన్న ప్రస్తావన. ఆ పార్టీకి కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. కానీ ఎవరితో జత కట్టాలి అనే సిద్ధాంతం లేదు. ఆ పార్టీ ఆరంభంలో చే గూవేరా బొమ్మతో అయన సిద్ధాంతాలను పుణికి పుచ్చుకొన్న విడుదల పార్టీగా ప్రజలకు కమ్యూనిస్ట్ పార్టీ భ్రమ కలుగజేసింది. ఆ తరువాత బెహెన్ మాయావతి పాదపూజ చేసి బహుజనులకు బహుజన పార్టీ బ్రమ కలిగించింది. తరువాత హిందూ జాతీయవాదంతో జతకట్టి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి రాగానే సనాతన ధర్మాన్ని కాపాడడమే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేసింది. 'మిలే మోడీ ఎపిస్టిన్ హవామే ఉడుగయే హిందుత్వ' అనే నినాదం ఊపందుకొనేసరికి తమకంటూ కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని బహుజనులకు ఏమాత్రం ఉపయోగించని, సంబంధం లేని తమ సిద్ధాంతాలను ప్రజల ముందు పెట్టింది. హిందూ జాతీయవాద కూటమి ప్రభుత్వాలు తమకు అనుకూలమైన లక్ష్యాలను నిర్ణయించి, బహుజనులు వాటిని అనుసరించాలని కోరుకుంటాయి. ఒకవేళ బహుజన నాయకులు ఒత్తిడితో తమ ప్రజల ప్రయోజనాలను ముందుకు తెస్తే, వారిని "దేశద్రోహులు' అని ముద్ర వేస్తాయి. ఒక పార్టీ అధినేత ఒకవేళ హిందూ

జాతీయవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి, కుల ఆధిపత్య అధికార నిర్మాణానికి, కులాల అధిపత్యానికి వ్యతిరేకంగా మాట్లాడితే అతడు కూడా దేశద్రోహి అయిపోతాడు.

బహుజనవాద అనుభవాల నుండి చూస్తే దేశంలోని కార్మిక సంఘ సిద్ధాంతాలు ఆర్థిక వ్యవస్థ యొక్క మూల స్వభావాన్ని సవాలు చేయడంలేదు. సంఘటిత కార్మిక ఉద్యమాలు కూడా సమాజపు మూల విలువలను, వ్యవస్థలను ప్రశ్నించాల్సిన అవసరాన్ని ఎప్పుడూ ముఖ్యంగా పరిగణించడంలేదు. ముఖ్యంగా కార్మికసంఘాలు కార్మిక లక్ష్యాల కోసం మాత్రమే పనిచేస్తున్నాయి. అంతేకాక హిందూ జాతీయవాద మూల విలువలతోనే అనుసంధానమై ఉండిపోయే బంధింపబడిన కార్మికవర్గాన్ని తయారుచేస్తున్నాయి. వారు కేవలం శ్రమకు తగ్గ ఫలితం పొందాలనీ, వారి జీవితాలకు భద్రత ఉండాలని కోరుకొంటున్నారు. వారి మార్గం సమ్మెలు, చర్చలు, డిమాండ్ల సాధన. వారు కూడా విస్తృత లక్ష్యాలను పక్కనపెట్టి, రోజువారీ జీవన సమస్యలపైనే దృష్టి పెడుతున్నారు. సోషలిస్టు విధానాలతో భారతదేశంలో నిర్మించబడ్డ ప్రభుత్వ రంగ సంస్థల్లో అనుభవాలను కొందరు ఉటంకిస్తూ సోషలిస్టు విధానాలు అభివృద్ధిలో ఎంతటి పెనుమార్పులు తీసుకురాగలవో అనే అంశాల గురించి మాట్లాడుతున్నారు. మెజారిటీ కార్మిక సంఘాలు, కుల ఆధిపత్య రాజకీయ పార్టీల అనుబంధ సంస్థలుగా ఉంటూ తమ కార్మిక వర్గ సమస్యలను పరిష్కరించుకొనే పనిలోనే ఉన్నాయి. రాజకీయ, ఆర్థిక, సామాజిక అసమానత్వానికి కారణమైన కులవ్యవస్థను, కుల ఆధిపత్యం అధికార నిర్మాణాన్ని ప్రశ్నించడం లేదు. కమ్యూనిస్టులూ అదే బాటలో ప్రయాణిస్తున్నారు. కొంతవరకు పౌర హక్కుల సంఘాలు విస్తృత అంశాలపై పని చేసాయి. అయినప్పటికీ, సమాజంలోని కులతత్వ పునాదిని అవి సీరియస్ గా ప్రశ్నించలేదు.

మొత్తంగా చెప్పాలంటే: బహుజన ప్రజల రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితి మెరుగుపడాలంటే ఈ సమాజపు భావజాలాన్ని పూర్తిగా పునర్నిర్మించాల్సిందే. హిందు జాతాయవాద భావజాలంతో కూటములు కట్టి మార్పు సాధ్యమని భావించడం తప్పు. రాజకీయ, ఆర్థిక, సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించని, దాన్ని ఖండించని, మూల మార్పు అవసరాన్ని అంగీకరించని వర్గాలతో బహుజనులు ప్రజలు సమర్ధవంతమైన కూటములు ఏర్పాటు చేయలేరు. కుల ఆధిపత్య భారత దేశానికి ఏది మంచిదైతే అదే బహుజన భారత ప్రజలకు మంచిదని

అనుకోవడం బహుజన భావజాలంలో సాధ్యం కానీ పని. కుల ఆధిపత్యం అధికార నిర్మాణానికి, కుల ఆధిపత్య పార్టీలు ప్రత్యక్షముగా పరోక్షముగా మద్దత్తునిస్తూ ఉంటాయి. వాటి కొనసాగింపులో బహుజనులను భాగస్వాములను చేస్తుంటాయి. బహుజనులు వారి నాయకులు ఇటువంటి కుల ఆధిపత్య రాజకీయపార్టీలతో అప్రమత్తంగా ఉండాలి.

రెండవ రకం కూటమి: రాజకీయంగా మరియు ఆర్థికంగా భద్రంగా ఉన్న వర్గం, రాజకీయంగా మరియు ఆర్థికంగా అసురక్షితంగా ఉన్న మరో వర్గంతో కలిసి పని చేయగలదనే ఊహ. నిర్వచన ప్రకారం, ఆ వర్గాల లక్ష్యాలు పరస్పరం భిన్నంగా ఉంటాయి; కాబట్టి అలాంటి కూటమి చాలా బలహీనమైన పునాదిపై నిలుస్తుంది.

నిజానికి, కుల ఆధిపత్య సముదాయం బహుజనుల కంటే ఎన్నో రెట్లు సురక్షితముగా ఉంది. ఉదాహరణకు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాన్నే తీసుకొంటే అగ్రకులాల వారు దాని ఆర్య వర్ష్ గా నిర్వచించుకొన్నారు. అక్కడ అగ్రకులాల వారు ప్రధానంగా భూమి కలిగిన భూస్వామ్యులు, వారు భారతీయ జనతా పార్టీకి వెన్నెముక; అక్కడ భూమి లేని బహుజనులు తరతరాలుగా దోపిడీకి గురౌతున్నవారు, వారు బహుజన సమాజ్ పార్టీకి వెన్నెముక. అటువంటి పరిస్థితులలో భూమి మీద గుత్తాధిపత్యం ఉన్న అగ్రకులాల పార్టీకి, భూమిలేని అసురక్షిత వర్గంమైన బహుజన సమాజ్ పార్టీకి మధ్య అర్థవంతమైన సిద్ధాంత పునాదిపై కూటమి ఎలా ఏర్పడగలదు? అందుకే, బీజేపీతో బహుజనుల కూటమి సౌహార్దపూర్వకమైందని చెప్పడం వాస్తవానికి విరుద్ధం. ఉత్తరాదిన బహుజన నినాదం లేదా బహుజన ఉద్ధరణ ప్రధాన అజెండాగా నడిచిన పార్టీలు బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని బహుజనులు ఈ విధంగానే చూస్తున్నారు. ఈ రకమైన కూటమిలో కుల ఆధిపత్యం తమ స్వప్రయోజనాల కోసం రాజకీయాలు నడిపింది. బహుజనులు మాత్రం రాజకీయ పావులా, బలమైన వర్గాల అవసరాలకు ఉపయోగపడే పనిముట్లుగా మారిపోయారు.

దక్షిణాదిలో బీజేపీకి మద్దత్తు ఇచ్చే తీరు మరోలా ఉంది. ఆధిపత్య కులాల, వ్యాపార, భూస్వామ్య వర్గాల నేతృత్వంలోని పాలకకులాలు మరియు బహుజనుల మధ్య కూటమి ఇక్కడి రాజకీయాల్లో పాత్ర పోషిస్తుంది. ఇది కూడా సిద్ధాంత వైరుధ్య పునాదిపై ఏర్పడిన కూటమే.

పాలక కులాల పార్టీలు, భూస్వామ్య వర్గాల పార్టీలే. అవి బలవంతులవే కావడం వల్ల, బహుజనులు వారితో పొత్తుకు వెళ్లడం బహుజనులకు హానికరం. బలమైనవారి చేతిలో కూటములు సాధనాలు మాత్రమే; బలహీన వర్గాల కోసం అవి స్థిరమైన ఏర్పాట్లు కావు.

కుల వ్యవస్థలో మొదటిగా బహుజనులను వేరు చేసి ఉంచారు. బహుజనుల ఆదాయాన్ని వేర్వేరుగా దోచుకోవడానికి వారు ఒకరినొకరు ద్వేషించుకొనేలా చేశారు, ఆ ద్వేషమే అగ్రకులాల ఆర్థిక నియంతృత్వాన్ని నిలబెట్టింది. కాబట్టి బహుజనుల మధ్య కులాంతర ద్వేషం కుల ఆధిపత్యాన్ని నిలబెట్టే పునాది.

ఆంధ్రప్రదేశ్లో భూవనరులపై ఆధిపత్యం, వ్యాపారాలలో పట్టుగలిగిన అగ్రవర్ణాల వారు బలమైన వర్గంగా, మూడు ప్రాంతాల్లో భూమి మీద ఆధిపత్యం, వ్యాపారాలలో పట్టులేని బహుజనులు బలహీనమైన వర్గంగా ఈ కూటమి రాజకీయాల్లో కనిపిస్తారు.

ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుత అధికార కూటమిని "మూడు కాళ్ల కుర్చీగా వర్ణించవచ్చు. ఒక కాలు ఆధిపత్య కులాల వ్యాపార వర్గం, రెండో కాలు భూస్వామ్య పాలక కులాల వర్గం, మూడో కాలు బలహీనమైన బహుజన వర్గం. ఈ కుర్చీ నిర్మాణంలో లోపం ఉంది—మూడవ కాలైన బహుజన సమాజం తమ స్వప్రయోజనాలను కాపాడుకునే కుల ఆధిపత్య అధికార నిర్మాణం మరియు భూస్వామ్య పాలక వర్గాల చెప్పుచేతల్లో ఉంది. ఈ బహుజన వర్గం మిగతా రెండు వర్గాలతో పోలిస్తే ఆర్థికంగా, రాజకీయంగా బలహీనమైంది. దానితో పాటు వారికి నిజమైన అభివృద్ధిపై స్పృహ లేకపోవడంచేత వారు బహుజనుల అవసరాలను ప్రతిబింబించలేరు. ఇలాంటి వర్గం బహుజన భావజాల విస్తరణను అడ్డుకునే పని చేస్తుంది.

అగ్రకులాలు, భూస్వామ్య పాలక వర్గాలు ఇలాంటి కూటమిలో చేరడానికి కారణాలైన వారి రాజకీయ మరియు ఆర్థిక ప్రయోజనాలు బహుజనులకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే, ఆ ప్రయోజనాలు తరచుగా బహుజనుల ప్రయోజనాలకు పూర్తి విరుద్ధంగా ఉంటాయనేది కూడా స్పష్టమే. రాజకీయంగా మరియు ఆర్థికంగా భద్రంగా ఉన్న కూటమి భాగస్వామ్యులకు నమ్మకంగా మద్దతు ఇచ్చిన బహుజనులకు ఇలాంటి కూటమి వల్ల చివరికి ఏమి లభించిందో, లభించనుందో బహుజన నాయకత్వం గుర్తించింది.

బహుజనులు గ్రహించాల్సింది ఏమిటంటే—ఇలాంటి కూటములు, ఇలాంటి అవకాశవాద మైత్రి వారి ప్రయోజనాలకు అనుకూలంగా పనిచేయలేదు. వారు చేతులు కలుపుతున్న శక్తులు, బహుజనుల దీర్ఘకాల ప్రగతికి సరిపడేవి కావు. అనేక సందర్భాల్లో బలమైన వర్గాలు ఈ రకమైన కూటముల్లోకి ప్రవేశించేది, తమ ఆధిపత్యాన్ని లేదా మనుగడను కాపాడుకోవడానికి, బహుజనుల ప్రగతిని అడ్డుకోవడానికి మాత్రమే.

మూడవ రకం కూటమి: ఈ రకమైన రాజకీయ కూటములు నైతికత, స్నేహం, భావోద్వేగం లేదా మనస్సాక్షి ఆధారంగా నిలబడగలవనే ఊహద్వారా ఏర్పడే కూటములు. ఇది కూడా భ్రమే, ఎందుకంటే రాజకీయ సంబంధాలు స్వప్రయోజనాలపై ఆధారపడి ఉంటాయి. రాజకీయాల్లో పొందే లాభాలు, తప్పించుకోవాల్సిన నష్టాలు మాత్రమే లెక్కకు వొస్తాయి. సాధారణంగా రాజకీయాలు భౌతిక లాభనష్టాల అంచనాపై ఆధారపడతాయి. రాజకీయాలు ప్రయోజనాల మధ్య తగాదా వల్ల ఉద్భవిస్తాయి.

ప్రయోజనాల మధ్య తేడాలు వచ్చినప్పుడు ఈ కూటమి సభ్యులు విశ్వసనీయ మిత్రులు కారు. నైతికత మరియు భావోద్వేగం అలాంటి తేడాలను తట్టుకోలేవు, ఇది బహుజనులు గ్రహించారు. ఏ గుంపు అయినా కూటమిలోకి వెళ్లేటప్పుడు మిత్రుడి “మంచి మనసు”పై ఆధారపడకూడదు. ఆ మిత్రుడు ఆ మంచితనాన్ని వెనక్కి తీసుకుంటే, అతనిపై ఎటువంటి చర్యలు తీసుకునే అవకాశాలు రాజ్యాంగబద్ధంగా లేవు కాబట్టి.

నిజం ఏమిటంటే, ప్రజలు తమ రోజువారీ జీవితాల్లో పిల్లల విద్య, ఉద్యోగాలు, ఇళ్లు, భవిష్యత్తు గురించి ప్రాక్టికల్ నిర్ణయాలు తీసుకుంటూ జీవిస్తారు. లాభాన్ని ప్రాధాన్యంగా చూసే భౌతికవాద సమాజంలో సిద్ధాంతాలపై ఆలోచించడానికి ఎక్కువ సమయం ఉండదు. ఒక వర్గం తమకు దగ్గరగా ఉన్న మరో వర్గపు సమస్యల విషయంలో అంతగా నైతిక బాధ్యతను తీసుకోలేదు. గౌరవం తగ్గడం, ఉద్యోగ, వ్యాపార పోటీ పెరగడం, ఆదాయాలు తగ్గడం, ఆస్తి విలువలు తగ్గడం వంటి పరిణామాలు ఎదురైతే నైతికత, స్నేహం, భావోద్వేగం లేదా మనస్సాక్షి ఆధారంగా కూటమి మనుగడ సాధ్యంకాదు. భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, కనీసం సమాన అవకాశాలు మరియు రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం గురించి చెబుతుంది. కానీ వాస్తవం ఏమిటంటే,

ఈ మాటలు ఆదినుండి బహుజనులకు వర్తించడంలేదు. అందుకు కారణం కుల ఆధిపత్య అధికార నిర్మాణం భారత దేశాన్ని మొదటి రోజు నుండి నేటి వరకూ పరిపాలిస్తుంది.

అయితే, స్థిరమైన కూటములకు పునాదులు ఏమిటి?

కూటముల గురించి మాట్లాడటం ప్రారంభించే ముందు, ఆ కూటమి ఏ సిద్ధాంతాలపై ఆధారపడుతుందో స్పష్టంగా నిర్ణయించాలి. కూటమిలో ఉన్న ప్రతీ పక్షం తమ స్వప్రయోజనాల దృష్టిలో పరస్పర లాభదాయకమైన లక్ష్యాన్ని గుర్తించాలి. ఒక పక్షానికి మంచిది, ప్రశ్నించకుండా మరొక పక్షానికి కూడా మంచిదే అని గుడ్డిగా ఊహించకూడదు. బహుజనులు ముందుగా తమకు ఏది మేలనేది నిర్ణయించాలి; ఆ తరువాతే ఏ కూటమి వర్గాలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయా అని చూడాలి. సంస్థలు, రాజకీయ వ్యవస్థలు తమ స్వప్రయోజనాల బయట ఎటువంటి మనస్సాక్షిని కలిగి ఉండవని వారు గుర్తించాలి.

రెండవది, కూటమిలోకి ప్రవేశించే ముందు నిజమైన అధికారానికి ఆధారాలు ఉండాలి. లేని పక్షంలో వారు కూటమి పక్షాల మనస్సాక్షి, దయ మీద ఆధారపడాల్సి వస్తుంది; వారు యాచకుల పాత్రలో నిలబడి, కూటమి పక్షాల దయా దాక్షిణ్యాలకోసం కోసం ఎదురు చూడాలి.

చిన్న, తాత్కాలిక కూటములు కొన్ని ప్రత్యేక సమస్యలపై నిర్ణయాత్మకంగా ఉండగలగడం సాధ్యమే. కానీ అవి సాధారణంగా వ్యవస్థాత్మక కులవివక్షత యొక్క మూలాలను ప్రశ్నించలేవు. అంతేకాక, అవి దీర్ఘకాలంలో హానికరంగా మారే అవకాశమూ ఉంది — నిజమైన విరుద్ధ ప్రయోజనాలను దాచిపెట్టి, చిన్న సమస్యలకే బలహీన కూటమి భాగస్వామిని పరిమితం చేసే ప్రమాదం ఉంది.

కాబట్టి, స్థిరమైన కూటములకు నాలుగు ముఖ్యమైన అర్హతలు ఉండాలి:

ప్రతీ పక్షం తమ స్వప్రయోజనాలను స్పష్టంగా గుర్తించాలి.

కూటమి వల్ల పరస్పర లాభం కలుగుతుందని నమ్మకం ఉండాలి.

ప్రతీ పక్షానికి స్వతంత్ర శక్తి ఆధారంగా ఉండాలి; బయటి శక్తులపై ఆధారపడకూడదు.

కూటమి స్పష్టమైన, నిర్దిష్ట లక్ష్యాలపై ఆధారపడాలి — అస్పష్టమైన ఆశయాలపై కాదు.

బలమైనవారితో కలిసి బలహీనుడు అవసరమైతే తప్ప మరొకరిని దెబ్బతీయడానికి చేతులు కలపకూడదు — ఎందుకంటే గెలుపు తర్వాత అతడు బలవంతుడి ఆధీనంలోకి వెళ్తాడు. అందుకే,

బలహీనులు బలవంతులతో కూటమి కట్టాల్సిన పరిస్థితిని తగ్గించే దిశగా కృషి జరగాలి. అలాంటి కూటములు సాధారణంగా బలహీన పక్షానికి గణనీయమైన ప్రయోజనం ఇవ్వవు.

కాబట్టి ముందుగా బహుజనులు తమను తాము సంఘటితం చేసుకోవాలి, తమ లక్ష్యాలను నిర్వచించుకోవాలి, తరువాతే మిత్రులను వెతకాలి. ఏ సమూహమైనా కూటమి గురించి ఆలోచించే ముందు, బలంగా, సంఘటితంగా ఉండాలి.

బహుజన భావజాలం కూటములు వ్యతిరేకించదు. కానీ మిథ్యలపై ఆధారపడిన కూటములను అంగీకరించదు. స్వతంత్రంగా నిలబడగలిగిన తర్వాతే కూటమిలోకి ప్రవేశించాలి. అప్పుడు మాత్రమే ఆ కూటములు స్థిరంగా, అర్థవంతంగా మారతాయి. పరస్పర గౌరవం పెరు      ంది. నాయకులు తమ అనుచరులను మోసం చేసే అవకాశాలు తగ్గుతాయి.

బహుజన భావజాలం అంటే ఒంటరిగా నడవడం కాదు — ముందుగా నిలబడగల శక్తిని నిర్మించుకోవడం, ఆ తరువాత సమాన స్థాయిలో చేతులు కలపడం. భవిష్యత్తులో తప్పటడుగులు వేస్తే, బహుజన భావజాలం ఇప్పటివరకు సాధించిన పరిమిత విజయాలు కూడా హిందుత్వం వెనక్కి తీసుకునే ప్రమాదం ఉంది. కాబట్టి, దృఢమైన పునాదులపై ఆ భరోసాను బహుజనులే నిర్మించుకోవాలి.

బహుజనులు తమను తాము పునర్నిర్వచించుకోవాలి, కొత్త విలువలు మరియు లక్ష్యాలను ప్రతిపాదించుకోవాలి అనేది స్పష్టం, ఇది సంస్కరణాభిలాషులైన కొందరు ఆధిపత్య కులాల ప్రతినిధులకు కూడా వర్తిస్తుంది; వారు కూడా తమను తాము మరియు తమ పాత్రను పునర్నిర్వచించుకోవాలి.

# 9. సంస్కరణాభిలాషుల పాత్ర

బహుజన భావజాలం నాయకత్వం నుండి అగ్రకులాలను తొలగించాలనే ఉద్దేశంతో ఉన్నదానిగా చూస్తారు. ఇది నిజం కాదు. సంస్కరణాభిలాషులైన కొందరు ఆధిపత్య కులాల ప్రతినిధులు పోషించగల స్పష్టమైన, అత్యవసరమైన నాయకత్వ పాత్ర బహుజనవాదంలో ఉంది. ఈ పాత్రను మూడు పరస్పర సంబంధం కలిగిన స్థాయిలలో చూడవచ్చు. విద్యాపరమైనది, సంస్థాగతమైనది, మద్దతుకు సంబంధించినది.

సమాజంలో కులవివక్షత విస్తృతంగా వ్యాపించి ఉండడం, కుల ఆధిపత్యం మరియు బహుజనుల నిమ్నత్వం అనే దురభిప్రాయం లోతుగా నాటుకుపోయి ఉండడం వల్ల, ఆధిపత్య కులాల సంస్కరణాభిలాషులు ఈ అపోహలను తమలో నుంచి తొలగించుకోవడం అత్యంత అవసరం. జాలి దయతో బహుజనుల చెంత నిలబడడం కాదు. న్యాయ సిద్ధాంతంపై పూర్తి నమ్మకంతో బహుజనుల సాధికారతకు పనిచేయాలి. కుల సమాజంలో బహుజనులు చేరుకోలేని తరగతులు, సమూహాలలోకి అగ్రకులాల ప్రతినిధులకు ప్రవేశం ఉంటుంది. వారు ఆ వర్గాల్లోకి వెళ్లి ఈ ముఖ్యమైన న్యాయ సమీకరణపై జాగృతపరిచే పనిని చేయాలి. మిగతా అగ్ర కులాలవారిని ఎడ్యుకేట్ చేయాలి. ఈ రకమైన బహుజనవాదం మద్దతుదారులతో కలత కలిగించే విషయం ఏమిటంటే, వారు తమ కుల సమాజాల్లోకి వెళ్లి అక్కడవున్న కులవివక్షత తొలగించడానికి, న్యాయ సిద్ధాంతంపై పని చేయడంలో వెనుకంజవేస్తున్నారు. ఈ పనిని చేసే కొద్ది మంది ఉన్నారు వారిని బహుజనవాదం గుర్తించి గౌరవించుకోవాలి.

ఇక్కడ వ్యక్తిగత స్థాయిలో బహుజనులను కుల ఆధిపత్య సమాజంలో "ఆమోదింపజేయడానికి"పనిచేసిన అగ్రకులాల వారి గురించి మాట్లాడటం లేదు. అలాంటి వారు చాలామంది ఉన్నారు; వారి ప్రయత్నాలు మంచి ఉద్దేశంతో కూడినవే మరియు వ్యక్తిగతంగా సహాయకరమైనవే. కానీ చాలా సార్లు ఆ ప్రయత్నాలు సమగ్రత (integration) అనే అసంభావ్య ఆధారం పైనే నిలుస్తాయి. సంస్కరణాభిలాషులు తరచూ బహుజనులకు అహింసను బోధిస్తారు. వారు అహింసను తమ కుల ఆధిపత్య సమాజాల్లో బోధించాలి. ఎందుకంటే బలహీనులైన బహుజనులపై హింసకు దిగుతున్నది ఆధిపత్య కులాల వారే. వారు సాధ్యమైన చోట, ఇతర అగ్రకులాలవారికి బహుజన అధికార అవసరాన్ని, న్యాయ సిద్ధాంతాన్ని వివరించాలి.

దేశవ్యాప్తంగా, కుల ఆధిపత్య సమాజాలు అవగాహనలో పేదరికం, మానవత్వంలో పేదరికం, మరియు బహుజనుల పట్ల నాగరికంగా ప్రవర్తించే సామర్థ్యంలో పేదరికాన్ని చూపిస్తున్నాయి. ఈ అంశాలలో తమ వారికి తమపాత్ర గురించి వారు ఎడ్యుకేట్ చేయాలి.

తదుపరి సంస్థాగత పాత్ర. చివరికి పేద బహుజనులు మరియు పేద అగ్రకులాల మధ్య కూటమి ఏర్పడాలని ఆశించవచ్చు. బహుజనవాదానికి ఆమోదయోగ్యంగా కనిపించే ఏకైక కూటమి ఇదే, మరియు భారత సమాజంలో మార్పుకు ఇది ప్రధాన అంతర్గత సాధనమని బహుజనవాదం భావిస్తుంది. ప్రస్తుతం బహుజనులను మరియు పేద అగ్రకులాలవారిని కలిపే విషయంపై మాట్లాడటం కేవలం సిద్ధాంతపరమైనదే అయినప్పటికీ, స్వేచ్ఛాయుత లక్ష్యాలతో—కులవివక్షత మరియు ఆధీనతపై ఆధారపడని—పేద అగ్ర కుల అధికార వర్గాన్ని నిర్మించే ప్రయత్నం చేయాలి. ఈ బాధ్యత ప్రధానంగా బహుజన వాదాన్ని సమర్థించే ఆధిపత్య కులాల ప్రతినిధులపై ఉంటుంది. సాధ్యమైన చోట బహుజనులు మరియు అగ్రకులాలవారు కలిసి పనిచేయవచ్చు. వాస్తవానికి సమాజంలో పేద అగ్రకులాలవారు బహుజనులపై విరోధభావం పెంచుకుంటున్నారు—అది తగ్గడంలేదు —ఎందుకంటే దేశ దృష్టి బహుజనుల పేదరికంపై కేంద్రీకృతమై ఉందని, నిజమైన అగ్రకులాల పేదలను చూసుకునే వారు చాలా తక్కువగా ఉన్నారు అనే భ్రమ. బహుజనుల న్యాయ డిమాండ్లను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు అదే మొదటి సమస్య. అందుచేతనే బహుజనులు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాల్లో జనాభా ప్రాతిపదికన న్యాయమైన తమ వాటా కోసం పోరాడుతున్నారు. ఆధిపత్య కులాల, బహుజన పేదల మధ్య పేదరికానికి కొలమానం ఒకటే. మతతత్వ బీజేపీ ఈ మధ్య చేసిన ఈబీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ప్రస్తుతం ఈబీసీ రిజర్వేషన్లు పొందుతున్న అగ్రకులాలవారు నిజమైన పేదలు కారు. కేవలం భౌతిక వృద్ధి కోసం న్యాయ సూత్రాలకు వ్యతిరేకమైన చట్టం ద్వారా ఈబీసీ రిజర్వేషన్లు పొందుతున్న అగ్రకులాల వారు నిజమైన అగ్రకులాల పేద వారికి, బహుజనులలో పేదవారికి అన్యాయం చేస్తున్నారు. భవిష్యత్తులో నిజమైన అగ్ర కుల పేదలకు న్యాయం చేయాలి.

నిజమైన ఆధిపత్య కులాల పేదల సమాజాలను సమర్థవంతమైన కూటముల కోసం అవసరమైన విధంగా సమీకరించడం మరియు నిర్వహించడం అగ్రకు లవారే సమర్థవంతంగా చేయగలరు. ఈ పని చేయాలంటే కొత్త రూపాలను సృష్టించాలి. కాబట్టి బహుజన రాజకీయ

ఆధునీకరణ ప్రక్రియలో సంస్కరణాభిలాషులైన ఆధిపత్య కులాల వారు కూడా భాగస్వాములు కావాలి.

బహుజనవాద అభిప్రాయం ప్రకారం, బహుజన సంస్థలు బహుజనుల నాయకత్వంలో ఉండాలి. విధివిధానాలు బహుజనులు నిర్ణయించాలి; బహుజనులే నిర్వహించాలి. సంస్కరణాభిలాషులైన అగ్రకులాల వారు ఈ సంస్థల్లో ముఖ్యమైన మద్దతు పాత్రలను పోషించవచ్చు. వారు ప్రత్యేక నైపుణ్యాలు మరియు సాంకేతికతలతో వస్తే, వాటి ఆధారంగా వారి పాత్రను నిర్ణయించవచ్చు. కుల ఆధిపత్య జీవితం నిస్సారంగా, అర్థరహితంగా అనిపించడంతో వారు బహుజనుల న్యాయం కోరారు. తమ తల్లిదండ్రులు, గురువులు, మతప్రబోధకులు, స్నేహితులలో ఉన్న కులవివక్షతతో కూడిన సంకుచిత ఆలోచనలను వారు ఎదుర్కోలేకపోయారు. వారు మార్పుకు సంకేతం. చాలామంది ఆధిపత్య కులాల సమాజంలో వర్గభేదం కనిపించదు అని భావిస్తూ వచ్చారు. కానీ ఈ దేశంలో ఆధిపత్య కులాలలో కూడా అంతర్గత కుల, ఉపకుల, వర్గ బేధాలు కీలక అంశాలు. బహుజన హక్కుల కార్యకర్తలను రాజకీయాల్లో, కోర్టులో రక్షించే ఆధిపత్య కులాలకు చెందిన నాయకులు, న్యాయవాదులు ఉన్నారు; దేశవ్యాప్తంగా స్థానిక బహుజన ఉద్యమాలకు మద్దతు ఇచ్చే అగ్రకులాల కార్యకర్తలు ఉన్నారు. వారి పాత్ర నాయకత్వం వహించడం కాదు, విధానాలు నిర్ణయించడం కాదు. ఆధిపత్య కులాల వారు సమాజానికి మరియు ఆధిపత్య కులాల పేదలకు బహుజనులతో కలసి నడవడంపై ఎడ్యుకేట్ చేయడము, ఆధిపత్య కులాల పేదలను సమీకరించడము అవుతుంది. ఇప్పటివరకు బహుజన భావజాల రూపాన్ని చూసాము. దాని కార్యాచరణలో పాత, దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొనేందుకు కొత్త రాజకీయ నిర్మాణాలు, కొత్త రూపాల అభివృద్ధి అవసరమని బహుజన భావజాలం భావిస్తుంది. అధికారాన్ని ఎదుర్కోవాలంటే శక్తి కావాలి. కాబట్టి, ముందుగా స్వతంత్ర రాజకీయ శక్తి నిర్మాణం అవసరం. బహుజన సమాజం నియంత్రణ సాధించినప్పుడే ఇతరులు కూటమి కోసం ముందుకు వస్తారు. స్వయం శక్తి కలిగినప్పుడే కూటమి నిజమైన సమానత్వంగా వికసిస్తుంది. కుల ఆధిపత్య అధికార పెటర్నలిజంతో తమ ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే ఏర్పడే కూటములు, బహుజనుల నిజమైన అవసరాలను వ్యక్తపరచలేని, తీర్చలేని, న్యాయం చేయలేని కూటములు కాబట్టి వాటిని బహుజన సమాజం తిరస్కరిస్తుంది.

# 10. బహుజనవాద మూల విశ్వాసాలు

బహుజన ఉద్యమం ఒక ఆత్మగౌరవ పోరాటం. కులాహంకారంతో నిండిన కుల ఆధిపత్య అధికారాన్ని ఛేదించాలంటే, బహుజనులు తమ రాజకీయ శక్తిని మేల్కొలపాలి. బహుజన భావజాలం బహుజనులను జాగృతం చేయడానికి, బహుజనులకు సహాయం చేయడానికి, బహుజనులను సమీకరించడానికి ప్రత్యేక రాజకీయ పాఠశాలలు ఏర్పాటు చేసుకుంటుంది. బహుజనులు తమ కులాల చుట్టూ కాకుండా, బహుజన సమూహ భావన చుట్టూ, అధికారం కోసం సంఘటితమవడం దీని కీలక లక్ష్యం. రాజకీయ ఆర్థిక సామాజిక అన్యాయాన్ని తొలగించేందుకు నిరసనలు కూడా ముఖ్యమే. కులనిర్మూలన, కులవివక్షత తొలగింపు బహుజనవాదం అంతిమ లక్ష్యాలు కాదు; దాని లక్ష్యం ప్రజలను చైతన్యపరచి, రాజకీయ శక్తి కోసం ముందుకు నడపడం.

బహుజనుల హక్కుల హరణకు ప్రధానకారణం కుల ఆధిపత్య అధికార నిర్మాణం. అది అన్ని కోణాల్లో అంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక కోణాల్లో బహుజనులను అణచివేసింది. బహుజనులు రాజకీయ రంగంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంది. భారతదేశంలో జరుగుతున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక అన్యాయం బహుజనులను అణచివేసింది. ఏ డేటా చూసినా ఇదే అర్థం అవుతుంది. ఈ ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి సమాంతర రాజకీయ నిర్మాణాలను సృష్టించేందుకు బహుజనవాదం ప్రయత్నిస్తుంది. గ్రామీణ స్థాయిలో బహుజన రాజకీయ శక్తిని నిర్మించడంపై దృష్టి పెడుతుంది. న్యాయ, నైతిక, రియల్ టైం డేటా ఆధారాలతో తమ వాదనను బలోపేతం చేసుకుంటుంది. కుల ఆధిపత్య అధికార నిర్మాణం 'చట్టం అనేది అధికారంలో ఉన్నవారి సాధనమని' పదే పదే నిరూపిస్తుంది. అధికారం లేకుండా న్యాయం కేవలం వాగ్దానం మాత్రమే. బహుజన భావజాలంలో రాజకీయాలు అధికారంకోసం ఆడే ఆట కాదు, బహుజన విముక్తి కోసం జరిగే క్రమశిక్షణ గల పోరాటం. బహుజనులతో పాటు విస్తృత సమాజము అర్థం చేసుకోవలసిన బహుజన విప్లవ పోరాట, బహుజన పాఠశాల ముఖ్య భావనలు, బహుజనవాద మూల విశ్వాసాలు ఈ విధంగా ఉన్నాయి.

A. బహుజనులు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే సమయంలో లేదా బహుజనులు తమ గమ్యాన్ని తామే నిర్దేశించుకున్నప్పుడు విప్లవం మొదలవుతుంది. దీనినే బహుజన సమాజ స్వయం నిర్ణయ సూత్రం అంటున్నారు.

భారత చరిత్ర అనే నదిలో ఎప్పటి నుంచో రెండు ప్రవాహాలు కలిసి ప్రవహిస్తున్నాయి— ఒకటి పైకి కనిపించే, అధికారంతో నిండి ఉన్నది; మరొకటి అధికారం కోసం లోతుల్లో నిశ్శబ్దంగా ప్రవహిస్తూ, తరంగంలా పైకి లేవడానికి శక్తి ని సమీకరించుకొంటున్నది. బహుజన ఉద్యమం ఒక సత్యం చెబుతుంది: ప్రజలు స్వేచ్ఛ పొందేది వారికి అధికారం ఇచ్చినప్పుడు కాదు; వారు తమ భవిష్యత్తును తాము నిర్ణయించుకునే హక్కును స్వయంగా స్వీకరించినప్పుడు, ఆత్మగౌరవం కోసం పోరాడినప్పుడు మాత్రమే. ఇదే బహుజన స్వీయ నిర్ణయ సూత్రం. ఈ సూత్రం పరాధీనతను తిరస్కరించి, స్వేచ్ఛకు మూలం ఆత్మా గౌరవం మరియు స్వయంప్రతిపత్తి అని ధృవీకరిస్తుంది. ఆత్మగౌరవం పోరాటంలో బహుజనులు తమ లక్ష్యాలను తామే నిర్దేశించుకోవాలి, తమ సంస్థలకు తామే నాయకత్వం వహించాలి, మరియు ఆ సంస్థలకు మద్దతు ఇవ్వాలి. బహుజనులు ఆత్మగౌరవంతో తమ లక్ష్యాలను తామే నిర్ణయించాలి, తమ సంస్థలను తామే నడిపించాలి. పీడిత ప్రజలు తమ శక్తిని నీరుగార్చే కూటములపై ఆధారపడకుండా, తమ సొంత రాజకీయ, ఆర్థిక, మరియు సాంస్కృతిక సంస్థలను తామే నియంత్రించుకోవాలి. అప్పడే స్వయంప్రతిపత్తి సాధ్యం.

B. విప్లవం అనేది నియమిత కాలానికి సంబంధించిన అంశం కాదు —అది కేడర్‌లు, సంస్థలు, మరియు రాజకీయ విద్య ద్వారా నిర్మించబడే ప్రక్రియ. అందుచేత ఆకస్మికత కన్నా వ్యవస్థీకరణ ముఖ్యం. భావోద్వేగం పోరాటాన్ని రగిలించవచ్చు, కానీ వ్యవస్థీకరణ మాత్రమే దానిని నిలబెడుతుంది. క్రమశిక్షణతో కూడిన, వ్యవస్థీకృత రాజకీయ కృషిని బహుజనవాదం చేస్తుంది. "అచేతనాన్ని చైతన్యవంతం చేయడమే చేతనత్వం యొక్క పని." అంటే చైతన్యవంతులైన బహుజనుల పని, అచేతనంగా ఉన్న బహుజనులను చైతన్యవంతులుగా మార్చడం." ఆవేశ పరులైన బహుజనులు పోరాటాన్ని మొదలుపెట్టగలరు, కానీ సంస్థాగత శక్తి మాత్రమే దాన్ని కొనసాగిస్తుంది. దీనినే బహుజన సంస్థాగత శక్తి అంటున్నారు.

బహుజన ఉద్యమం యొక్క వ్యవస్థాపక శక్తి —కేడర్లు, సంస్థలు మరియు రాజకీయ విద్య ఇటుకలుగా ఓపికతో నిర్మించబడే, జాగృతి నిర్మాణం. బహుజన అవగాహనలో, విప్లవం అనేది ప్రజ్వలించే కాలవ్యవధి కాదు. అది ఒక సుదీర్ఘ సన్నాహక ప్రయాణం. భావోద్వేగం కాగడాను వెలిగించవచ్చు, కానీ దానిని తరతరాలుగా ముందుకు తీసుకువెళ్లేది వ్యవస్థీకరణే. నిర్మాణం లేకుండా, అత్యంత ధర్మబద్ధమైన ఆగ్రహం కూడా నిశ్శబ్దంలో కలిసిపోతుంది. నిర్మాణం ఉంటే, బలహీనమైన స్వరం కూడా చరిత్ర విస్మరించలేని విప్లవంగా మారుతుంది. ఈ అంతర్దృష్టి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ వారసత్వంలో లోతుగా వేళ్ళూనుకొంది. అణగారిన వర్గాలు కేవలం నిరసన తెలపడమే కాకుండా, శాశ్వతమైన సంస్థలను కూడా నిర్మించుకోవడాన్ని ఆయన నేర్పించారు. సంఘాలు, యూనియన్లు మరియు రాజకీయ ప్రాతినిధ్యంపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యత బహుజనుల క్రమబద్ధ ఉద్యమానికి పునాది వేసింది. ఆయన కేవలం హక్కుల కోసం పిలుపునివ్వలేదు—వాటి కోసం ఎలా సంఘటితం కావాలో బోధించారు.

ఆ తర్వాత, కాన్షీరామ్ ఈ సూత్రానికి మరింత స్పష్టమైన, క్రమబద్ధ రూపాన్ని ఇచ్చారు. కేవలం సంఖ్యలు మాత్రమే శక్తిని ఇవ్వలేవని, వాటిని సంఘటితం చేసి, శిక్షణ ఇచ్చి, సైద్ధాంతికంగా పటిష్టం చేయాలని ఆయన గుర్తించారు. ఉద్యమాలు, నిర్మాణాల ద్వారా ఆయన కేడర్-ఆధారిత విధానాన్ని నిర్మించారు. ఈ భావజాలంలో ప్రతీ కార్యకర్త కేవలం మద్దతుదారుడు మాత్రమే కాకుండా, మార్పుకు చైతన్యవంతమైన కారకుడుగా ఉంటారు. బహుజనవాద సంప్రదాయంలో, ఆకస్మికత కంటే వ్యవస్థీకరణకే ప్రాధాన్యత ఉంటుంది. ఆకస్మిక తిరుగుబాట్లు వ్యవస్థను కదిలించగలవు, కానీ సంఘటిత శక్తులు మాత్రమే దానిని పునర్నిర్మించగలవు. అందువల్ల బహుజన ఉద్యమం రాజకీయ విద్యలో—అధ్యయన బృందాలు, చర్చలు, సైద్ధాంతిక శిక్షణ వంటి వాటిలో—లోతుగా పెట్టుబడి పెట్టాలి. ఇవి కేవలం విద్యాపరమైన అభ్యాసాలు కావు; ఇవి చైతన్యాన్ని తీర్చిదిద్దే కార్యశాలలు.

"అచేతనాన్ని మేల్కొల్పడమే చైతన్యం యొక్క కర్తవ్యం." ఈ సూత్రమే బహుజన సంస్థాగత శక్తికి మూల ఆధారం. విశాలమైన బహుజన సమాజంలో రెండు వర్గాలు ఉన్నాయి—తమ చారిత్రక స్థితిని అర్థం చేసుకున్నవారు ఒక వర్గం, వారసత్వంగా వచ్చిన

నిశ్శబ్దంలో ఇంకా జీవిస్తున్నవారు మరో వర్గం. చైతన్యవంతమైన కార్యకర్తల పాత్ర ఆజ్ఞాపించడం కాదు, మేల్కొల్పడం; ఆధిపత్యం చెలాయించడం కాదు, ప్రకాశింపజేయడం.

ఈ ప్రక్రియకు క్రమ శిక్షణ, సహనం, మరియు వినయం అవసరం. ఇది ఆర్భాటాలతో సాధ్యం కాదు, నిరంతర భాగస్వామ్యం ద్వారానే సాధ్యమవుతుంది—గ్రామ సమావేశాలు, క్షేత్రస్థాయి సమీకరణ, మరియు నమ్మకాన్ని పెంపొందించడం వంటివి ఇందులో ముఖ్యమైనవి. మేల్కొన్న ప్రతి వ్యక్తి బహుజన ఉద్యమ వ్యవస్థలో ఒక భాగంగా మారి, సామూహిక సంకల్పాన్ని బలపరుస్తాడు.

అందువల్ల, బహుజన ఉద్యమ వ్యవస్థాపక శక్తి కేవలం సంఖ్యలు లేదా నిర్మాణాలకు సంబంధించినది కాదు. అది పరివర్తనకు సంబంధించినది—వ్యక్తులను చైతన్యవంతులుగా, చెల్లాచెదురుగా ఉన్న సమాజాలను ఐక్యశక్తిగా మార్చడం, చైతన్యాన్ని కార్యాచరణగా, కార్యాచరణను శాశ్వత శక్తిగా మార్చడం. సంఘటితమైన విప్లవాలే నిలబడతాయి. ఈ జ్ఞానంలో వేళ్లూనుకున్న బహుజన ఉద్యమం, నిజమైన మార్పు ఆకస్మికంగా రాదని—దాన్ని పెంపొందించాలని బోధిస్తుంది. ఇందుకు కుల ఆధిపత్య అధికార నిర్మాణాన్ని కాపాడుతున్న RSS వ్యవస్థీకరణను, ఆకస్మికతను పరిశీలిస్తే పాఠకులకు ఈ తత్వం స్పష్టంగా బోధపడుతుంది.

C. విద్య నిష్క్రియ బాధను క్రియాశీల ప్రతిఘటనగా మారుస్తుంది. బహుజనవాదం ఒక ఆయుధంగా రాజకీయ విద్యను పరిగణిస్తుంది. ఈ విషయాన్నీ పూలే, డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్, కాన్షీరామ్ గుర్తించారు. విప్లవకారుని మొదటి కర్తవ్యం విప్లవాన్ని అడ్డుకోలేనిదిగా మార్చడం. స్పష్టత లేని విప్లవం సులభంగా ఓడిపోతుంది. కాబట్టి ప్రజలు తప్పక కుల ఆధిపత్య ధోరణిని అర్థం చేసుకోవాలని బహుజన ఉద్యమం విశ్వసిస్తుంది.

కుల ఆధిపత్య అణచివేత స్వభావం

కుల ఆధిపత్య అధికార నిర్మాణం

కుల ఆధిపత్య చారిత్రక పాత్ర.

బహుజన ఉద్యమంలో రాజకీయ విద్య అనేది పోరాటానికి అలంకారం కాదు—అది దాని వెన్నెముక. శతాబ్దాల అవమానాల కింద నలిగి, బాధతో నిశ్శబ్దంగా కూర్చున్న చోట, విద్య ఒక విభిన్నమైన లయను సృష్టిస్తుంది: మనసు ప్రశ్నించడం ప్రారంభిస్తుంది, నాలుక మాట్లాడటం నేర్చుకుంటుంది, మరియు పాదాలు కవాతు చేయడం నేర్చుకుంటాయి. ఈ పరివర్తనలోనే బహుజన రాజకీయాల సారం ఉంది—నిష్క్రియ సహనాన్ని చైతన్యవంతమైన ప్రతిఘటనగా మార్చడం బహుజన వాద మూల విశ్వాసం.

ఈ మార్గానికి మార్గదర్శకులైన జ్యోతిరావు పూలే, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్, మరియు కాన్షీ రామ్—విద్యను కేవలం అక్షరాస్యతగా లేదా వ్యక్తిగత పురోగతిగా పరిగణించలేదు. వారి దృష్టిలో, విద్య అనేది కుల ఆధిపత్య వ్యవస్థకు వ్యతిరేకంగా పదునుపెట్టిన ఆయుధం. తమను బంధించిన సంకెళ్లను అణగారిన ప్రజలు చూడగలిగేలా పూలే వారికి విద్యా ద్వారాలను తెరిచారు. అంబేద్కర్, " బోధించు సమీకరించు పోరాడు" అని ఉద్ఘాటించి, విముక్తి జ్ఞానానికి తొలి సూత్రం చెప్పారు. కాన్షీరామ్ ఈ అంతర్దృష్టిని క్రమశిక్షణతో కూడిన కేడర్ నిర్మాణంగా మార్చారు, ఇక్కడ రాజకీయ చైతన్యం సామూహిక శక్తికి పునాదిగా మారింది.

కుల ఆధిపత్య అధికార నిర్మాణానికి వ్యతిరేకంగా బలపడే ఏ విప్లవానికైనా ప్రతివిప్లవం సృష్టించగల శక్తి దానికుందని అంబేద్కర్ తన రచనలలో పేర్కొన్నారు. స్పష్టత లేని విప్లవం సారథి లేని రథం లాంటిది—అది కదలవచ్చు, కానీ తన గమ్యాన్ని చేరుకోలేదు. అందువల్ల బహుజన ఉద్యమం, పీడితులు తమ పరిస్థితిని మాత్రమే కాకుండా, అణచివేత వ్యవస్థను కూడా అర్థం చేసుకోవాలని నొక్కి చెబుతుంది. రాజకీయ విద్య, గ్రంథాన్ని చదివినట్లుగా సమాజాన్ని జాగ్రత్తగా, విమర్శనాత్మకంగా, భ్రమలు లేకుండా చదవడానికి మనసుకు శిక్షణ ఇస్తుంది—మొదటగా, విద్య కుల ఆధిపత్యం యొక్క అణచివేత కేవలం విడి వివక్షతా ఘటనలకు పరిమితం కాకుండా, కుల ఆధిపత్య సమూహాన్ని, పాలకకులాలను కాపాడటానికి రూపొందించిన వ్యవస్థగా దాని స్వభావాన్ని బయటపెడుతుంది. అన్యాయం యాదృచ్ఛికం కాదని; అది వ్యవస్థీకృతం చేయబడి, పునరుత్పత్తి చేయబడి, రక్షించబడుతుందని రాజకీయ విద్య జాగృతం చేస్తుంది.

రాజకీయ విద్య కుల ఆధిపత్య అధికార నిర్మాణాన్ని—భూమి, జ్ఞానం, పరిపాలన, మరియు సాంస్కృతిక కథనాలపై వారి నియంత్రణను—బయటపెడుతుంది. అధికారం కేవలం బలప్రయోగం ద్వారానే కాకుండా, తరతరాలుగా సృష్టించబడిన అంగీకారం ద్వారా కూడా ఎలా నిలబడుతుందో రాజకీయ విద్య బహిర్గతం చేస్తుంది.

మూడవది, రాజకీయ విద్య ఈ ఆధిపత్యాన్ని చరిత్ర నేపథ్యంలో నిలుపుతుంది. కులం ఎలా పరిణామం చెందిందో, ఎలా సర్దుకుపోయిందో, మరియు ఆధునిక సంస్థలను ఎలా ప్రభావితం చేస్తూనే ఉందో బహుజన అభ్యాసకుడికి బోధిస్తుంది. ఒకప్పుడు కొద్దిమందిని కీర్తించడానికి వ్రాయబడిన చరిత్ర, ఇప్పుడు తిరిగి బహుజనుల ముందు సత్యాన్ని ప్రతిష్టిస్తుంది. ఈ ప్రక్రియలో, విద్య అనేది మేల్కొలుపుగా, క్రమశిక్షణగా మారుతుంది. విద్య కేవలం సమాచారాన్ని అందించడమే కాదు—పరివర్తనను కలిగిస్తుంది. అది కేవలం భావోద్వేగాలకు లోనుకాకుండా, అవగాహనతో దృఢంగా నిలబడే కార్యకర్తలను నిర్మిస్తుంది. భావోద్వేగం నిప్పురవ్వను వెలిగించవచ్చు, కానీ జ్ఞానం ఆ జ్వాల ఆరిపోకుండా కాపాడుతుంది.

అందువల్ల, బహుజన సంప్రదాయంలో, రాజకీయ విద్య అనేది చైతన్యాన్ని శక్తిగా తీర్చిదిద్దే కొలిమి. అది ఉద్యమం గందరగోళంలో కొట్టుమిట్టాడకుండా, క్షణికమైన ఆగ్రహంలో కరిగిపోకుండా చూస్తుంది. రాజకీయ విద్య, చరిత్ర మార్గదర్శకత్వంలో, జ్ఞానంలో వేళ్లూనుకొని, పోరాటం అడ్డుకోలేనిదిగా మార్చేంత వరకు, నాయకత్వం ద్వారా బలోపేతం చేయబడి, లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

D. బహుజనులు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగాలని బహుజనవాదం సూచిస్తుంది. పైపై పొత్తులను, ముఖ్యంగా అణగారిన వారి ప్రయోజనాలతో విభేదించే ఆధిపత్య వర్గాలతో పొత్తులను బహుజనవాదం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. శక్తి లేకుండా కూటములలోనికి ప్రవేశించడం ఉచ్చులో పడడంవంటిదనీ, శక్తి లేని కూటములు ఉచ్చులుగా బహుజనవాదం నమ్ముతుంది.

"ఒక సమూహం విస్తృత సమాజంలో అధికారంలోకి ప్రవేశించాలంటే, అది ముందుగా తమ శ్రేణులను ఏకం చేసుకోవాలి." దీని అర్థం: ఒక సమూహం విస్తృత సమాజంలో అధికారంలోనికి వెళ్లాలంటే, ముందుగా తనలో ఐక్యత కలిగి ఉండాలి. ముందుగా అంతర్గత బలాన్ని నిర్మించుకోవాలి. బలహీనత నుండి కాకుండా, సమూహ శక్తి నుండి చర్చలు జరపాలి. అందుచేత స్వతంత్ర రాజకీయ శక్తి ప్రాధాన్యతను బహుజన నాయకత్వం ఎన్నడూ విస్మరించదు.

బహుజనుల దృష్టిలో, స్వతంత్ర రాజకీయ శక్తి అనేది కేవలం సంస్థాగత ఎంపిక మాత్రమే కాదు—అది ఆత్మగౌరవానికి వెన్నెముక, శతాబ్దాల భారం కింద నిశ్శబ్దంగా రూపుదిద్దుకునే బలం. అధికారం దానంగా దిగిరాదని, దానిని పెంపొందించుకోవాలని, కాపాడుకోవాలని, స్పష్టతతో ప్రయోగించాలని గ్రహించడమే స్వతంత్ర రాజకీయ శక్తి.

సులభమైన పొత్తులనే మాయాజాలం గురించి బహుజన ఆలోచనా విధానం ఎల్లప్పుడూ హెచ్చరిస్తూనే ఉంది. పురాతన నదిలా చరిత్ర, అణగారిన వారిని కూటములలోకి ఆహ్వానించి, వాటిలోనే వారి గొంతు నొక్కేసిన ద్రోహాల కథలను తనలో మోసుకుపోతుంది. భూమి, సహజ సంపద, ఆదాయం, అధికారం, ఆత్మగౌరవం వంటి కథనాలను నియంత్రించేవారు చేయి చాచినప్పుడు, లెక్కలు వేయకుండా చెయ్యి అందివ్వడం పొరపాటు. తమ సొంత అధికార పీఠం లేకుండా అటువంటి ఏర్పాట్లలోకి ప్రవేశించడం సహకారం కాదు—అది కూటమి కాదు విలీనం. అది జాగ్రత్తగా పన్నిన ఉచ్చు.

మరోమాటలో చెప్పాలి అంటే నీకు సొంతంగా గెలిచే సత్తా లేనప్పుడు నీవు కొద్ది సీట్లు గెలవడం కోసం బలవంతునితో పొత్తుకు వెళ్లడం పొత్తు కాదు విలీనం. ఈ విమర్శలో లోతైన సత్యం ఉంది: అధికారం అధికారాన్ని గౌరవిస్తుంది. కులం, ప్రాంతం లేదా క్షణిక ప్రయోజనాలచే విభజించబడిన, విచ్ఛిన్నమైన ప్రజలు తమ భవిష్యత్తు గురించి చర్చించుకోలేరు. బహుజన వాదంలో ఐక్యత అనేది నినాదం కాదు—అది క్రమశిక్షణ. కేవలం సంఖ్యలను సమీకరించడం మాత్రమే కాదు, చైతన్యాన్ని పెంపొందించుకోవడం, లక్ష్యాలను ఏకం చేయడం, సులభంగా విచ్ఛిన్నం చేయలేని లేదా దారి మళ్లించలేని ఉమ్మడి రాజకీయ సంకల్పాన్ని నిర్మించడం.

బహుజన నాయకుల బోధనలు తరతరాలుగా ఈ సూత్రాన్ని ప్రతిధ్వనిస్తాయి: పొత్తులు కోరే ముందు, బలాన్ని నిర్మించుకోండి; పొత్తుల కోసం మాట్లాడే ముందు, విస్మరించలేని స్వరాన్ని సృష్టించుకోండి. అప్పుడే స్వతంత్ర రాజకీయ శక్తి అధికారాన్ని సాధించే వాహకంగా మారుతుంది. ఆధిపత్య ప్రయోజనాల వక్రీకరణల నుండి విముక్తి పొంది, అణగారిన ప్రజలు తమ సొంత అజెండాను నిర్వచించుకునే, తమ సొంత కలలను వ్యక్తీకరించే, మరియు తమ సొంత మార్గాన్ని నిర్దేశించుకునే సూత్రం ఇదే.

పొత్తులు ఏర్పడినప్పుడు, అవి సమానత్వం నుండి ఉద్భవించాలి, పరాధీనత నుండి కాదు. సంప్రదింపులు ఆత్మగౌరవంలో వేళ్లూనుకొని ఉండాలి, నిరాశలో కాదు. కాబట్టి ఐక్యంగా, వ్యవస్థీకృతంగా ఉన్న బహుజన శక్తి మాత్రమే ప్రజల ఆకాంక్షలను నీరుగార్చకుండా, బహుజనులకు సేవ చేయగలదు.

ఈ దృక్పథంలో, రాజకీయ అధికారం అనేది అంతిమ లక్ష్యం, అది న్యాయాన్ని పరిరక్షించే సాధనం. న్యాయం, విత్తనంలా, సారవంతమైన నేలను కోరుతుంది. ఆ నేలే బహుజనుల అంతర్గత ఐక్యత—దాన్నీ ఓపికతో సారవంతం చేసుకోవాలి. జాగ్రత్తగా కాపాడుకోవాలి.

మొదట బహుజనులు ఏకం కావాలి, లోతుగా సంఘటితం కావాలి, తదుపరి స్వతంత్రంగా నిర్మించుకోవాలి —అప్పుడే అధికారాన్ని అరువు తెచ్చుకోకుండా, సొంతం చేసుకోవచ్చు.

E. బహుజనవాదం శాస్త్రీయ సోషలిజం పునాదిపై నిర్మించబడింది. శాస్త్రీయ సోషలిజం అతిగొప్ప సిద్ధాంతం; అది సుదీర్ఘ పోరాట స్మృతిలో, పీడితుల సహనశక్తిలో, మరియు అన్యాయానికి సరిహద్దులు ఉండవనే స్పష్టమైన గుర్తింపులో రూపుదిద్దుకుంది. కొండ కోనల్లో మొదలై సముద్రంలో కలిసే నదిలా, బహుజన ఉద్యమం స్థానిక గాయాల నుండి పుట్టి,

విశాలమైన, పరస్పరం అనుసంధానమైన ప్రపంచంలో శాస్త్రీయ సోషలిజం ద్వారా తన అర్థాన్ని కనుగొంది.

దాని మూలంలో, భారతదేశంలో పీడితులను బంధించే సంకెళ్ళు కేవలం విడిగా ఏర్పడినవి కావని బహుజనవాదం అర్థం చేసుకుంది. జ్యోతిరావు ఫూలే, బి.ఆర్. అంబేద్కర్, మరియు కాన్షీరామ్ వంటి అంతర్దృష్టులు కేవలం సామాజిక సంస్కరణలకు మాత్రమే పరిమితం కాలేదు; వారు సమాజం యొక్క లోతైన పునర్నిర్మాణాన్ని దర్శించి, ఆర్థిక శక్తిని ఉత్పత్తి చేసేవారే తిరిగి పొందాలని కోరుకున్నారు.

అందువల్ల, బహుజన సమీకరణలో శాస్త్రీయ సోషలిజం, సామ్రాజ్యవాద మరియు పెట్టుబడిదారీ వ్యతిరేక దృక్పథాన్ని స్వీకరిస్తుంది. ఖండాలంతటా విస్తరించిన పెట్టుబడిదారీ విధానం కేవలం ఆర్థిక ఏర్పాటు మాత్రమే కాదని, అది క్రమపద్ధతిలో వ్యవస్థీకృతమైన కనికరంలేని అంతర్జాతీయ వ్యవస్థ అని బహుజనవాదం గుర్తిస్తుంది. అటువంటి వ్యవస్థను ఎదుర్కోవడానికి విచ్ఛిన్నమైన ప్రతిఘటన కాకుండా, ఉమ్మడి భౌతిక ప్రయోజనాలలో స్థిరీకరించబడిన ఐక్యత అవసరమని బలంగా నమ్ముతుంది. భారతదేశంలోని బహుజన పోరాటం, ఆఫ్రికా, లాటిన్ అమెరికా మరియు ఇతర ప్రాంతాలలోని కార్మికుల పోరాటాన్ని ప్రతిబింబిస్తుంది. భాషతో వేరు చేయబడినప్పటికీ, వారి స్వరాలు ఒకే సత్యాన్ని పలుకుతాయి: దోపిడీ వివిధ ముసుగులు ధరిస్తుంది, కానీ దాని ముఖం ఒక్కటే. ఈ నేపథ్యంలో, బహుజన ఉద్యమం ప్రపంచ ఉద్యమంలో భాగమవుతుంది—ఆధిపత్యాన్ని ప్రతిఘటించే వారందరితో చారిత్రక పొత్తుగా నిలుస్తుంది. బహుజనవాదం కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ప్రతిపాదించిన శాస్త్రీయ సోషలిజం సంప్రదాయాలతో పాటు నడుస్తుంది, కులం, గౌరవం, భూమి మరియు సామాజిక శ్రేణి యొక్క జీవన వాస్తవాల ద్వారా వారి ఆలోచనలకు కొత్త రూపాన్ని ఇస్తుంది. సాంప్రదాయ సోషలిజం, వర్గం గురించి మాట్లాడిన చోట, బహుజన సోషలిజం కులాన్ని ఆర్థిక దోపిడీ నుండి విడదీయలేని భౌతిక మరియు నిర్మాణాత్మక శక్తిగా గుర్తించడం ద్వారా విశ్లేషణ చేస్తుంది.

ఈ సంప్రదాయంలో స్వేచ్ఛ అనేది కేవలం ప్రతీకాత్మకం కాదు—అది భౌతికమైనది. దానికి వనరుల పునఃపంపిణీ, భూమి ప్రజాస్వామ్యీకరణ, మరియు బహుజనుల ప్రయోజనాలకు అనుకూలంగా ఉత్పత్తి పునర్వ్యవస్థీకరణ అవసరమని బహుజనవాదం విశ్వసిస్తుంది. కాబట్టి బహుజన ఉద్యమంలో ఐక్యత అనేది భావోద్వేగపూరితమైన పిలుపు కాదు, అది క్రమబద్ధమైన ఆవశ్యకత. ఆర్థిక పరివర్తన లేకుండా, రాజకీయ అధికారం డొల్లగా మిగిలిపోతుంది; ఐక్యత లేకుండా, ప్రతిఘటన చెల్లాచెదురైన నిరసనలుగా విడిపోతుంది.

అందువల్ల, బహుజనవాదం శాస్త్రీయ సోషలిజానికి కొనసాగింపుగానూ, పునరుద్ధరణగానూ నిలుస్తుంది. ఇది సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రపంచ పోరాటాన్ని కొనసాగిస్తూనే, బహుజనుల అనుభవంలోని నిర్దిష్ట సత్యాలతో దానికి నూతనత్వాన్ని అందిస్తుంది. ఏ ప్రజలూ ఒంటరిగా స్వేచ్ఛను పొందలేరని, ఏ దోపిడీ వ్యవస్థనూ విడివిడిగా ఓడించలేరని బహుజనవాదం గుర్తుచేస్తుంది. ప్రపంచంలోని పీడితులు ఒకరినొకరు అపరిచితులుగా కాకుండా, పోరాటంలో సహచరులుగా గుర్తించినప్పుడు, అన్యాయపు పునాదులు వణకడం మొదలవుతాయని బహుజనవాదం ప్రకటిస్తుంది.

F. అఖిల భారత బహుజన విప్లవం అధికారం చేపట్టడానికి ఐక్యత మరియు ఆర్థిక పరివర్తన రెండూ అవసరమని గుర్తిస్తుంది. ఆర్థిక నియంత్రణ లేని రాజకీయ స్వాతంత్ర్యం డొల్ల స్వాతంత్ర్యం. ఈ విషయాన్ని బహుజనవాదం నొక్కి వక్కాణిస్తుంది. బహుజన వాదం ప్రకారం బహుజన ఐక్యతే నిజమైన పాన్-ఇండియనిజం. బహుజనుల ఆర్థిక మార్గంగా శాస్త్రీయ సోషలిజాన్ని బహుజనవాదం స్వీకరిస్తుంది. "భారత దేశాన్ని, బహుజనులను విముక్తి చేయగల ఏకైక సిద్ధాంతం శాస్త్రీయ సోషలిజం మాత్రమేనని బహుజనవాదం విశ్వసిస్తుంది."

కాబట్టి అఖిల భారత బహుజనవాదం మరియు సోషలిస్ట్ దృక్పథం ఈ రెండింటిని బహుజనవాదులు ఆకళింపు చేసుకోవాలి. అధికారం దానధర్మాల వల్ల లభించదని—దాన్ని నిర్మించుకోవాలని బహుజన ఉద్యమం స్పష్టం చేస్తుంది. అది మొదట బహుజనుల

మనస్సులలో, ఆ తర్వాత వారి సామూహిక సంఘటనలో, చివరకు అధికార వ్యవస్థలలో నిర్మించబడుతుంది.

బహుజన భావనలో అఖిల భారత బహుజనవాదం అంటే అగ్రకులాలు సృష్టించిన డొల్ల హిందూ జాతీయవాదం కాదు—అది ప్రాంతాలు, భాషలు, కులాలు, మత విశ్వాసాలు, వర్గాలకు అతీతంగా అణగారిన ప్రజల సజీవ ఐక్యత. పంజాబ్‌లోని ఒక రైతు, తమిళనాడులోని ఒక దళిత కార్మికుడు, మధ్య భారతదేశంలోని ఒక ఆదివాసి, ఆంధ్రలోని ఒక వెనుకబడిన కుల చేనేత చేసే పోరాటాలు విడివిడి కథలు కాదని, అవి ఒకే అసంపూర్ణ చరిత్రలోని అధ్యాయాలని గుర్తించడమే అఖిల భారత బహుజన విప్లవంలో తొలి అడుగు. అణచివేయబడుతున్న స్వరాలు ఏకమైనప్పుడు, అవి విడివిడి నిరసనలుగా ఉండవు—దేశాన్ని పునర్నిర్మించగల శక్తిగా మారతాయి.

అయినప్పటికీ, కేవలం ఐక్యత మాత్రమే విముక్తిని నిలబెట్టలేదు. ఆర్థిక నియంత్రణ లేని రాజకీయ అధికారం నూనె లేని దీపం వంటిదని చరిత్ర నిరూపించింది—అది మొదట మినుకుమినుకుమని వెలిగి, ఆపై ఆరిపోతుంది. నిజమైన స్వాతంత్ర్యం పొలాల్లోకి, కర్మాగారాల్లోకి, మార్కెట్లలోకి, సంపద సంస్థలలోకి ప్రవేశించాలని బహుజన దృక్పథం నొక్కి చెబుతుంది. భూమి, శ్రమ, సహజ వనరులు, గౌరవం, ఆత్మగౌరవం, అధికారం ఇకపై కొద్దిమందికి మాత్రమే పరిమితం కాకూడదు, అవి బహుజనుల సొంతం కావాలని బహుజన వాదం ఆశిస్తుంది.

ఇక్కడే సామ్యవాద దృక్పథం యొక్క ఆవశ్యకత ఆవిర్భవించింది; అది బయటి నుండి దిగుమతి చేసుకున్న సిద్ధాంతంగా కాకుండా, భారతదేశపు ఉమ్మడి శ్రమ, సామూహిక జీవనం, మరియు ఆర్థిక వ్యవస్థ అనే సంప్రదాయాలకు సహజమైన కొనసాగింపుగా ఉంటుంది. బహుజనవాదం శాస్త్రీయ సామ్యవాదాన్ని తన ఆర్థిక దిక్సూచిగా పరిగణిస్తుంది. దోపిడీని నిర్మూలించి, సమానత్వం, ఉత్పత్తి మరియు న్యాయం అనే సూత్రాల ఆధారంగా సమాజాన్ని పునర్వ్యవస్థీకరించే పద్ధతిగా దానిని బహుజనవాదం చూస్తుంది. ఈ వాదం కులం మరియు సామాజిక శ్రేణి ద్వారా అధికారం ఎలా పనిచేస్తుందో బహిర్గతం చేసినట్లే, శాస్త్రీయ

సామ్యవాదం కూడా కుల ఆధిపత్యం మరియు పెట్టుబడి ద్వారా అధికారం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి సాధనాలను అందిస్తుంది. ఈ రెండూ కలిసి సంపూర్ణ దృక్కోణాన్ని ఏర్పరుస్తున్నాయి. అది ఆర్థిక రాజకీయ సామాజిక సంకెళ్లను మరియు వాటిని తయారు చేసిన చేతులను రెండింటినీ బహుజనులకు, ఆధిపత్య కులాల పేదలకు చూపగలుగుతున్నాయి. అందువల్ల, అఖిల భారత బహుజన విప్లవం కేవలం రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవడం గురించి మాత్రమే కాదు; అది దాని మూల సమస్యలను పరిష్కరించి, అందరి అభివృద్ధిని అందించడం గురించి. అది ఆధిపత్యం స్థానంలో గౌరవాన్ని, బహిష్కరణ స్థానంలో భాగస్వామ్యాన్ని, మరియు సంచయం స్థానంలో పంపిణీని తీసుకురావాలని కోరుకుంటుంది.

G. బహుజన వాదంలో క్రమశిక్షణ, త్యాగం, మరియు నిబద్ధత ప్రధాన పాత్రను పోషిస్తాయి. బహుజన నాయకత్వానికి అవసరమైన నైతిక మరియు వ్యక్తిగత పరివర్తన గురించి పూలే, అంబేద్కర్, కాన్షీరామ్ జీవితాలు బహుజన నాయకులకు పాఠాలు నేర్పుతాయి. బహుజన నాయకుడు గొప్ప ప్రేమ భావాలచే నడిపించబడతాడు." ఈ ప్రేమ మెతకతనం కాదు—ఇది స్వప్రయోజనాలకు అతీతంగా ప్రజల పట్ల నిబద్ధత.

బహుజన ఉద్యమం దాని ప్రజల అంతర్గత స్వభావంపై ఆధారపడి నిలబడింది. దాని నైతిక మూలంలో నాలుగు శాశ్వతమైన స్తంభాలు ఉన్నాయి: ప్రేమ, క్రమశిక్షణ, త్యాగం మరియు నిబద్ధత. ఇవి అమూర్తమైన సద్గుణాలు కావు; అవి బహుజన సిద్ధాంతానికి ప్రాణవాయువు వంటివి. అవి ఉద్యమాన్ని మరియు అది సృష్టించాలనుకునే మానవీయ రూపాన్ని తీర్చిదిద్దుతున్నాయి.

## విప్లవ స్ఫూర్తికి పునాదిగా ప్రేమ

జ్యోతిరావు పూలే, డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ మరియు కాన్షీరామ్ వంటి మేధావుల దృష్టిలో, ప్రేమ ఎప్పుడూ నిష్క్రియమైన భావోద్వేగం కాదు—అది పరివర్తనకు ఒక శక్తి; బహుజన

నాయకుడు, అణగారిన ప్రజల పట్ల లోతైన, దాదాపు పవిత్రమైన అనురాగంలో వేళ్లూనుకొని ఉండాలని వారు విశ్వసించారు.

ఈ ప్రేమ మెతకదనం కాదు, దానధర్మాలు చేయడం కూడా కాదు. ఇది ప్రజల బాధలు మరియు ఆకాంక్షలతో తీవ్రంగా మమేకమవ్వడం. అంబేద్కర్ జీవితకాల పోరాటం వ్యక్తిగత లాభం కోసం కాదు, సర్వాన్ని విడిచి అత్యంత అణగారిన వారి పురోగతికై అభివృద్ధికై పనిచేయడం. అటువంటి ప్రేమకు ధైర్యం అవసరం—మార్గం ఒంటరిగా ఉన్నప్పుడు కూడా స్థిరంగా నిలబడేలా అది ప్రేరేపిస్తుంది.

పోరాటానికి పునాదిగా క్రమశిక్షణ

ప్రేమ అగ్ని అయితే, క్రమశిక్షణ దానిని ఒడిసిపట్టే పాత్ర. వ్యవస్థీకరణ, స్పష్టత, సంయమనం అనేవి అత్యవసరం. కేవలం భావోద్వేగ ఆగ్రహంతో శతాబ్దాల నాటి అధిపత్యాలను కూల్చివేయలేమని బహుజన ఉద్యమం నిరూపించింది. అధికారం ఆవేశంతో చేజిక్కించుకోబడదని, ఓర్పుతో కూడిన క్రమశిక్షణాయుత కృషితోనే నిర్మించబడుతుందని కార్యకర్తలకు గుర్తుచేస్తూ, కాన్షీరామ్ తరచుగా కేడర్ ఆధారిత వ్యవస్థీకరణను, క్రమబద్ధమైన పనిని చేసి చూపించే వారు. ఈ నియమం శాశ్వత సత్యాన్ని ప్రతిధ్వనిస్తుంది: క్రమశిక్షణ లేని విప్లవాలు ప్రకాశవంతంగా వెలిగినా త్వరగా ఆరిపోతాయి, అయితే క్రమశిక్షణతో కూడిన ఉద్యమాలు నిలిచి సమాజాన్ని పరివర్తన చెందిస్తాయి.

పరివర్తనకు మూల్యంగా త్యాగం

అణగారిన వర్గాల ప్రతీ చారిత్రాత్మక పురోగతికి త్యాగమే మూల్యం. తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొని జ్యోతిరావు పూలే పాఠశాలలను ప్రారంభించడం నుండి, మేధో, రాజకీయ పోరాటాల కోసం బి.ఆర్. అంబేద్కర్ సుఖభోగాలను త్యజించడం వరకు, బహుజన సంప్రదాయం త్యాగంతో నిండి ఉంది. ఇక్కడ త్యాగం అంటే కేవలం బాధపడటం కాదు—వ్యక్తిగత పురోగతి కంటే సామూహిక విముక్తికి స్పృహతో ప్రాధాన్యత ఇవ్వడం. గొప్ప చారిత్రక ప్రయోజనం కోసం సామాజిక ఒంటరితనాన్ని, ఆర్థిక ఇబ్బందులను, రాజకీయ ఎదురుదెబ్బలను సహించడానికి సిద్ధపడటమే అది. త్యాగం లేకుండా, నిబద్ధత అనేవి డొల్ల మాటలే అవుతాయి.

ఉద్యమ కొనసాగింపుగా నిబద్ధత

ఉద్యమాలు అనేవి క్షణికమైనవి కావు; అవి తరతరాలుగా సాగే సుదీర్ఘ ప్రయాణాలు. విప్లవ జ్యోతి ఆరిపోకుండా ముందుకు సాగేలా చూసేది నిబద్ధతే.

బహుజన దృక్పథానికి అచంచలమైన అంకితభావం కావాలి—అది కేవలం కాలానుగుణమైన క్రియాశీలత కాదు, జీవితకాల నిబద్ధత. సంస్థలను, రాజకీయ చైతన్యాన్ని నిర్మించడంలో కాన్షీరామ్ చేసిన అవిశ్రాంత కృషి ద్వారా ఆయన దీనికి నిదర్శనంగా నిలిచారు. ఒక వ్యక్తి తన తీరిక సమయాన్ని కాదు, జీవితాన్నే ఆశయానికి అంకితం చేయాలని ఆయన తరచుగా పునరావృతం చేసేవారు. ప్రేమ, క్రమశిక్షణ, త్యాగం, మరియు నిబద్ధత అనే ఈ నాలుగు అంశాలు కలిసి బహుజన సిద్ధాంతం కోరుకునే నూతన నాయకుడిని రూపుదిద్దుతాయి. స్వార్థపూరిత ఆశయాలతో రూపుదిద్దుకున్నవాడు కాదు, సామూహిక లక్ష్యంతో తీర్చిదిద్దబడినవాడు బహుజన నాయకుడు. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సామాజిక మార్పుతో పాటు నైతిక పరివర్తనను కూడా నొక్కిచెప్పారు. అన్యాయమైన వ్యక్తులచే న్యాయమైన సమాజాన్ని నిర్మించలేమని ఆయన బహుజనులకు గుర్తు చేశారు. అందువల్ల, బహుజన నాయకుడు కేవలం ఒక రాజకీయ కార్యకర్త మాత్రమే కాదు, ప్రేమతో నడిపించబడి, క్రమశిక్షణతో నిర్మించబడి, త్యాగంతో బలపడి, నిబద్ధతతో నిలబడే నైతిక శక్తి.

H. బహుజనవాదం భారత జాతీయవాదాన్ని, ఏకీకరణ సిద్ధాంతాన్ని వ్యతిరేకించదు. కానీ ఆ వాదాల ముసుగులో నియంత్రణను, అణచివేతను, దోపిడీని, బహుజనవాదాన్ని కూలదోసే చర్యలను సహించదు. నామమాత్రపు ఏకీకరణను తిరస్కరించడం బహుజనవాద సూత్రం. అన్యాయంతో నిండిపోయిన వ్యవస్థలో చేరడం విముక్తి కాదని బహుజనవాదం నమ్ముతుంది. అంబేద్కర్, కాన్షిరాం రాజకీయాల్లో ఉదారవాద ఏకీకరణవాదాన్ని సవాలు చేశారు. ఏకీకరణ అనేది అగ్రకుల ఆధిపత్యాన్ని కొనసాగించడానికి పన్నిన మాయోపాయంగా వారు భావించారు. విప్లవాత్మక రాజకీయాలు అధికారంలోకి ప్రవేశించాలని ఆత్రుతపడవు —కానీ అధికారం పరివర్తన చెందించాలని కోరుకుంటాయి.

సుదీర్ఘ ప్రస్థానంలో, బహుజన ఉద్యమం అధికారం నీడను బ్రతకడానికి, దాని అసలు స్వరూపానికీ మధ్య ఉన్న తేడాను గుర్తించింది. అసమానతల మూలాలను కదిలించకుండా,

కేవలం ప్రతీకాత్మక చర్యలతో సరిపెట్టుకోవడాన్ని అది నిరాకరిస్తుంది. అందువల్ల, నామమాత్రపు ఏకీకరణను తిరస్కరించడం అనేది ప్రతిచర్యగా కాకుండా, బహుజన సిద్ధాంతంలో లోతైన, హేతుబద్ధమైన సూత్రంగా నిలుస్తుంది. దాని మూలంలో, బహుజనవాదం నొక్కి చెప్పేదేమిటంటే, అన్యాయమైన వ్యవస్థలో కేవలం చేర్చబడటం విముక్తి కాదు—అది నిర్బంధం. మీకు వ్యతిరేకంగా నియమాలు ముందే రాసి ఉన్న చోట స్థానం పొందడం సాధికారత కాదు; అది అణచివేతను మెరుగుపరచడమే. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్, సామాజిక మరియు ఆర్థిక ప్రజాస్వామ్యం లేని రాజకీయ ప్రజాస్వామ్యాన్ని "ఇసుకపై కట్టిన ఇల్లు" అని పేర్కొంటూ ఈ భ్రమ గురించి హెచ్చరించారు. ఆయన విమర్శ భాగస్వామ్యంపై కాదు, పరివర్తన లేని భాగస్వామ్యంపైన.

అదేవిధంగా, కాన్షీరామ్ ఆధునిక రాజకీయ రంగంలో ఈ అవగాహనకు మరింత పదును పెట్టారు. అణగారిన వర్గాలకు చెందిన కొద్దిమంది వ్యక్తులను మాత్రమే ఆధిపత్య వ్యవస్థలు తరచుగా ఎంపిక చేసి చేరికను—పదవులను, గుర్తింపు—ఎలా కల్పిస్తాయో ఆయన బహిర్గతం చేశారు.

నామమాత్రపు ఏకీకరణలు న్యాయ సాధనాలు కావు, కేవలం స్థిరీకరణ యంత్రాంగాలు. అణచివేత వ్యవస్థను యథాతథంగా వదిలివేస్తూ, అసమ్మతిని అణచిపెట్టడానికి ఇవి రూపొందించబడ్డాయి. నామమాత్రపు ప్రాతినిధ్యం అనేది ఆధిపత్యం ధరించే ముసుగుగా మారుతుంది; నామమాత్రపు ఏకీకరణ ఆధిపత్యాన్ని కాపాడుతూనే సమానత్వం కోసం చేసే చేసే సంజ్ఞ వంటిది.

అందువల్ల, క్రమమైన ఇంటిగ్రేషన్ సమానత్వానికి దారితీస్తుందన్న ఉదారవాద, సమైక్యవాద వాగ్దానాన్ని బహుజనవాదం తిరస్కరిస్తుంది. ఇది, దాని నామమాత్రపు రూపంలో ఉన్న సమైక్యతను సూక్ష్మమైన ఎత్తుగడగా గుర్తిస్తుంది—అది వ్యక్తులను ఏకాకిని చేసి, వారికి మినహాయింపులు ఇచ్చి ఉన్నత స్థానంలో నిలపడం ద్వారా సామూహిక వాదనను నిర్వీర్యం చేస్తుంది. అలా చేయడం ద్వారా, ఇది అణగారిన వారి ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంది మరియు ఈ వ్యవస్థ న్యాయమైనదని, దానికి పరివర్తన కాకుండా కేవలం సహనం మాత్రమే అవసరమనే అపోహను బలపరుస్తుంది.

జ్యోతిరావు పూలే, అంబేద్కర్ మరియు కాన్షీరామ్ బోధనలలో తన పునాది నిర్మించుకున్న బహుజన దృక్పథం, అణచివేత సంస్థలలోకి ప్రవేశాన్ని కాకుండా వాటి పునర్నిర్మాణాన్ని కోరుతుంది. గౌరవం అనేది దయగా ప్రసాదించబడకుండా, పునాదిగా స్థాపించబడే సమాజ పునర్వ్యవస్థీకరణకు ఇది పిలుపునిస్తుంది. అందుకే బహుజన రాజకీయాలు స్వతంత్ర సంస్థాగత నిర్మాణానికి, సైద్ధాంతిక స్పష్టతకు, మరియు సామూహిక శక్తికి ప్రాధాన్యతనిస్తాయి—తద్వారా భాగస్వామ్యం అనేది లొంగిపోవడం వల్ల కాకుండా, బలం నుండి ఉద్భవిస్తుంది.

బహుజన సంప్రదాయంలో, విప్లవ రాజకీయాలు చేరిక కోసం యాచించవు గాని తాను ప్రవేశించాలనుకుంటున్న వ్యవస్థ యొక్క స్వభావాన్నే ప్రశ్నిస్థాయి: అధికారాన్ని ఎవరు నిర్వచిస్తారు, దాని వల్ల ఎవరు ప్రయోజనం పొందుతారు, మరియు బహుజనులకు సేవ చేసే విధంగా దానిని ఎలా పునర్నిర్మించాలి? అనే ప్రశ్నలను బహుజనవాదం సంధిస్తుంది. పాత కట్టడానికి కొత్త అలంకరణలు లక్ష్యం కాదు, దాన్ని కొత్త సూత్రాల ఆధారంగా పునర్నిర్మించడమే లక్ష్యం. అందువల్ల, నామమాత్రపు ఏకీకరణను తిరస్కరించడం అనేది బహుజనవాదం యొక్క నైతిక స్పష్టత మరియు దూరదృష్టితో కూడిన రాజకీయ చర్య. నదిలా, బహుజన భావజాలం లోతైన పరివర్తన వైపు ప్రవహిస్తుంది.

I. కుల ఆధిపత్య నాయకత్వం కాదు, సామూహిక భాగస్వామ్యాన్ని బహుజనవాదం కోరుకొంటుంది. విప్లవం ప్రజల వాస్తవ జీవితాల నుండి పుట్టాలనీ, చరిత్రను నిర్మించేది ప్రజలేనని నమ్ముతుంది. ఈ అంశాలలో బహుజన నాయకత్వం బహుజనులను జాగృతం చేస్తుంది, నిరంతరం బహుజన అవగాహన నిలబెడుతుంది. జాగృతమైన ప్రజలు సమీకరించబడతారు, వ్యవస్థీకరించబడతారు. వాదం నిలబడాలి అంటే నేటి రాజకీయ పార్టీల మీటింగుల్లా సమూహాలను తరలించకూడదు. అందుచేత పూలే, అంబేద్కర్, కాన్షీరామ్ క్షేత్రస్థాయి సమీకరణకు ప్రాధాన్యతనిచ్చారు.

బహుజన ఉద్యమంలో సామూహిక నాయకత్వం అనేది కేవలం వ్యూహం మాత్రమే కాదు—అది గౌరవం, స్మృతి, మరియు ఒక తత్వం. జ్యోతిరావు పూలే, డాక్టర్ బి. ఆర్.

అంబేద్కర్, మరియు కాన్షీరామ్, నాయకత్వం కొద్దిమందికి మాత్రమే ఉండే ప్రత్యేక హక్కుగానో, లేదా అధికార శ్రేణి ప్రసాదించే అలంకారంగానో భావించలేదు. వారు దానిని ఉమ్మడి లక్ష్యంగా చూశారు—నాయకత్వం అనేది అనేక చోట్ల క్షేత్రాల్లో, కార్ఖానాల్లో, బస్తీల్లో, విద్యాలయాల్లో, సంతల్లో, ఉప్పు మడుల్లో, పల్లెకారుల గ్రామాల్లో, వెలివాడల్లో జన్మించింది—అక్కడ పోరాటాల ద్వారా శ్వాసిస్తుంది. వారి ఆలోచనలో, నాయకత్వం పైనుండి దిగుమతి అయ్యేది కాదు; నాయకత్వం అనుభవం అనే నేల నుండి, న్యాయం అనే స్థితి మొలకెత్తుతుంది. అందువల్ల, ఆధిపత్య కులాల నాయకత్వంతో విముక్తి సాధ్యమవుతుందనే భావనను బహుజనవాదం తిరస్కరిస్తుంది. అటువంటి నాయకత్వం, భాషలో ఎంత శుద్ధమైనదైనా, అణగారిన వారి గాయాలకు, ఆకాంక్షలకు దూరంగానే ఉంటుంది. దానికి బదులుగా, దోపిడీని భరించిన వారే పరివర్తనకు రూపశిల్పులుకావాలని ఈ ఉద్యమం నొక్కి చెబుతుంది. అణగారిన వారు చరిత్రకు కర్తలు కాదు—వారే చరిత్రను సృష్టించేవారు. ఈ కోణంలో, సామూహిక నాయకత్వం అనేది నిరంతర జాగృతి. అది ప్రతి బహుజన నాయకుని 'జాగృత చేతన'గా, అంటే రాజకీయ అవగాహనను ప్రచారం చేసే వ్యక్తిగా మారమని పిలుస్తుంది. నాయకత్వం ఒకే వ్యక్తిలో కేంద్రీకృతం కాకుండా, ఒకదాని నుండి మరొకటి వెలిగించిన దీపాల్లా సమాజమంతటా విస్తరించి ఉండాలి. చైతన్యం వ్యాపించినప్పుడు, సంస్థాగత నిర్మాణం ఏర్పడుతుంది; సంస్థాగత నిర్మాణం బలపడినప్పుడు, అధికారం వేళ్లూనుకుంటుంది. అందుకే బహుజన ఉద్యమం కేవలం అడపాదడపా సమావేశాలకు లేదా ప్రతీకాత్మక సమీకరణలకు పరిమితం కాదు. ఇది కేవలం గుంపులను సమీకరించి, వారిని మళ్ళీ నిశ్శబ్దంలోకి చెదరగొట్టదు. దానికి బదులుగా, ఇది శాశ్వతమైన చైతన్య నిర్మాణాలను నిర్మించడానికి ప్రయత్నిస్తుంది—అవి క్రమశిక్షణతో ముందుకు నడిచే కార్యకర్తలు, ఉమ్మడి లక్ష్యంతో ముడిపడిన సంఘాలు, మరియు బహుజనుల సంకల్పాన్ని ప్రతిబింబించే సంస్థలు.

కుల ఆధిపత్యాన్ని తిరస్కరించడంలో, బహుజన ఉద్యమం పరాధీన సంస్కృతిని కూడా తిరస్కరిస్తుంది. ఇది రక్షకుల కోసం ఎదురుచూడదు; ఇది సమూహాలను నిర్మిస్తుంది. ఇది సామూహిక శక్తిని నిర్మిస్తుంది. బహుజన ఆలోచనలో, నాయకుడు అతీతుడు కాదు, నాయకుడు ప్రజల మధ్యే ఉంటాడు. —ఆధిపత్యం చెలాయించకుండా వారి మాటలను

వింటూ, నేర్చుకుంటూ, మార్గనిర్దేశం చేస్తూ ఉంటాడు. ఈ విధంగా, సామూహిక నాయకత్వం బహుజన ఉద్యమానికి వెన్నెముక: అది దృఢమైనది, సమ్మిళితమైనది మరియు ప్రగాఢమైన ప్రజాస్వామ్యయుతమైనది. ఇది వ్యక్తులతో పాటు క్షీణించని నాయకత్వం, ఎందుకంటే సామూహిక నాయకత్వం ప్రజలలోనే జీవిస్తుంది. ప్రజలు — కేవలం విడివిడి భాగాలుగా కాక, ఐక్య శక్తిగా — మేల్కొన్నప్పుడు, వారు చరిత్రలో కేవలం పాలుపంచుకోవడం మాత్రమే కాదు; దాని గమనాన్నే సమూలంగా మారుస్తారు.

J. వైరుధ్యాల గురించి స్పష్టత ఉండాలని బహుజన సిద్ధాంతం బోధిస్తుంది. బహుజనులతో ఎవరున్నారో—బహుజనులకు వ్యతిరేకంగా ఎవరున్నారో తెలుసుకోవాలని బహుజనవాదం హెచ్చరిక చేస్తుంది. వైరుధ్యంలోని స్పష్టతే ఏ విప్లవాత్మక ఉద్యమానికైనా దిక్సూచి వంటిది. బహుజన పోరాటమనే సుదీర్ఘమైన, ఒడిదుడుకుల ప్రయాణంలో, ఈ స్పష్టత, భ్రమ నుండి జాగృతిని, భాగస్వామ్యం నుండి అధికారాన్ని వేరు చేస్తుంది.

రాజకీయాలలో "అన్ని పొత్తులూ స్వప్రయోజనాలపై ఆధారపడి ఉంటాయి." అంబేద్కర్, కాన్షీరామ్ మిత్రులను శత్రువులతో పొరపాటున పోల్చవద్దని హెచ్చరించారు: డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్, రాజకీయాలు భావోద్వేగాల క్షేత్రం కాదని, వ్యవస్థీకృత ప్రయోజనాల క్షేత్రమని మనకు గుర్తు చేశారు. కాన్షీరామ్ ఈ అంతర్దృష్టిని ఆచరణలోకి తీసుకువచ్చారు. రాజకీయాల్లో పొత్తులు అరుదుగా ఆప్యాయతతో పుడతాయని, అవి అవసరం మరియు స్వప్రయోజనాల కొలిమిలో రూపుదిద్దుకుంటాయని ఆయన హెచ్చరించారు. ఈ విషయాన్ని మరచిపోవడం అంటే, చారిత్రాత్మకంగా పాలించి అణచివేసిన వారి కుట్రల్లోకి కళ్లకు గంతలు కట్టుకుని ప్రవేశించడమే అనేది వారి భావన.

“రాజకీయాల్లో, అన్ని పొత్తులూ స్వప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటాయి.” ఇది కఠోరమైన సత్యం. అణచివేతకు గురైనవారు అధికారాన్ని అది అప్పటికి కనిపించే విధంగా కాకుండా, ఉన్నది ఉన్నట్లుగా, లోతుగా పరిశీలించడం నేర్చుకోవాలని బహుజనవాదం నొక్కి చెబుతుంది. పాలక వర్గాలు తరచుగా బహుజనులను కలుపుకుంటున్నట్లుగా సంకేతాలు ఇస్తాయి, కానీ అటువంటి సంకేతాల వెనుక బహుజన శక్తి యొక్క ఉనికిని నీరుగార్చడం,

విభజించడం లేదా అణచివేయడం వంటి ఉద్దేశ్యాలు దాగి ఉంటాయి.. అందువల్ల, చాచిన ప్రతి చేయి స్నేహ హస్తం కాదని బహుజన ఉద్యమం తన అనుభవాలనుండి బోధిస్తుంది. అందువల్ల, ప్రాథమిక వైరుధ్యాలకు మరియు ద్వితీయ వైరుధ్యాలకు మధ్య తేడాను గుర్తించడం ప్రధాన కర్తవ్యం. ప్రాథమిక వైరుధ్యం బహుజన ప్రజలకు మరియు వారి గౌరవాన్ని, అధికారాన్ని నిరాకరించే కుల, వర్గ, సామాజిక శ్రేణుల వ్యవస్థలకు మధ్య ఉంటుంది. ద్వితీయ వైరుధ్యాలు అణగారిన వర్గాలలోనే లేదా తాత్కాలికంగా జతకట్టినప్పటికీ, బహుజన విముక్తికి ప్రాథమికంగా కట్టుబడి లేని శక్తులతో తలెత్తుతుంది. స్పష్టత లేకపోతే, తాత్కాలిక మిత్రులను శాశ్వత సహచరులుగా—లేదా అంతకంటే దారుణంగా, శత్రువులను మిత్రులుగా పొరబడే ప్రమాదం ఉంది.దీనిని రాజకీయ పద్ధతిగా: స్వతంత్రంగా సంఘటితం కావడం, అంతర్గతంగా బలాన్ని కూడగట్టుకోవడం, మరియు స్పష్టత, అధికారం ఉన్న స్థితి నుండే ఇతరులతో సంప్రదింపులు జరపడం అంటాము. వాస్తవంలో, శక్తిహీనమైన కూటమి ఐక్యత కాదు—అది మారువేషంలో లొంగిపోవడం.

అందువల్ల, బహుజన భావజాలానికి జాగరూకతతో కూడిన చైతన్యం అవసరం. చైతన్యం ఇలా ప్రశ్నిస్తుంది: ఎవరికి ప్రయోజనం? ఎవరు నాయకత్వం వహిస్తారు? ఎవరు నిర్ణయిస్తారు? బహుజనుల పక్షాన నిలబడే వారిని వారి మాటల ద్వారా కాకుండా, అణగారిన ప్రజల భౌతిక మరియు రాజకీయ ప్రయోజనాలతో వారికున్న అనుబంధాన్ని బట్టి అంచనా వేస్తుంది. బహుజనులను వ్యతిరేకించేవారు సంస్కరణ ముసుగు ధరించినప్పటికీ, వాస్తవానికి పాత వ్యవస్థను పరిరక్షించేందుకే వ్యవహరిస్తుంటారు.

వైరుధ్యాలపై స్పష్టత కలిగి ఉండటం అనేది కేవలం మేధోపరమైన సాధన మాత్రమే కాదు—అది మనుగడకు సంబంధించిన నియమం. ఎందుకంటే, బహుజనులు తమ మిత్రులను, శత్రువులను స్పష్టంగా గుర్తించినప్పుడు మాత్రమే—వారు ఐక్యంగా, దృఢసంకల్పంతో—గౌరవం, సమానత్వం మరియు నిజమైన అధికారం అనే గమ్యం వైపు ముందుకు సాగగలరు.

K. అంతేకాక మరికొన్ని ముఖ్యమైన బహుజనవాద ముఖ్య విశ్వాసాలు ఈ క్రింద వ్యాఖ్యానించబడ్డాయి.

బహుజనవాదం ఈ దేశంలోని బహుజనులు ఏకం కావాలని, తమ వారసత్వాన్ని గుర్తించాలని... తమ సొంత లక్ష్యాలను స్వయంగా నిర్దేశించుకోవాలని, రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం సాధించుకోవాలనే పిలుపు. బహుజన విప్లవం ముందు బహుజనుల మనసులో ప్రారంభమవుతుంది. దీనిని బహుజన రాజకీయ స్పృహ (Political Consciousness) అంటాము. బహుజనులు తమ పరిస్థితిని, ఎవరు వారిని అణగదొక్కుతున్నారు, అధికారం ఎలా పనిచేస్తుంది అనే అంశాలను అర్థం చేసుకోవాలి. ఈ స్పష్టత లేకపోతే, తిరుగుబాటు దిశలేని శబ్దం మాత్రమే అవుతుంది.

బహుజన వాదంలో ఐక్యత మరియు సమూహ గుర్తింపు (Unity & Collective Identity) అనేది ప్రధాన పాత్ర పోషిస్తుంది. బహుజనులు ప్రజలు ముందుగా ఒకటిగా నిలవాలి. బహుజనుల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఐక్యతే అధికారానికి పునాది. విభజిత స్వరాలు చరిత్రను మార్చలేవనేది బహుజన సమాజం మూల విశ్వాసం.

బహుజన ఉద్యమం విప్లవం కేవలం నిరసన కాదు; అది అధికార బదిలీ కోసం జరుగుతున్న పోరాటం. రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై బహుజనులు నియంత్రణ సాధించాలి, అప్పుడు మాత్రమే వారి భవిష్యత్తు వారి చేతుల్లో ఉంటుంది. బహుజన ఉద్యమంలో స్వయంనిర్ణయం (Self-Determination) ముఖ్యమైనది. బహుజనులు తమను తాము నిర్వచించుకోవాలి. పీడకుల అణచివేత దృష్టితో కాకుండా, తమ చరిత్ర, సంస్కృతి, ఆశయాల దృష్టితో తమను తాము నిర్వచించుకోవాలి. అప్పుడే బహుజన గౌరవం కార్యరూపం దాలుస్తుంది.

బహుజన ఉద్యమంలో సామూహిక భాగస్వామ్యం (Mass Participation) ముఖ్యమైనది. బహుజన విప్లవం కొద్దిమంది నాయకుల పనికాదు. బహుజన కార్మికులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, —ప్రతి ఒక్కరూ మార్పును కోరే ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ప్రజలు లేని విప్లవం ఉన్నత వర్గాలు చేసే సంస్కరణ మాత్రమే.

బహుజన ఉద్యమంలో ఆర్థిక మార్పు (Economic Transformation) అతి ముఖ్యమైనది. బహుజన ఉద్యమం అధికార బదిలీ రాజకీయ మార్పు కోసం మాత్రమే కాదు, బహుజనుల ఆర్థిక స్థితిలో మార్పు రావడం కోసం. సంపద, వనరులు కొద్దిమందికి కాకుండా ప్రజలందరికీ ఉపయోగపడేలా ఆర్థిక వ్యవస్థ మారాలి ఇది బహుజనవాద లక్ష్యం.

బహుజన ఉద్యమంలో క్రమశిక్షణ మరియు సంఘటన (Discipline & Organization) అనే అంశాలు ముఖ్యమైనవి. బహుజన విప్లవ లక్ష్యం కల్లోలాన్ని, గందరగోళ పరిస్థితులను సృష్టించడం కాదు. వ్యూహంతో, క్రమశిక్షణతో, సంఘటిత శక్తితో ఉద్యమించడం.

సాంస్కృతిక విముక్తి (Cultural Liberation) బహుజన ఉద్యమంలో అంతర్భాగం. బహుజన ఉద్యమం భాషను, చరిత్రను, సంస్కృతిని కూడా పోరాటరంగంగా పరిగణిస్తుంది. బహుజన ఉద్యమం తమ భాష, చరిత్ర, సంప్రదాయాలపై బహుజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందించి పీడక కులాలతో పోరాడుతుంది. బహుజనులంతా ఏకం కావాలి... సంఘటితమై, ఒక పటిష్టమైన రాజకీయ పునాదిని నిర్మించుకోవాలి. బహుజనులకు కావాల్సింది 'అధికారం' ... బహుజన సమాజాల భవిష్యత్తును నిర్ణయించే అధికారం బహుజనులకు కావాలి. బహుజనులు తమ భవిష్యత్తును తామే లిఖించుకోవాలి, వారసత్వంగా పొందకూడదు. బహుజనులు తమను తాము పునర్నిర్వచించుకోవాలి, ఆ పని బహుజనులు మాత్రమే చేయగలరు ... మన ముందు తరాలు కుల వ్యవస్థకు బలైనందుకు బహుజనులు సిగ్గుపడటం మానేయాలి. భవిష్యత్ తరాలు ఈ కులరక్కసికి బలవ్వకుండా చైతన్యం పొందాలి.

"బహుజన హితాయ బహుజన సుఖాయ"

రచయిత డా. మర్లపూడి విజయ్ చంద్ర, ఒక రాహులియన్
కాంగ్రెస్ పార్టీ పరిశోధనా విభాగంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.
అయన ఈ వ్యాఖ్యానంలో నీబహుజన ఉద్యమ అంతరంగాన్ని ఆవిష్కరించారు.
కుల వివక్షత, కుల ఆధిపత్య అధికార నిర్మాణం వంటి మూల సమస్యలపై
విజయం సాధించకుండా అంతరాలు లేని సమాజాన్ని స్థాపించలేమని
ఈ వ్యాఖ్యానం ద్వారా స్పష్టం చేసారు. పెట్టుబడిదారీ విధానం
బహుజన సమాజాన్ని ఏ విధంగా అణచివేస్తుంది, పాలక కులాల పాత్ర,
కుల ఆధిపత్య అధికార నిర్మాణం యొక్క పాత్ర,
బహుజన గుర్తింపు గల నాయకులు ఏ విధంగా ఆలోచించాలి
అనే అంశాలను అయన రమణీయంగా వ్యాఖ్యానించారు.
బహుజనవాద మూల సిద్ధాంతాలను అద్భుతంగా వర్ణించారు.
బహుజన నాయకులకు, పరిశోధకులకు, రాజకీయ పార్టీల నాయకులకు
ఈ వ్యాఖ్యానం బాగా ఉపయోగపడుతుంది.

\- ప్రకాశకులు




ROSHAN
Publications

Visakhapatnam
E-mail: roshanpublications@gmail.com
Mobile : 9493159482